
# చైతన్యరథం





సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## పోలవరం నిర్వాసితుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత

- ఐదేళ్ల పాలనలో పట్టించుకోని జగన్ రెడ్డి
- 26 పునరావాస కాలనీలు పూర్తి చేసిన నాటి టీడీపీ ప్రభుత్వం
- వేగవంతంగా మిగిలిన 49 కాలనీల పనులు
- అధికారులతో సమీక్షలో మంత్రి నిమ్మల

8





# విధ్వంసం నుంచి వికాసానికి..!

## జిల్లాల ఆదాయంలో అనూహ్య మార్పులు

2

- మాటిచ్చినట్టే.. మంచి పాలన అందిస్తున్నాం
- 15శాతం వృద్ధితోనే స్వర్ణాంధ్ర-2047 సాధ్యం
- ప్రజలపట్ల ప్రతి అధికారీ బాధ్యత చూపాలి
- సంక్షేమాన్ని గౌరవప్రదంగా అందించండి..
- ఏప్రిల్ తొలివారంలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్
- 2027నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి
- అన్న క్యాంటీన్లపై నిరంతర పర్యవేక్షణ
- వ్యవసాయ రంగంపై దృష్టి పెట్టండి
- జిఎస్డీపీ పెరుగదలకు గట్టిగా కృషి చేయాలి
- కలెక్టర్ల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నా
- తొలిరోజు కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు



*అమరావతి (చైతన్య రథం): గత ప్రభుత్వ పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న ఎన్నికల హామీని నిలబెట్టుకునేందుకు 9 నెలల పాలనలో కృషి చేశామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్లిందని, జరిగిన నష్టాన్ని అధిగమించి ప్రగతి సాధించేలా, ప్రజలకు సంక్షేమం అందించేలా చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లాల కలెక్టర్లకు సీఎం సూచించారు. సచివాలయంలో మంగళవారం జరిగిన మొదటిరోజు కలెక్టర్ల సమావేశంలో మాట్లాడిన ముఖ్యమంత్రి..రానున్న రోజుల్లో ప్రజల కోసం, జిల్లా కోసం ఏంచేయాలనే దానిపై యాక్షన్ ప్లాన్ తయారుచేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలపై కలెక్టర్ల ప్రభావం ఎక్కువ ఉంటుందని, మీ పనితీరుతో వచ్చే ఫలితాలు వారిపై శాశ్వత ప్రభావం చూపిస్తాయని చంద్రబాబు స్పష్టం చేశారు. 26 జిల్లాల కలెక్టర్ల పనితీరును నిరంతరం సమీక్షిస్తున్నామని చెప్పారు.*

2

## గ్రీవెన్స్.. కనిష్టానికి చేరాలి

2

## ఐదేళ్లలో అర్హులందరికీ ఇళ్లు

- గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం
- ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాల్సింది కలెక్టర్లే
- భూ సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టండి
- క్లిష్టతరం చేస్తే.. ప్రజలు తిరస్కరిస్తారు

3

## తాగునీటి సమస్య రానివ్వొద్దు

- వేసవి పూర్తయ్యేవరకూ కాల్ సెంటర్లు పెట్టండి
- నీళ్ల సమస్యలపై జీపీఎస్-రియల్ టైమ్ పర్యవేక్షణ

3

## మూగజీవాలు జాగ్రత్త!

- వేసవి ఉపశమనాలపై దృష్టిపెట్టాలి
- పశు సంపదకు పుష్కలంగా నీరు, మేత
- పాడి పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యం

3

## వ్యాధుల నియంత్రణపై యుద్ధం

- లైన్ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో వ్యవహరించాలి
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి
- అవసరమైనచోట్ల డ్రోన్లను ఉపయోగించాలి
- అవసరమైనమేర నిధులు ఇచ్చేందుకు సర్కారు సిద్ధం

5

## ఏడాదిలో 20లక్షల రూఫ్‌టాప్‌లు

- సోలార్ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేయాలి
- ప్రతి సెగ్మెంట్‌లో పదివేల రూఫ్‌టాప్‌లు లక్ష్యం

4

## రాష్ట్రంలో జనాభా పెరగాలి

- దక్షిణాదిన జనాభా తగ్గుముఖం పట్టనుంది
- జనాభా నిర్వహణ అత్యంత ప్రాధాన్యతాంశం

6

## రూ.7230 కోట్ల బకాయిలు విడుదల

- గత ప్రభుత్వం రూ.20,637 కోట్ల బకాయిలు పెట్టింది
- ప్రభుత్వోద్యోగులు ప్రభుత్వంలో భాగమే..
- అందుకే ఇబ్బందులున్నా బకాయిలు విడుదల చేశాం
- సాలభ్యాన్నిబట్టి మిగిలిన బకాయిలూ విడుదల చేస్తాం
- పీ-4లో ఉద్యోగ కుటుంబాలు భాగస్వామ్యం కావాలి

4

## సంక్షేమానికి తొలి ప్రాధాన్యం

- పేదరిక నిర్మూలనకు పీ-4 అస్త్రం
- అరకు కాఫీకి ప్రత్యేక బ్రాండింగ్
- చేనేత కార్మికులకు జీఎస్టీ రద్దు
- వడ్డెరలకు క్వారీలు, మత్స్యకారులకు చెరువులు

4



ఐటీ, అడ్వాన్స్డ్ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధికి...

## సిస్కోతో ఒప్పందం

- మంత్రి నారా లోకేష్ సమక్షంలో సిస్కో- ఏపీఎస్ఎస్‌డీసీ ఎంఓయు
- 50వేల మంది యువతకు డిజిటల్, ఐటీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ

7

### వివేకా హత్యకేసు..

## నేరాల్లో పెద్ద కేస్ స్టడీ

- నేరగాళ్లు తెలివిమీరుతున్నారు...
- పోలీస్ శాఖ అప్రమత్తం కావాలి
- జీరో క్రైం లక్ష్యంగా అడుగులేయాలి
- సాంకేతికతే.. పోలీస్‌కు పెద్ద వెపన్
- సీసీటీవీల వినియోగ తీరు భేష్
- 'శక్తి' యాప్‌పై మరింత అవగాహన పెంచండి
- శాంతిభద్రతలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

6

## ప్రైవేటు భూములేవీ 22 ఏలో ఉండకూడదు

- పేదలకు న్యాయం చేయాలన్నదే సీఎం చంద్రబాబు తపన
- 22ఏ, ఫ్రీహోల్డ్ భూములపై ప్రత్యేక డ్రైవ్
- జిల్లాల్లో ప్రత్యేకంగా రియల్ ఎస్టేట్ కమిటీల ఏర్పాటు
- భూ సమస్యలపైన కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ మంత్రి అనగాని

7

### పీపుల్స్ ఫస్ట్ నినాదంతో

## సీఎం చంద్రబాబు పాలన

- అందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలి
- కలెక్టర్ల సదస్సులో ఆర్థికమంత్రి పయ్యావుల

చైతన్యరథం

# విధ్వంసం నుంచి వికాసానికి..!




- మాటిచ్చినట్టే.. మంచి పాలన అందిస్తున్నాం
- 15శాతం వృద్ధితోనే స్వర్ణాంధ్ర-2047 సాధ్యం
- ప్రజలపట్ల ప్రతి అధికారీ బాధ్యత చూపాలి
- సంక్షేమాన్ని గౌరవప్రదంగా అందించండి..
- ఏప్రిల్ తొలివారంలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్
- 2027నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి
- అన్న క్యాంటీన్లపై నిరంతర పర్యవేక్షణ
- వ్యవసాయ రంగంపై దృష్టి పెట్టండి
- జిఎస్డీపీ పెరుగదలకు గట్టిగా కృషి చేయాలి
- కలెక్టర్ల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నా
- తొలిరోజు కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): గత ప్రభుత్వ పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న ఎన్నికల హామీని నిలబెట్టుకునేందుకు 9 నెలల పాలనలో కృషి చేశామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్లిందని, జరిగిన నష్టాన్ని అధిగమించి ప్రగతి సాధించేలా, ప్రజలకు సంక్షేమం అందించేలా చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లాల కలెక్టర్లకు సీఎం సూచించారు. సచివాలయంలో మంగళవారం జరిగిన మొదటిరోజు కలెక్టర్ల సమావేశంలో మాట్లాడిన ముఖ్య మంత్రి... రానున్న రోజుల్లో ప్రజల కోసం, జిల్లా కోసం ఏంచేయాలనే దానిపై యాక్షన్ ప్లాన్ తయారు చేసు కోవాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలపై కలెక్టర్ల ప్రభావం ఎక్కువ ఉంటుందని, మీ పనితీరుతో వచ్చే ఫలితాలు వారిపై శాశ్వత ప్రభావం చూపిస్తాయని చంద్రబాబు స్పష్టం చేశారు. 26 జిల్లాల కలెక్టర్ల పనితీరును నిరంతరం సమీక్షిస్తున్నామని చెప్పారు.

## ప్రజా సంక్షేమం మీ బాధ్యత

సంక్షేమం ఫలాలు సక్రమంగా ప్రజలకు అందాలి. ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమం చివరిస్థాయికి చేరాలి. ప్రజలకు ఇచ్చే సంక్షేమ పథకాలను దానం చేసినట్టు కాకుండా గౌరవభావంతో ఇవ్వాలి. ప్రతి అధికారీ బాధ్యతగా వ్యవహరించాలి. ప్రజలే ఫస్ట్ విధానంతో ముందుకెళ్లాలి. మీరు చేసే ప్రతిపనినీ సమీక్షిస్తున్నాం. పౌరులకు అందించే 22 సేవల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నాం. ఈ ప్రభుత్వం మా కోసమే పని చేస్తోందన్న నమ్మకం ప్రజల్లో కలిగించాలని కలెక్టర్లకు పిలుపునిచ్చారు.

## డీఎస్సీ మెగా నోటిఫికేషన్

ఏప్రిల్ మొదటి వారంలోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. పగడ్బందీగా మెగా డీఎస్సీ నిర్వహించాలి. 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయాలనే దస్త్రంపైనే మొదటి సంతకం చేశాం. పాఠశాలలు ప్రారంభించే సమయానికి నియామకాలు పూర్తవ్వాలి. గతంలో రాష్ట్రంలో ఒకేసారి 1.5లక్షల టీచర్ ఉద్యోగాలిచ్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానిది. 80శాతం ఉపాధ్యాయులను మా హయాంలోనే నియమించామని చంద్రబాబు గుర్తు చేశారు.

## విజన్ మనకొక డైరెక్షన్

స్వర్ణాంధ్ర- 2047 డాక్యుమెంట్‌లో 10 సూత్రాలు పొందుపరిచాం. రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ సచివాలయ పరిధి వరకూ ప్రణాళికలు ఉండాల్సిందే. జిల్లాలో విజన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కలెక్టర్ ఉంటారు. నియోజవకర్గాలకు ఎమ్మెల్యే ఛైర్మన్‌గా ఉంటారు. రాష్ట్రంలో రూ.55వేల కోట్ల విలువైన జాతీయ రహదారుల పనులు జరుగుతున్నాయి. రెండే ళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తవ్వాలి. పర్యావరణ, ఇతర అను మతులకు కలెక్టర్లు చొరవ తీసుకోవాలని చంద్రబాబు సూచించారు.

## పాలనకు ప్రజామోదం ఉండాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అయింది. ఈ కొద్ది కాలంలోనే 3వసారి కలెక్టర్లతో సమావేశం నిర్వహించుకుంటున్నాం. ప్రతి త్రైమాసికానికి ఒక సమావేశం పెట్టుకుని రాబోయే 3 నెలలు ఏంచేయాలో యాక్షన్‌ప్లాన్ రూపొందించుకుంటున్నాం. అధికార యంత్రాంగం ప్రజలకు ఆమోదయోగ్యమైన పాలన అందించడానికి ప్రయత్నించాలి. గత ఐదేళ్లు రాష్ట్రంలో విధ్వంసమే సాగింది. దీంతో ప్రజల్లో తీవ్రమైన అసహనం వ్యక్తమైంది. ఎన్నికల్లో కూటమికి 93 శాతం స్ట్రైక్‌రేట్ వచ్చింది. దీనికి కారణం విధ్వంస పాలనను ప్రజలు ఆమోదించలేదు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆశలు కూడా ఎక్కువగానే పెట్టుకున్నారని చంద్రబాబు గుర్తు చేశారు.

## ఆదాయంతోనే సంక్షేమం సాధ్యం

సంక్షేమం, అభివృద్ధి, స్వపరిపాలన అనే మూల స్తంభాలపైనే సుపరిపాలన ఆధారపడి ఉంటుంది. పేద రికంపోయి ప్రజలు సంతోషంగా ఉండాలంటే సంక్షేమ కార్యక్రమాల అమలు తప్పనిసరి. సంక్షేమ కార్యక్రమా లు అమలుచేయాలంటే తగినంత ఆదాయం రావాలి. అప్పులతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తే స్థిరంగా కొనసాగవు. గత ప్రభుత్వం రూ.9.74 లక్షల కోట్లు అప్పులు చేసింది. ఆ అప్పులు తీర్చాలి, వాటికి వడ్డీలు కట్టాలి అంటూ రాష్ట్ర ఆర్థిక వాస్తవ పరిస్థితిని సీఎం చంద్రబాబు కలెక్టర్లకు వివరించారు.

## చాలా హామీలు నెరవేర్చాం

అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అనేక హామీలు నెరవేర్చాం. దేశంలో ఎక్కడాలేని విధంగా పింఛన్‌లు రూ.4 వేలు ఇస్తున్నాం. రూ.200ఉన్న పింఛన్‌ను 2014లో రూ.2వేలు చేశాం. ఇప్పుడు రూ.3 వేల నుంచి రూ.4వేలకు ఒకేసారి పెంచాం. రూ.500 ఉన్న దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేలు చేశాం. దాన్ని మళ్లీ ఇప్పుడు రూ.6 వేలకు పెంచాం. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమైన వారికి మానవతా దృక్పదంతో రూ.15 వేలు ఇస్తున్నాం. ఇంతమంచి కార్యక్రమాలు చేస్తున్నప్పుడు ప్రజలకు ఇవన్నీ తెలియజేయాలి. అందుకే ప్రతినెలా 1న 'పేదల సేవలో..' కార్యక్రమం నిర్వహిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

## అన్నా క్యాంటీన్‌లు సందర్శించండి

రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చడానికి 204 అన్న క్యాంటీన్‌లు నెలకొల్పాం. కలెక్టర్‌లు కూడా అన్న క్యాంటీన్‌లను సందర్శించాలి. దీపం-2 పథకం కింద ఏడాదికి 3గ్యాస్ సిలిండర్‌లు ఇస్తున్నాం. ఇచ్చినమాట ప్రకారం చెత్త పన్ను, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం. మత్స్యకారుల పొట్టగొట్టే 217జీవో రద్దు చేశాం. గీత కార్మికులకు మద్యం షాపులు 10శాతం కేటాయించాం. చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేశాం. మగ్గాలకు 200యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందిస్తున్నాం. బీసీ, ఎస్సీలకు ఇంటి నిర్మాణానికి రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనంగా ఇస్తున్నాం. ఈ వేసవి కాలంలో వడదెబ్బ తగిలి ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ జాగ్రత్తలు సూచించాలి. ఎక్కడా తాగునీరు లేదనే మాట రాకూడదని కలెక్టర్లకు జాగ్రత్తలు చెప్పారు.

## 2027నాటికి పోలవరం నిర్మాణం పూర్తి

పోలవరాన్ని కేంద్ర సహకారంతో గాడినపెట్టామని చంద్రబాబు అన్నారు. 2027నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని అన్నారు. అమరావతి రాజధాని

- (మిగతా వివరాలు 3లో)

### జిల్లాల ఆదాయంలో

## అనూహ్య మార్పులు

**- కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం**

అమరావతి(చైతన్య రథం): మూడవ కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాల మధ్య తలసరి ఆదాయంలో వచ్చిన మార్పులపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 2022-23 సంవత్సరానికిగాను సత్యసాయి జిల్లాలో తలసరి ఆదాయం 2,19,234 రూపాయలు. అనంతపురం జిల్లాలో 2,33,521 రూపాయలు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1,93,763 రూపాయలుగా నమోదైంది. సాధారణంగా అనంతపురం జిల్లా కరువు పీడిత ప్రాంతంగా, వెనుకబడిన జిల్లాగా పరిగణించబడుతుంది. అయితే, కోనసీమలో తలసరి ఆదాయం ఎక్కువుగా ఉంటుందని భావిస్తారు. ఉద్యాన రంగంలో సాధించిన అభివృద్ధి కారణంగా అనంతపురం జిల్లాలు తలసరి ఆదాయంలో వృద్ధిని సాధించాయి. తలసరి ఆదాయంలో ముందున్న జిల్లాలలోని ఉత్తమ విధానాలను వెనుకబడిన జిల్లాలలో కూడా అమలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా, పశుసంవర్ధక రంగం అధిక ఆదాయాన్ని అందిస్తూ, ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తోందని, ఆ తర్వాత ఉద్యానవన, తయారీ రంగాలు ఉన్నాయని, ఈ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లకు సీఎం చంద్రబాబు సూచించారు.

## గ్రీవెన్స్.. కనిష్టానికి చేరాలి

**కలెక్టర్లకు సీఎం చంద్రబాబు పిలుపు**

అమరావతి (చైతన్య రథం): ప్రజలనుంచి అందే ఏ ఫిర్యాదులనైనా మొక్కుబడి వ్యవహారంలా కాకుండా.. సంతృప్తికర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్లకు సీఎం చంద్రబాబు సూచించారు. ఈ ఏడాది జూన్ 15 నుంచి ఈనెల 19 వరకు రాష్ట్రంలో మొత్తం 8 లక్షల 26 వేల ఫిర్యాదులురాగా.. వాటిలో ఇప్పటివరకు 7 లక్షల 22 వేల ఫిర్యాదులు పరిష్కరించారన్నారు. పరిష్కరించిన ఫిర్యాదుల్లో 6 లక్షల 99 వేలు ఎస్ఎల్ఏకు లోబడి, 22 వేల 770 ఫిర్యాదులను ఎస్ఎల్ఏకు ఆవల పరిష్కరించారన్నారు. ఫిర్యాదులను కేవలం రొటీన్ విధానంలో పరిష్కరించడం కాకుండా, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి క్వాలిటీ డిస్పోజల్ చేయాలన్నారు. జిల్లా కలెక్టర్లు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అదేవిధంగా ఎక్కువ ఫిర్యాదులు వచ్చే శాఖలు పరిష్కారంపై మరింత దృష్టి పెట్టాలన్నారు. గ్రీవెన్స్ రిడ్రెస్సల్‌పై ఎక్స్‌టర్నల్ ఆడిట్ చేయాలని అంటూ.. వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి గ్రీవెన్స్ కనిష్టస్థాయికి చేరాలని సీఎం పిలుపునిచ్చారు. అంతకుముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ.. రాష్ట్రంలో మొత్తం 8 లక్షల 26 వేల ఫిర్యాదులు రాగా వాటిలో 7 లక్షల 22 వేలు పరిష్కరించామని వివరించారు. వాటిలో 5 లక్షల 72 ఫిర్యాదుల ఆడిట్ ప్రక్రియను కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో 2 లక్షల 59 వేల 642 రీసర్వేకు సంబంధించినవి, 2 లక్షల 34 వేల 944 రెవెన్యూ సదస్సులు ద్వారాను, లక్షా 91 వేల 494 ఫిర్యాదులు పీజీఆర్ఎస్ ద్వారా వచ్చాయని సీఎస్ విజయానంద్ పేర్కొన్నారు.

# ఐదేళ్లలో అర్హులందరికీ ఇళ్లు

- గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం
- ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాల్సింది కలెక్టర్లే
- భూ సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టండి
- క్లిష్టతరం చేస్తే.. ప్రజలు తిరస్కరిస్తారు
- కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి (చైతన్య రథం): రానున్న ఐదేళ్ల కాలంలో అర్హులందరికీ ఇళ్లందించే సత్సంకల్పంతో ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మూడవ జిల్లా కలెక్టర్ల సమావేశం తొలిరోజు రెవెన్యూ సమస్యల పరిష్కార మార్గాలపై చంద్రబాబు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యంగా వివరించారు. ఇదివరకే లబ్ధిపొందినవారి అభిప్రాయాలను సేకరించి.. వారుకోరిన విధంగా ఇంటి పట్టాలనుకాని, దానికి సంబంధించిన ఆర్థిక వనరులను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు అన్ని విధాలా లబ్ధి చేకూర్చే మార్గాలను ఆలోచించాలని కలెక్టర్లకు సూచించారు. రెవెన్యూ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయికాని, వాటిని సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మార్గాలు వెతకాలికాని, సమస్యలను క్లిష్టతరం చేయొద్దని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. భూమి అనేది ప్రజలకు సంబంధించిన సున్నితమైన అంశమని, దాన్ని క్లిష్టతరం చేసి ప్రజల తిరస్కారానికి గురికావద్దని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ల్యాండ్ రికార్డులు చాలావరకు సరళంగా ఉండేవని.. గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలు, రికార్డులను తారుమారు చేయడంవల్ల సమస్యలు ఉత్పన్నమయ్యాయన్నారు. కేవలం భూసంబంధిత సమస్యలు మాత్రమే 60నుంచి 70శాతం ఉన్నాయన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో ఈవిధంగా రెవెన్యూ సమస్యలు ఉత్పన్నమవ్వడానికి గల కారణాలు ఏంటి అని అధికారులను ప్రశ్నించారు. త్వరితగతిన భూసమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలవారీగా సంబంధిత కలెక్టర్లు, అధికారులు భూసమస్యలు పరిష్కార ప్రక్రియ ఏవిధంగా చేపడుతున్నారో అడిగి తెలుసుకోవడంతోపాటు భూ సమస్యల పరిష్కారానికి పలు జిల్లాల కలెక్టర్ల నుంచి సలహాలు సూచనలు తీసుకున్నారు. ఒక నిర్దిష్ట కాలపరిమితిని నిర్దేశించుకుని ఆ వ్యవధిలో వీలైనంత వరకు సమస్యలకు పరిష్కారంచూపే దిశగా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు.

# విధ్వంసం నుంచి వికాసానికి..!

(2వ పేజీ తరువాయి)

పనులు కూడా చేపట్టామని, ప్రపంచబ్యాంకు, ఏడీబీ వంటి సంస్థలనుంచి ఆర్థిక సాయం తీసుకుంటున్నా మని వివరించారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్. ప్రపంచంలోనే బెస్ట్ మోడల్‌గా అమరావతి అభివృద్ధి చేస్తున్నాం. ప్రజలూ భాగస్వాములయ్యేలా చర్యలుండాలి. నక్కపల్లి స్టీల్ ప్లాంట్ నిర్మాణంలోనూ ఈ తరహా మోడల్స్ చేపట్టాలి. అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయడం అమరావతితో ప్రారంభమైంది. అమరావతి రాజధానికి కొత్త రైల్వేలైన్‌తో పాటు, విశాఖ రైల్వే జోన్ సాధించామని అన్నారు.



## ప్రయాణం సాఫీగా సాగేలా రోడ్లు

గత ప్రభుత్వం రోడ్ల మరమ్మతులను పట్టించుకో లేదు. ఎక్కడ చూసినా గోతులే ఉన్నాయి. అందుకే రూ.861 కోట్లతో 20వేల కి.మీ మేర గుంతలు పూడుస్తున్నాం. దాదాపు 95శాతం మేర పనులు పూర్తయ్యాయి. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునేవారికి కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సీడీ ఇస్తున్నాయి. రాష్ట్రంలో 20 లక్షల సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నాం. విద్యా వ్యవస్థను ప్రక్షాళను చేశాం. రూ.4 వేల కోట్లతో 40 వేల పనులను పల్లె పండుగ కార్యక్రమం కింద ప్రారంభించాం. వాటర్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టాలి. మే నెలలో తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు అందిస్తాం. స్కూళ్లు తెరిచేలోపు అమ్మఒడి అందజేస్తాం. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20వేలు అందిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## జీఎస్డీపీ పెరుగుదల తప్పనిసరి

విజన్ అమల్లో రాజకీయ ఒత్తిడిలు తలెత్తకుండా జిల్లాలకు స్థానికేతర అధికారులను జిల్లా ప్లానింగ్ బోర్డు ఛైర్మన్‌గా నియమించామన్నారు. జిల్లాల్లో సంపద సృష్టికి ఏం చేయగలుగుతారో ఆలోచించాలి. జీఎస్డీపీ పెరుగుదల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి, ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. తద్వారా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చు. రూ.3.27 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. వచ్చే ఏడాదికి 15 శాతం తగ్గకుండా జీఎస్డీపీ సాధించేలా కలెక్టర్‌లు కృషిచేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. 2014–19 మధ్య 13.5 శాతం గ్రోత్ రేట్ ఉంటే 2019–24 మధ్య 10.32 శాతానికి తగ్గింది. 2024–25 మధ్య 12.02 గ్రోత్‌రేట్ సాధించాం. ఒక శాతం గ్రోత్ రేట్ పెరిగితే రూ.15 వేల కోట్ల ఆదాయం వస్తుంది. 2047 నాటికి రూ.54.60 లక్షల తలసరి ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నాం. తలసరి ఆదాయం 2023–24 మధ్య రూ.2.66 లక్షల ఉంటే, 2024–25 మధ్య రూ.2.98 లక్షలకు పెరిగింది. స్వర్ణాంధ్ర విజన్‌లో రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని ఆవిష్కరించాలనేది ప్రభుత్వ సంకల్పంగా చంద్రబాబు వివరించారు.

## వ్యవసాయరంగంపైనా దృష్టి పెట్టాలి

ఏపీ అంటే ఒకప్పుడు అన్నపూర్ణగా పేరుంది. జిల్లాల్లో వ్యవసాయం, దాని అనుబంధరంగాల పైన దృష్టి పెట్టాలి. మారిన ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఉత్పత్తులు రావాలి. హార్టికల్చర్‌కు సీమలో మంచి అవకాశాలున్నాయి. సీమలో ఇప్పుడు డెల్టాకంటే మంచి ఆదాయం వస్తోంది. అనంతపురం ఒకప్పుడు కరవు జిల్లాగా మారుతుంది అనుకున్నాం.కానీ హార్టికల్చర్, పరిశ్రమల రాకతో రాష్ట్రంలో 5వ ఆర్థిక వ్యవస్థగా మారింది. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ ఎనర్జీ పరిశ్రమలు వస్తున్నాయి. రాబోయే ఐదేళ్లలో గ్రీన్ ఎనర్జీలో రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు, 7.5 లక్షల ఉద్యోగాలు సాధించేలా ముందుకెళ్తున్నాం. పర్యాటకంలో 20 శాతం గ్రోత్ రేట్ లక్ష్యంగా పెట్టుకున్నామని చంద్రబాబు అన్నారు.

## బకాయిలన్నీ వసూలు చేయాలి

జీఎస్టీపై సమీక్షలు చేసి బకాయిలు వసూలు చేయాలని చంద్రబాబు సూచించారు. పన్ను ఎగవేతదారులపట్ల కఠినంగా ఉండాలి. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను కూడా ప్రక్షాళన చేస్తాం.మున్సిపల్‌శాఖలో ఫిర్యాదుల రాకుండా ఉన్నప్పుడే బాగా పనిచేసినట్టు భావిస్తాం. శాంతి భద్రతల విషయంలో రాజీపడొద్దు. గంజాయి సరఫరా చేసి, రౌడీయిజం చేసే వారిపట్ల ఉక్కుపాదం మోపండి. శాంతి భద్రతల పరిరక్షణకు కలెక్టర్లు జిల్లా ఎస్పీల తో కలిసి పనిచేయాలని చంద్రబాబు కలెక్టర్లకు సూచించారు.

# తాగునీటి సమస్య రానివ్వొద్దు

- వేసవి పూర్తయ్యేవరకూ జిల్లాల్లో కాల్ సెంటర్లు పెట్టండి
- నీళ్ల సమస్యలపై జీపీఎస్ - రియల్ టైమ్ పర్యవేక్షణ
- జిల్లా కలెక్టర్లకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశం

అమరావతి (చైతన్య రథం): వేసవిలో ఎక్కడా మంచినీటి సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలిచ్చారు. వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలు ఎక్కడైనా సరే మంచినీళ్ల కోసం ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికోసం వేసవి కాలం పూర్తయ్యేవరకు జిల్లాలో తాత్కాలిక కాల్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మంచినీళ్ల సమస్య ఎక్కడైనా తలెత్తినా దాన్ని రియల్ టైమ్‌లో పర్యవేక్షించి పరిష్కరించాలన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను అన్నిటినీ నీటితో భర్తీ చేసుకోవాలన్నారు. ప్రజలకు మంచినీరు అందించే ఏర్పాట్లకు సంబంధించి ఎక్కడా నిధులకు కొరత లేదని, జిల్లా కలెక్టర్లు దీనిపైన ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వేసవి నీటి ఎద్దడి ఎదుర్కోవడంలో హేతుబద్ధంగా పనిచేయాలని, అప్పుడే ప్రజలు మన పనులను హర్షిస్తారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా కూడా తనకు మంచినీటి సమస్య కనిపించకూడదని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సీఎం చంద్రబాబు ఆదేశించారు.

# మూగజీవాలు జాగ్రత్త!

- వేసవి ఉపశమనాలపై దృష్టిపెట్టాలి
- పశు సంపదకు పుష్కలంగా నీరు, మేత
- పాడి పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యం
- సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి (చైతన్య రథం): ఏటికేడాది ఉష్ణోగ్రతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో –పశుసంపద పరిరక్షణ ప్రభుత్వ ప్రాధాన్యం కావాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ‘2024 హాటెస్ట్ ఇయర్‌గా నమోదైంది. ప్రస్తుత ఉష్ణోగ్రత గణాంకాలను విశ్లేషిస్తే ఈ ఏడాది అంతకుమించి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఎక్కడా మూగజీవాల మేతకు, తాగునీటికి ఇబ్బంది లేకుండా కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఇప్పటికే 9,044నీటితొట్టెలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మరో 15 రోజుల్లో మరో 12,138 తొట్టెల ఏర్పాటు పూర్తి చేయాలని, ఇందుకు కలెక్టర్లు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. తడి దాణా, పొడి దాణా లభ్యత, లోటు ఏమైనావుంటే ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలన్నారు. మేత విషయంలో క్వాంటిటీతో పాటు క్వాలిటీ, పోషకాలపై దృష్టి సారించాలని, గ్రామీణ ప్రాంతాలలో సర్క్యులర్ ఎకానమీకి అత్యాధునిక నమూనాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా స్వయం సహాయక సంఘాలను పాడి పరిశ్రమకు అనుసంధానించాలని పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా పచ్చి మేత పెంపకానికి చర్యలు తీసుకోవాలని, తొలి దశలో ప్రతి జిల్లాలో కనీసం పదివేల ఎకరాల్లో పచ్చి మేత పెంపకానికి చొరవ చూపాలన్నారు. ఈ మేతను రాయితీపై రైతులకు అందించడం వల్ల సంపద సృష్టికి బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. బీపీఎల్ కుటుంబాలకు ఆదాయంతోపాటు మహిళా ఆర్థిక సాధికారతకు దోహదం చేస్తుందని సూచించారు. నేపియర్ గడ్డి పశువుల మేతకు ఉపయోగపడటంతోపాటు బయో ఫ్యూయల్ తయారీకి కూడా ఉపయోగపడుతోందని, దీనిపైనా దృష్టి సారించాలని కలెక్టర్లకు సూచించారు. వివిధ అంశాలను విశ్లేషించి గ్రామీణ ప్రాంతాలలో ఆర్థిక పరిపుష్టికి వినూత్న విధానాలను అనుసరించడంలో క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలని చంద్రబాబు సూచించారు. అధిక ఆదాయాలు.. తద్వారా పేదల జీవన ప్రమాణాలు పెరిగేలా చేయడంలో కీలకమైన పాడి పరిశ్రమకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని అంటూ.. డెయిరీ డ్వాక్రా అనుసంధానంతో మంచి ఫలితాలు ఉంటాయని విశ్లేషించారు.



# ఏడాదిలో 20లక్షల రూఫ్‌టాప్‌లు




- సోలార్ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేయాలి
- ప్రతి సెగ్మెంట్‌లో పదివేల రూఫ్‌టాప్‌లు లక్ష్యం
- పీఎం సూర్యఘర్ పథకంపై చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి (చైతన్య రథం): ప్రస్తుత ఏడాదిలో రాష్ట్రంలో 20 లక్షల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ల ఏర్పాటుకు కలెక్టర్లు కృషి చేయాలని సీఎం చంద్రబాబు లక్ష్యనిర్దేశం చేశారు. పీయం సూర్యఘర్ పథకంపై కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 10వేల రూఫ్ టాప్ యూనిట్లు ఏర్పాటుకులక్ష్యంగా పెట్టు కున్నామన్నారు. ఆ ప్రకారం ఈ ఏడాది రాష్ట్రంలో 20 లక్షల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు దిశగా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్లు ప్రత్యేక దృష్టిపెట్టి బాధ్యత తీసుకోవాలన్నారు. 2 కిలోవాట్ రూఫ్‌టాప్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు కేంద్రం 60వేలు, రాష్ట్రం రూ.55 వేలు సబ్సిడీగా అందించి నూరుశాతం ఉచితంగా ఇస్తున్నామన్నారు. వారి అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అందిస్తే యూనిట్‌కు రూ.2.9పైసల వంతున చెల్లిం చడం జరుగుతుందని సీఎం పేర్కొన్నారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలకు 200యూనిట్లు వరకూ ఉచిత విద్యుత్ అంది స్తున్నామని, ఈ పథకం అమలుతో వారికి మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. అదే బీసీ వర్గాలకైతే.. 2కిలో వాట్‌కు కేంద్రం రూ.60వేలు,రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు అందించనుండగా.. మరో రూ.35వేలను లబ్దిదారులు బ్యాంకు ద్వారా రుణం పొంది ఐదేళ్ల కాలపరిమితితో తిరిగి చెల్లించ వచ్చన్నారు.

ఈ యూనిట్లు ఏర్పాటు చేసుకున్నవారు వారి అవసరాలకు వినియోగించగా మిగి లిన విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇస్తే యూనిట్ 2రూ.ల 90 పైసలకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. అన్ని రాష్ట్రాలూ ఈ పథకం అమలు ప్రారంభించక ముందే మనం వీలైనన్ని యూనిట్లు ఏర్పాటుకు కృషి చేయాలని సీయం స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పవర్ పాయింట్ ప్రజెంటే షన్ చేస్తూ.. పీయం సూర్యఘర్‌ను కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించడం జరిగిందని వివరించారు. రాష్ట్రంలో 200 యూనిట్లు వరకూ ఉచిత విద్యుత్ పొందుతున్న ఎస్సీ,ఎస్టీ లబ్ధిదారు లను గుర్తించడం జరిగిందని అన్నారు. వారందరూ ఈ పథకాన్ని పూర్తిగా సద్విని యోగం చేసుకునేలా చూడాలని చెప్పారు. పీయం సూర్యఘర్ కార్యక్రమం డిమాండ్ డ్రైవెన్ ప్రోగ్రామ్ కనుక.. ఎంత ఎక్కువ వినియోగించుకోగలిగితే అంత మేలు జరుగుతుందని సీఎస్ చెప్పారు.

# సంక్షేమానికి తొలి ప్రాధాన్యం

- పేదరిక నిర్మూలనకు పీ-4 అస్త్రం
- అరకు కాఫీకి ప్రత్యేక బ్రాండింగ్
- చేనేత కార్మికులకు జీఎస్టీ రద్దు
- వడ్డెరలకు క్వారీలు, మత్స్యకారులకు చెరువులు
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు




అమరావతి (చైతన్య రథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమంపై సీఎం పలు సూచనలు చేశారు. సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనకబడిన బడుగు బలహీన వర్గాలను ఆదుకోవాల్సివుందన్నారు. తమ ప్రభుత్వంలో బడుగుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పీ-4లో భాగంగా సమాజంలో అట్టడుగున ఉన్న పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. డ్వాక్రా, మహిళా సంఘాల ద్వారా పేదలను గుర్తించి వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలను ఆర్థికంగా ఉన్నత స్థితికి తీసుకువచ్చేందుకు వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ అనే నినాదాన్ని ముందుకు తీసుకువచ్చామన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఉండేలా తమ ప్రభుత్వం అడుగులు వేస్తుందని సీఎం వెల్లడించారు.

### అరకు కాఫీకి బ్రాండింగ్.. చేనేత కార్మికులకు జీఎస్టీ రద్దు

గిరిజన సంక్షేమంలో భాగంగా అరకు కాఫీని ప్రోత్సహించాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రానున్న ఐదేళ్లలో అదనంగా లక్ష ఎకరాల్లో అరకు కాఫీ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని నిర్ణయించామన్నారు. కాఫీలో అంతరపంటగా వేసే నల్ల మిరియాలు, స్ట్రాబెర్రీ, అవకాడో, యాపిల్, జీడి వంటి పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలని సూచించారు. గిరిజన ఉత్పత్తుల పరిరక్షణకు అవసరమైతే డ్రోన్ టెక్నాలజీని వాడుకోవాలని సూచించారు. సేంద్రియ సేద్యానికి అరకుకు మంచి అవకాశాలు ఉన్నాయని సీఎం చెప్పారు.

గిరిజన ప్రాంతాల్లో వనరులు ఉన్నాయని, ఆదివాసీల్లో చైతన్యం లేకే వెనకబడి ఉన్నారని సీఎం అభిప్రాయ పడ్డారు. తన ప్రభుత్వం గతంలో చైతన్యం అనే పథకం ద్వారా ఎస్టీ సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. అదేవిధంగా ఎస్సీ సంక్షేమానికి ముందడుగు, బీసీల పురోగతికి ఆదరణ పథకాలను ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ప్రస్తుతం ఆదరణ-3 పథకం ద్వారా ఆధునాతన టెక్నాలజీ, పరికరాలు సమకూరుస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.



### వడ్డెరలకు క్వారీలు, మత్స్యకారులకు చెరువులు

బీసీల్లో వడ్డెర కులస్తులకు క్వారీలు ఇచ్చేలా ప్రణాళికలు రచించాలని సీఎం ఆదేశించారు. అదేవిధంగా మత్స్యకార సొసైటీలకు చెరువులుఅప్పగించి చేపలు పెంచుకునేలా తోడ్పాటు నివ్వాలని సూచించారు. కల్లు గీత కార్మికులకు కేటాయించిన వైన్ షాపులు దుర్విని యోగం కాకుండా పర్యవేక్షించాలని చెప్పారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పంపిణీ చేస్తున్నామని, వారు ఉత్పత్తి చేసిన వస్త్రాలకు జీఎస్టీ రద్దు చేసినట్టు సీఎం వెల్లడించారు.

# రూ.7230 కోట్ల బకాయిలు విడుదల

- గత ప్రభుత్వం రూ.20,637 కోట్ల బకాయిలు పెట్టింది
- ప్రభుత్వోద్యోగులు ప్రభుత్వంలో భాగమే..
- అందుకే ఇబ్బందులున్నా బకాయిలు విడుదల చేశాం
- సౌలభ్యాన్నిబట్టి మిగిలిన బకాయిలూ విడుదల చేస్తాం
- పీ-4లో ఉద్యోగ కుటుంబాలు భాగస్వామ్యం కావాలి
- కలెక్టర్ల సదస్సులో సీఎం నారా చంద్రబాబు నాయుడు వెల్లడి



అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు గత ప్రభుత్వం చెల్లించకుండా ఎగ్గొట్టిన బకాయిల్లో రూ.7230 కోట్లు బకాయిలు ప్రస్తుతం విడుదల చేశామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఇప్పటికే రూ.1,030 కోట్లు విడుదల చేశామని, తాజాగా ఇప్పుడు మరో రూ.6200 కోట్లు విడుదల చేశామని ఆయన గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో భాగంగా ఆయన పీ-4 కార్యక్రమంపై జరిగిన సమీక్షలో ఈ విషయాలు వెల్లడించారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని, వారికి న్యాయంగా అందాల్సిన అలవెన్సులు అందించకుండా గతప్రభుత్వం ఏకంగా రూ.20,637 కోట్లు ఎగ్గొట్టి బకాయిలు పెట్టిందన్నారు. తమ ప్రభుత్వం ఇప్పుడు ఉద్యోగులకు ఆ బకాయిల్లో కొంత చెల్లించామన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా ఉద్యోగులకు వారి బకాయిలు విడుదల చేస్తున్నామని చెప్పారు. మిగిలిన బకాయిలు కూడా వెసులుబాటును బట్టి విడుదల చేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి చొరవ తీసుకోవాలన్నారు. పీ4 కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు కూడా భాగస్వామ్యం కావాలని కోరారు. ఉద్యోగుల కుటుంబాలు కూడా తమకు చేతనైనంతలో ఒక పేద కుటుంబాన్ని పైకి తీసుకురావడానికి కృషి చేయాలని కోరారు. ఈ ప్రభుత్వం అందరిదీ అందరి సంక్షేమం కొరకు పనిచేస్తుందని సీఎం స్పష్టం చేశారు. సమాజంలో 10 శాతం ఉన్నతంగా ఉన్న సంపన్నవర్గాలు సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం నిరుపేద కుటుంబాలను స్వచ్ఛందంగా దత్తత తీసుకుని వారి అభ్యున్నతికి తోడ్పాటు అందించాలన్నారు. దీనికోసం ఉగాది రోజున ప్రత్యేక కార్యక్రమం ప్రారంభిస్తున్నామని, దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఒక కుటుంబానికి ఒక పారిశ్రామికవేత్త ఉండేలా చేయాలన్నదే తమ ఆశయమన్నారు. ఇందులో భాగంగా వన్ ఫ్యామిలీ ఒన్ ఎంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు.




# వ్యాధుల నియంత్రణపై యుద్ధం



- లైన్ డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో వ్యవహరించాలి
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి
- అవసరమైనచోట్ల డ్రోన్లను ఉపయోగించాలి
- అవసరమైనమేర నిధులు ఇచ్చేందుకు సర్కారు సిద్ధం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటన

అమరావతి (చైతన్య రథం): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే తగినంత మొత్తంలో నిధులను మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మంగళవారంనాటి జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అంశంపై మాట్లాడుతూ.. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని దోమల ద్వారా సంక్రమించే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల్లో యాంటీ లార్వల్ ఆపరేషన్లను విస్తృతంగా నిర్వహించాలన్నారు. మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లో డ్రోన్లను వినియోగిస్తూ పిచికారి చేయించాలన్నారు. మానవ తప్పిదాలవల్ల ఈ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున మున్సిపాలిటీ మరియు పంచాయతీరాజ్ శాఖలు ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడ ఎటువంటి కేసు ప్రబలినా, ఆ కేసుపై విచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

తాగునీరు కలుషితం ద్వారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, తాగునీరు కలుషితం కాకుండా తగు ముందస్తు చర్యలను చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.50 లక్షల బోర్లు ఉన్నాయని, వాటన్నిటిని ముందుగానే ఫ్లష్ అవుట్ చేయించాలన్నారు. అయినప్పటికీ త్రాగునీరు కలుషితానికి అవకాశం ఉంటే, ఆయా బోర్లను వెంటనే తొలగించి వాటి స్థానంలో నూతన బోర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడా నీరు కలుషితం కావడానికి వీల్లేదని, ఇందుకై ప్రోటోకాల్ ప్రకారం ఎస్ఓపీని పటిష్టంగా అమలుపరచాలని ఆదేశించారు.

అదేవిధంగా త్రాగునీటి పైపుల లీకేజీకి ఏమాత్రం అవకాశం లేకుండా చూడాలని, ప్రత్యేకించి మురుగునీరు, వర్షపు నీటికి త్రాగు నీటి సరఫరా పైపులు ఏమాత్రం ఎక్స్‌పోజ్ కాకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. త్రాగునీటి వనరులన్నిటినీ ముందుగానే క్లోరినేషన్ చేసుకునే అంశంపై మున్సిపాలిటీ మరియు పంచాయతీరాజ్ శాఖలు ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిపాలన పరమైన లోపాలవల్లే సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందుకు ఏమాత్రం అవకాశం లేకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన నిధులను తగినంత మొత్తంలో మంజూరు చేస్తామని, తాగునీరు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లు, సంబంధిత అధికారులపై ఉందన్నారు.



ఆహారం కూడా కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని, ఇందుకు వ్యవసాయ, పౌరసరాలు, ఆరోగ్య శాఖల మంత్రుల బృందం ఈ అంశాన్ని ఇప్పటికే పర్యవేక్షిస్తున్నదన్నారు. సురక్షితమైన ఆహార సరఫరా అంశాన్ని కూడా ఈ బృందమే పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ మూడు నెలలపాటు వడదెబ్బకు ఎక్కువగా గురయ్యే అవకాశాలు ఉన్నందున, ఈ విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సాటించాలన్నారు. చల్లని నీటిని సరఫరా చేసే చలివేంద్రాలను పెద్దఎత్తున ఏర్పాటు చేయాలని, అవసరమైనచోట ఓఆర్ఎస్ ప్యాకెట్లను, మజ్జిగ ప్యాకెట్లు కూడా సరఫరా చేయాలన్నారు. బహిరంగ మలవిసర్జన ఏమాత్రం లేకుండా, వ్యక్తిగత టాయిలెట్లు ఉపయోగించుకునేలా చైతన్య పరచాలని, అవసరమైనచోట్ల వ్యక్తిగత టాయిలెట్స్‌ను వెంటనే మంజూరు చేసి వాటి నిర్మాణాలను కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ సిఎస్ ఎమ్‌టి కృష్ణబాబు మాట్లాడుతూ శాఖాపరంగా సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.



చైతన్యరథం

# వివేకా హత్యకేసు..
# నేరాల్లో పెద్ద కేస్ స్టడీ

- నేరగాళ్లు తెలివిమీరుతున్నారు...
- పోలీస్ శాఖ అప్రమత్తం కావాలి
- జీరో క్రైం లక్ష్యంగా అడుగులేయాలి
- సాంకేతికతే.. పోలీస్‌కు పెద్ద వెపన్
- సీసీటీవీల వినియోగ తీరు భేష్
- 'శక్తి' యాప్‌పై మరింత అవగాహన పెంచడి
- శాంతిభద్రతలపై సమీక్షలో సీఎం చంద్రబాబు




అమరావతి (చైతన్య రథం): శాంతి భద్రతలపై సమీక్షలో నేరాల నియంత్రణపై పోలీసు శాఖ ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రజెంటేషన్ ఇచ్చింది. టెక్నాలజీ ద్వారా కేసుల పరిష్కారం, నేరగాళ్లను శిక్షించడంలో అనుసరిస్తోన్న విధానాలను అధికారులు వివరించారు. డిజిటల్ అరెస్టులు, కొత్త తరహా మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయడానికి తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. ఈ సందర్భంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. నేరస్థులను గుర్తించే విషయంలో సాంకేతికతను ఎక్కువగా ఉపయోగించాలని సూచించారు. నేరం జరిగిన ప్రాంతంలో సాక్ష్యాలను సేకరించే విషయంలో కొత్త పద్ధతులను అనుసరించాలన్నారు. నేరస్థులు సాక్ష్యాలు దొరక్కుండా చేస్తున్నారని.. విచారణ అధికారులు తెలివిగా వ్యవహరించాలని సీఎం సూచించారు. నేరాలు చేసి పారిపోయేవారు కొందరైతే, నేరాలు చేసి పక్కవారిపై నెట్టేవారు మరికొందరని సీఎం వ్యాఖ్యానించారు. వివేకా హత్య ఒక్కటే నేరాల్లో పెద్ద కేస్ స్టడీ అని, ఈ కేసు విషయంలో ఎదురైన మలుపులు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఫోరెన్సిక్ ఎవిడెన్స్ సేకరణ విషయంలో పక్కాగా వ్యవహరించాలన్నారు. నేరస్థుల గుర్తింపు, తక్షణం శిక్ష పడేలా చేయడంలో క్లూస్ టీమ్ కీలక పాత్ర పోషించాలని సీఎం ఆదేశించారు.

'రాష్ట్ర పోలీసు శాఖకు మంచి గుర్తింపు ఉంది. రాష్ట్రంలో జీరో క్రైమ్ లక్ష్యంగా పోలీసు శాఖ వినూత్న ప్రణాళికలతో కార్యాచరణ దిశగా అడుగులేయాలి. ప్రజల్లో విశ్వాసం పెరిగేలా పోలీసింగ్ ఉండాలి. విస్తృత ప్రజాస్వామ్యంతో సుస్థిర శాంతిభద్రతలకు వీలవుతుంది. కమ్యూనిటీ భాగస్వామ్యంపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి' అని సీఎం సూచించారు.

నేరగాళ్లపై పైచేయి సాధించాలంటే ఆధునిక టెక్నాలజీ ఆసరాగా నిరంతర అప్రమత్తతతో వ్యవహరించాలని, భవిష్యత్తులో సైబర్‌క్రైమ్ రూపంలో పెద్ద ముప్పు ఉందంటూ.. ఈ నేపథ్యంలో పటిష్ట ప్రణాళికల రూపకల్పన, కార్యాచరణ అవసరమన్నారు. ఇందుకు పకడ్బంధీ సైబర్ వాల్స్ రూపకల్పన అవసరాన్ని ప్రస్తావించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌తోపాటు చట్టవ్యతిరేక రుణ యాప్‌లు, సైబర్ మోసాలను ఎదుర్కొనేందుకు ప్రత్యేక చట్టం తేవాల్సిన అవసరముందని పేర్కొంటూ.. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 75,749 సీసీటీవీలు సేవలందిస్తున్నాయన్నారు. త్వరలో వీటి సంఖ్యను లక్షకు చేర్చేందుకు పోలీసు శాఖ చొరవ చూపుతోందని, కేసుల ఛేదనలో సీసీ ఫుటేజీ బాగా ఉపయోగపడుతుందన్నారు. గత 9 నెలల కాలంలో 1,902 కేసులను సీసీటీవీల ద్వారా ఛేదించడం జరిగిందని వివరిస్తూ.. సీసీటీవీలను మరింత సమర్థవంతంగా ఉపయోగించుకునేందుకు అధికారులు కృషిచేయాలని, ఇందుకు డేటా అనలిటిక్స్‌ను ఉపయోగించుకోవాలన్నారు. 'శక్తి యాప్‌కు సంబంధించి 33 వేల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ యాప్‌పై మరింత అవగాహన పెంచాలి. ఇందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రజలు సైబర్ మోసాల బారిన పడేందుకు డిజిటల్ లిటరసీ, పూర్ డిజిటల్ హైజీన్ వంటివి మూల కారణాలుగా కనిపిస్తున్న నేపథ్యంలో అవగాహన పెంచడం ముఖ్యం. పోలీసు శాఖ కూడా సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు, ఛేదించేందుకు అప్రమత్తంగా ఉండాలి' అని సూచించారు.

డిజిటల్ అరెస్టు అంటూ విజయనగరం, బాపట్లలో చోటుచేసుకున్న రెండు సంఘటనలు, వాటిని పోలీసు శాఖ విజయవంతంగా ఛేదించిన తీరును ముఖ్యమంత్రి ప్రశంసించారు. అస్త్రం (కృత్రిమ మేధ) అప్లికేషన్ విజయవాడలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌లో ఎలా ఉపయోగపడుతుందో పోలీసు అధికారులు వివరించగా.. ఈ చొరవను ముఖ్యమంత్రి అభినందించారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపైనా అవగాహన కల్పించి, యువత వాటివైపు వెళ్లకుండా చూడాలన్నారు. ప్రతి జిల్లాలోని డ్రగ్ డీ అడిక్షన్, కౌన్సెలింగ్ కేంద్రాలను బలోపేతం చేయాలని, అందుకు సలహా కమిటీలు చొరవచూపాలన్నారు. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ శాంతిభద్రతలను కాపాడటంలో మంచి పనితీరు కనబరుస్తున్న పోలీసు శాఖను సీఎం చంద్రబాబు నాయుడు ప్రశంసించారు.



# రాష్ట్రంలో జనాభా పెరగాలి

- దక్షిణాదిన జనాభా తగ్గుముఖం పట్టనుంది
- జనాభా నిర్వహణ అత్యంత ప్రాధాన్యతాంశం
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు పిలుపు

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో జనాభా పెరగాల్సిన ఆవశ్యకత వచ్చిందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1.5శాతం ఫెర్టిలిటీ రేట్ ఉందని, రాబోయే ఏడెనిమిదేళ్లలో పాపులేషన్ తిరోగమనం పట్టనుందని, ఇది అందరూ గుర్తుంచుకోవాలన్నారు. ఉత్తరాది రాష్ట్రంలో జనాభా పెరుగుతుండగా దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తగ్గుముఖం పట్టనుందని చెప్పారు. జనాభా నిర్వహణ కూడా కీలకాంశమన్నారు. అన్ని వర్క్ ప్లేసుల్లో చైల్డ్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు రియల్ టైమ్‌లో జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీ-4 అనేది గేమ్‌ఛేంజర్ కానుందన్నారు. 77 శాతం పెట్టుబడులు ప్రైవేటురంగం నుంచే రాబోతోందని, ప్రవైటురంగం పెట్టుబడుల ద్వారా సంపద సృష్టించడమే కాకుండా సంక్షేమాన్ని కూడా చేపట్టబోతున్నామన్నారు. సమాజం మనకు ఎంతో ఇచ్చిందని, సమాజానికి మనం కూడా ఎంతో కొంత తిరిగివ్వాలన్నారు. ఇది మనందరి బాధ్యతని సీఎం చంద్రబాబు అన్నారు.

## ప్రతి ఇంటికీ ఇంటర్నెట్

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ ఇంటర్నెట్ సదుపాయం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఫైబర్‌నెట్ ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి కనెక్టివిటీ సదుపాయం ఉండేలా చూడాలన్నారు. ప్రతి గ్రామానికి పల్లెకు కూడా రహదారి సదుపాయం, కనెక్టివిటీ తీసుకురావడం పెద్ద కష్టమేమీ కాదని ఈ దిశగా అధికారులు దృష్టి సారించాలని సీఎం పిలుపునిచ్చారు.

## వడ్డెరలకు క్వారీలు

రాష్ట్రంలో వడ్డెర సామాజిక వర్గాలకు క్వారీలు ఇవ్వాలని సంకల్పించామని సీఎం తెలిపారు. అది వాళ్ల కుల వృత్తి కాబట్టి ఆ సామాజిక వర్గానికి క్వారీలు ఇస్తే వారి జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. ఇప్పటికే గీత కార్మికులకు 10 శాతం మద్యం దుకాణాలు కేటాయించామని, అవి సక్రమంగా అమలవుతున్నాయో లేదో అధికారులు పర్యవేక్షించాలన్నారు. అలాగే మత్స్య కారులకు చెరువుల్లో చేపలు పెంచుకునే సదుపాయం



కల్పించేలా చర్యలు తీసుకుని వారి జీవన ప్రమాణాలు పెరిగేందుకు దోహదపడతామన్నారు. చేనేతలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్తు ఇచ్చామని అది వారికి ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. మైనార్టీల సంక్షేమానికి కూడా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. చేతివృత్తులు, హస్తకళలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

## ఐటీ, అడ్వాన్స్డ్ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధికి...

# సిస్కోతో ఒప్పందం



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని వివిధ విద్యాసంస్థల్లో ఉన్నత విద్య (డిగ్రీ, ఇంజనీరింగ్), వృత్తివిద్య అభ్యసిస్తున్న విద్యార్థుల్లో ఐటి, అడ్వాన్స్డ్ టెక్నాలజీ నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రఖ్యాత ఐటి సంస్థ సిస్కో, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) నడుమ ఒప్పందం కుదిరింది. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షాన ఉండవల్లి నివాసంలో మంగళవారం ఇరుపక్షాల ప్రతినిధులు ఎంఓయుపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను విస్తరించడానికి

- మంత్రి నారా లోకేష్ సమక్షంలో సిస్కో- ఏపీఎస్ఎస్‌డీసీ ఎంఓయు
- 50వేల మంది యువతకు డిజిటల్, ఐటీ నైపుణ్యాభివృద్ధి శిక్షణ

నెట్‌వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ వంటి రంగాల్లో అత్యాధునిక కంటెంట్‌ను సిస్కో అందిస్తుంది. అధికారుల్లోనూ డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించనుంది. ఆంధ్రప్రదేశ్ అంతటా విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. ఏ కోర్సుల్లో శిక్షణ అందించాలో ఉన్నత విద్యాశాఖ నుంచి ప్రాధాన్యతల ఆధారంగా కోర్సులజాబితాను ఖరారు చేస్తారు. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్యను ప్రోత్సహించడమే ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం. ఈ ఒప్పందం ద్వారా 50వేల మంది యువతకు డిజిటల్, ఐటీ నైపుణ్యాభివృద్ధికి సిస్కో శిక్షణ అందించనుంది. నైపుణ్యం కలిగిన మానవ వనరుల కోసం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడం, ఉపాధిని పెంపొందించడమే ఈ సహకారం లక్ష్యం.

### డిమాండ్ ఆధారిత కోర్సుల్లో..

ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్య సామర్థ్యాన్ని పెంపొందించేలా వర్చువల్ విధానంలో లీహ్యూమ్ పోర్టల్ ద్వారా స్వీయ-అభ్యసన, బోధకుల నేతృత్వంలో ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్ ప్రాక్టికల్ ఎక్స్ పీరియన్స్ కోర్సుల్లో సిస్కో శిక్షణ ఇస్తుంది. విద్యార్థులకు ఆయా సంస్థల డిమాండ్ ఆధారిత కోర్సుల్లో శిక్షణా కార్యక్రమాలను డిజైన్ చేస్తారు. మారుతున్న సాంకేతికతలకు అనుగుణంగా ముందస్తు అవసరాలకు సరిపడా సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ నైపుణ్యాలను అభివృద్ధి చేయాలన్న ఏపీ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. స్వీయ-అభ్యసన(సెల్ఫ్ లెర్నింగ్) కోర్సుల్లో అవగాహన పెంచడం, విద్యార్థులను ప్రోత్సహించడం ముఖ్యోద్దేశం. వివిధ ప్రభుత్వ విభాగాల్లో అవసరాలకు అనుగుణంగా లెర్నర్ పార్టిసిపేషన్, కాంపిటీషన్స్, ఫ్యాకల్టీ ట్రైనింగ్, వర్క్ షాప్స్ నిర్వహణ వంటివి ఏపీఎస్ఎస్‌డీసీ చేపడుతుంది. ఆయా కోర్సుల్లో విజయవంతంగా శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులు, ఉద్యోగులకు సిస్కో సర్టిఫికెట్లను జారీచేస్తుంది. ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లను అందిస్తారు. ఐటీ కెరీర్‌లో యువతులకు మద్దతు నిచ్చే Women Rock IT (WRIT), అధునాతన టెక్నాలజీలో యువత, విద్యార్థులకు మద్దతునిచ్చే Find Yourself in The Future (FYIF) వంటి ప్రోగ్రామ్‌లను సీఎస్ఆర్ నిధుల ద్వారా సిస్కో అందిస్తుంది.

ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో జి.గణేష్‌కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.దినేష్‌కుమార్, సిస్కో సీనియర్ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ దేద్రిచ్, గవర్నమెంట్ అఫైర్స్ డైరెక్టర్ హరీష్ కృష్ణన్, సేల్స్ బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కె.వినోద్, తదితరులు పాల్గొన్నారు.

---

## పీపుల్స్ ఫస్ట్ నినాదంతో సీఎం చంద్రబాబు పాలన

- అందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలి
- కలెక్టర్ల సదస్సులో ఆర్థికమంత్రి పయ్యావుల



అమరావతి(చైతన్యరథం): ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పీపుల్ ఫస్ట్ అనే నినాదంతో పాలన కొనసాగిస్తున్నారని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరుగుతున్న మూడవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో తొలిరోజు మంగళవారం మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలనే లక్ష్యంతోనే ప్రస్తుతం మూడవ జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నారన్నారు. గత పాలకులు కేవలం విధ్వంసానికి శ్రీకారం చుట్టేందుకు మాత్రమే ఒకే ఒక్కసారి జిల్లా కలెక్టర్ల సమావేశాన్ని నిర్వహించారన్నారు.అది కూడా ప్రజావేదిక కూల్చటం లాంటి కక్షసాధింపు నిర్ణయాలు తీసుకునేందుకు ఆ సమావేశం నిర్వహించారని తప్పుబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 10నెలల్లోనే మూడు కలెక్టర్స్ సమావేశాలు నిర్వహించి, ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయానికి అనుగుణంగా, ప్రజల కోసం తపిస్తూ అందరం పని చేస్తున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలే సాధన లక్ష్యంగా రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి కార్యాలయం పనిచేస్తున్నదని, అదే తరహాలో జిల్లా స్థాయి సీఎంఓలుగా కలెక్టర్ కార్యాలయాలు ఎంతో శక్తివంతంగా పనిచేయాలని సూచించారు.ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి అనుగుణంగా శక్తివంతమైన డెలివరీ మెకానిజంతో జిల్లా కలెక్టర్లు పని చేసేందుకు అనుగుణంగా నూతన ఫార్మాట్లను రూపొందించామని తెలిపారు. తదనుగుణంగా జిల్లా కలెక్టర్ పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరుతేవాలని మంత్రి పయ్యావుల ఆకాంక్షించారు.

---

# ప్రైవేటు భూములేవీ 22 ఏలో ఉండకూడదు

- పేదలకు న్యాయం చేయాలన్నదే సీఎం చంద్రబాబు తపన
- 22ఏ, ఫ్రీహోల్డ్ భూములపై ప్రత్యేక డ్రైవ్
- జిల్లాల్లో ప్రత్యేకంగా రియల్ ఎస్టేట్ కమిటీల ఏర్పాటు
- భూ సమస్యలపైన కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ మంత్రి అనగాని

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రైవేటు భూములేవీ కూడా 22ఏలో ఉండకూడదనేదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టంచేశారు. ప్రజలకు భూమి అనేది సెంటిమెంటుతో కూడుకున్న వ్యవహారమని, పేదలకైతే అది ఒక భరోసా అని,క్షేత్రస్థాయిలో ప్రజలు తమ భూములకు సంబంధించి వివాదాలు లేకుండా ప్రశాంతంగా ఉండేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల భూ వివాదాల పరిష్కారానికి జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

సచివాలయంలో మంగళవారం ప్రారంభమైన 3వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో మంత్రి అనగాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదలకు మేలు చేయాలనే దృఢసంకల్పంతో పని చేస్తున్నారని, జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో ప్రజలు, ప్రభుత్వానికి మధ్య అనుసంధాన కర్తలుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలల్లో మూడు సార్లు కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సామాన్యులకు, పేదలకు ఎటువంటి నష్టం కలగకుండా క్షేత్రస్థాయిలో భూ సంబంధ సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ చెబుతుంటారని, క్షేత్రస్థాయిలో పేదలకు వారి భూములకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నదే ముఖ్యమంత్రి ఆశయమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఈ తొమ్మిది నెలల కాలంలో రెవెన్యూ శాఖలో పలు సంస్కరణలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి చట్టం ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేయడంతో పాటు, ల్యాండ్ గ్రాబింగ్ నిరోధక చట్టాన్ని, ఆర్ఓఆర్ చట్టాలను తీసుకొచ్చామని తెలిపారు. ఆర్ఓఆర్ చట్టాన్ని సవరించి అప్పీల్ అధికారాన్ని డీఆర్వోల నుండి ఆర్డీవోలకు మార్చాం.. దీంతో భూ యజమానులకు త్వరగా వారి అప్పీళ్లు పరిష్కారమవుతాయని తెలిపారు. ప్రైవేటు భూములు ఎట్టి పరిస్థితిలోనూ 22ఏ వివాదాల్లో ఉండకూడదన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. చాలా మందికి తమ భూమి ఎందుకు 22ఏ వివాదంలో ఉందో కూడా తెలిదన్నారు. జిల్లా కలెక్టర్లు కూడా జిల్లాల్లో భూ వివాదాలపైన ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రెవెన్యూ శాఖలో భూ వివాదాలకు సంబంధించి ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, అర్జీలను అన్నింటినీ పరిష్కరిస్తున్నామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను కూడా పరిష్కరిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రూ.700 కోట్లు దుర్వినియోగం చేసి సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకుంటే ఇప్పుడు వాటిని తొలగిస్తున్నామన్నారు. రైతులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా పట్టాదారు పాసుపుస్తకాలను అత్యంత పారదర్శక విధానంతో అందిస్తున్నామని మంత్రి అనగాని తెలిపారు.

### రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్

రాష్ట్రంలో అభ్యంతరాలు లేని స్థలాల్లో ఉంటున్న పేదలకు ఆ భూమిని క్రమబద్ధీకరించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందని, 22ఏ భూముల వివాదాల పరిష్కారంపైన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వీటి కోసం ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నామని, దీనికి జిల్లా కలెక్టర్లు సహకారం అందివ్వాలని కోరారు. గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే తప్పుల తడకగా సాగింది. రీ సర్వేపైన గ్రామ సభలు పెట్టాం. ఆ తర్వాత రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. వీటితోపాటు పీజీఆర్ఎస్ లోనూ గ్రీవెన్స్ వస్తున్నాయి. వీటిల్లో 90 శాతం పరిష్కరించామని, వీటిని క్వాలిటీ డిస్పోజల్ చేయాలని ముఖ్యమంత్రి ఎప్పుడూ చెబుతుంటారు. కలెక్టర్లు ఆ దిశగా పని చేయాలన్నారు. రీ సర్వేను కూటమి ప్రభుత్వం చాలా పకడ్బందీగా చేస్తోంది.



రోజుకు 20 ఎకరాల్లోనే చేస్తున్నాం. కొత్తగా పాసుపుస్తకం జారీ చేయడంతో పాటు, దానికి జియోట్యాగింగ్ చేస్తున్నామని తెలిపారు. జిల్లాల్లో పలు చోట్ల భూములు కోర్టు కేసుల్లో ఉన్నాయని, ఇలాంటి కేసులు కూడా త్వరితగతిన పరిష్కరించడానికి జిల్లా కలెక్టర్లు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ప్లీడర్లతో సమావేశమై ఆ కేసులు త్వరతగతిన పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ప్రజలు తమ భూమిల సమస్యలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారుల వద్దకు వచ్చినప్పుడు వాటిని పరిష్కరించి న్యాయం చేయాలని, ఒకవేళ చేయలేకపోతే ఎందుకు చేయలేకపోతున్నామో చెప్పగలిగేలా ఒక స్పీకింగ్ నోట్ ఇచ్చే పరిస్థితికి చేరుకోవాలని సూచించారు. ఎమ్మార్వో కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది సిటిజన్ ఫ్రెండ్లీగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎంతోమంది ముందుకు వస్తున్నారని, అయితే క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఫ్రీ హోల్డ్ భూములు, ఎలాంటి వివాదాలు లేకుండా చూసుకోవాలన్నారు. వివాదాలుంటే పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపించే ప్రమాదముంటుందన్నారు. దీనికోసం జిల్లాల్లో ప్రత్యేకించి ఒక రియల్ ఎస్టేట్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. జిల్లా, రెవెన్యూ, మున్సిపాల్టీ, పంచాయతీ, పట్టణాభివృద్ధి సంస్థలు, బ్యాంకర్లు అందరూ ఈ కమిటీలో సభ్యులుగా ఉండేలా చూడాలన్నారు. ఈ కమిటీ ప్రతి నెల లేదా రెండు నెలలకు ఒకసారి సమావేశమై ఆయా జిల్లాల్లో ప్రభుత్వ భూములకు సంబంధించి ఉన్న వివాదాలు పరిష్కరించాలని కోరారు.

చైతన్యరథం

# పోలవరం నిర్వాసితుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత

- ఐదేళ్ల పాలనలో పట్టించుకోని జగన్ రెడ్డి
- 26 పునరావాస కాలనీలు పూర్తి చేసిన నాటి టీడీపీ ప్రభుత్వం
- వేగవంతంగా మిగిలిన 49 కాలనీల పనులు
- అధికారులతో సమీక్షలో మంత్రి నిమ్మల



అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత ప్రాధాన్యత ఇస్తుందో, ప్రాజెక్టు కోసం తమ విలువైన భూములు, ఆస్తులు, ఇళ్ళు త్యాగం చేసిన నిర్వాసితుల సంక్షేమానికి కూడా అంతే ప్రాధాన్యత ఇస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. సచివాలయంలో పోలవరం పునరావాసం, భూసేకరణపై మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం సమీక్షించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి నిమ్మల అన్నారు. గత అయిదేళ్ళలో ఒక్క రూపాయి నష్టపరిహారం ఇవ్వలేదు. కాలనీల నిర్మాణానికి అరబస్తా సిమెంట్ పనులు కూడా చేయలేదు. గత జగన్ ప్రభుత్వం నిర్వాసితులను పట్టించుకోకపోవడంతో, తమ ప్రాంతాలను తెలంగాణలో కలిపేయాలంటూ నిర్వాసితులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు కూడా చేశారు. జగన్ సీఎం అయ్యాక పోలవరం నిర్వాసితుల వైపు కన్నెత్తి కూడా చూడకపోగా, పునరావాస కాలనీల్లో ఒక్క ఇంటిని కూడా పూర్తి చేయలేదు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు ఇచ్చిన రూ. 3385 కోట్ల రియంబర్స్‌మెంట్ నిధులను కూడా, ప్రాజెక్టు నిర్మాణానికి గానీ, నిర్వాసితులకు గానీ, అందించకుండా దారి మళ్ళించి దోచుకున్న దుర్మార్గుడు జగన్. పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేసినట్లే, నిర్వాసితులను సైతం నిలువునా ముంచేశాడు జగన్. గతంలో అధికారంలో ఉండగా నాడు 2017లో రూ. 800 కోట్లు జమ చేసిన చంద్రబాబే, మరలా ఏడేళ్ళ తరువాత నిర్వాసితుల కష్టాలు తీర్చేలా, మరో 800 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసి, సంక్రాంతి కానుక అందించారు. మొత్తం 75 పునరావాస కాలనీలకు గానూ, 26 కాలనీలు నాటి టీడీపీ ప్రభుత్వం పూర్తి చేసింది. మిగిలిన 49 పునరావాస కాలనీల నిర్మాణ పనులను వేగవంతం చేసేలా యాక్షన్ ప్లాన్ రూపొందించాం. నిర్వాసిత గ్రామాల్లో ఏప్రిల్ నెలాఖరులోగా గ్రామసభలు నిర్వహించి ఆర్అండ్ఆర్ కాలనీల గుర్తింపు పూర్తి చేయాలని అధికారులను మంత్రి నిమ్మల ఆదేశించారు. మిగిలిన నిర్వాసిత కాలనీల్లో నిర్మాణ పనులకు జూలై 15 లోగా టెండర్ల ప్రక్రియ పూర్తవ్వాలి. కొత్తగా గుర్తించిన కాలనీలు సైతం 2026 జూన్ కల్లా పూర్తి చేసి, నిర్వాసితులను తరలించేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. ఫేజ్-2లో 45.72 మీటర్లకు ఆర్అండ్ఆర్ కు సంబంధించిన అంచనాలను కూడా సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి నిధులు సాధిస్తామని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు.

ఈ సమీక్షా సమావేశానికి ఆర్అండ్ఆర్ కమిషనర్ రాంసుందర్ రెడ్డి, పోలవరం ప్రాజెక్ట్ పరిపాలనాధికారి అభిషక్, ఈఎన్సీ ఎం.వెంకటేశ్వరరావు,స్పెషల్ కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, పంచాయితీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్, ఎపిఈడబ్ల్యూఐడిసి, హౌసింగ్, ఆర్అండ్ బి చీఫ్ ఇంజనీర్లు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పట్టణ ప్రాంతాల్లో మంచినీటి సమస్య లేకుండా చర్యలు

- నీటి సరఫరాలపై గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశాం
- అన్ని బోర్లు పనిచేసేలా చర్యలు తీసుకున్నాం
- మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో నీటిసరఫరాపై కలెక్టర్లు దృష్టి పెట్టాలి
- కలెక్టర్ల సదస్సులో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్ కుమార్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో ఎక్కడా కూడా మంచినీటి సమస్య తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ తెలిపారు. మున్సిపాల్టీలు, నగరాల్లో మంచినీటి సమస్యలపై జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో భాగంగా తొలిరోజు మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో వేసవిలో మంచినీటి సరఫరాకు సంబంధించి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. రాష్ట్రంలోని మొత్తం 123 యూఎల్‌బీల్లో కేవలం మూడు చోట్ల మాత్రమే మూడు రోజులకు ఒకసారి మంచినీరు సరఫరా చేస్తున్నామని, అక్కడ కూడా పరిస్థితి మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లోని అన్ని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నీళ్లతో నింపుతున్నామని, ఎక్కడైనా మంచినీటి సమస్యలు తలెత్తితే అవసరమైన చోట్ల అద్దె వాహనాల ద్వారా కూడా నీళ్లు సరఫరా చేస్తామన్నారు. వేసవిలో ఎక్కడా కూడా పట్టణ ప్రాంత ప్రజలకు మంచినీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. యుఎల్బీ స్థాయిలో వాటర్ సప్లయి గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చామని, ప్రజలకు ఎక్కడైనా మంచినీటి సమస్య తలెత్తితే ఆ సమస్య తక్షణం పరిష్కరించేలా ఏర్పాట్లు చేశామని, క్షేత్రస్థాయిలో ఆ విధంగా యంత్రాంగం పనిచేసేలా జిల్లా కలెక్టర్లు సహకరించాలన్నారు. 2028కల్లా పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి ద్వారా మంచినీరు అందించాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పమని, ఈ లక్ష్య సాధనకు జిల్లా కలెక్టర్లు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రూ.17,573 కోట్ల వ్యయంతో వివిధ పథకాల రూపంలో దీనికోసం పనులు జరుగుతున్నాయని, ఈ పనులు వేగవంతం చేసేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు.

**పంచాయతీల్లో నీటి సమస్య రాకుండా ఏర్పాట్లు : శశిభూషణ్**



పంచాయతీల్లో కూడా మంచినీటి సమస్యలు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తెలిపారు. కరవు ప్రభావిత ప్రాంతాల్లో కూడా ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పంచాయతీల్లో బోరు పంపులు అన్నీ పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 26 జిల్లాల్లోని పంచాయతీల్లో 1,47,188 చేతి పంపులున్నాయని, వీటిలో కేవలం 693 మాత్రమే పనిచేయడం లేదన్నారు. వాటిని కూడా యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు.

## ఐదేళ్ల పాటు రైతులను దగా చేసి..

# ఇప్పుడు జగన్ కపట నాటకాలు!

అనంతపురం జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలు రైతులకు కన్నీటిని మిగిల్చాయి. వేలాది ఎకరాల్లో సాగుచేసిన అరటి తోటలు నేలకూలాయి. రైతులు ఆందోళన చెందుతున్న సమయంలో కూటమి ప్రభుత్వం రైతుకు భరోసాగా నిలబడింది. బాధిత రైతును ఆదుకోవడం చూసి ఓర్వలేని జగన్ రెడ్డి మరో సరికొత్త నాటకానికి తెరలేపాడు. గత ఐదేళ్ళూ రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు. పరిహారం అందక రోడ్డున పడ్డ రైతులు, ఆత్మహత్యలకు పాల్పడ్డ అభాగ్యులు ఎందరో ఉన్నారు. "పంట పండితే తన వల్లనేనని డప్పాలు కొట్టుకున్న జగన్ నష్టం వస్తే బాధిత రైతులకు కనీస సాయం అందించకుండా ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందంటూ మాట్లాడడం విడ్డూరం.

నాడు రైతులను దగా చేసి నేడు అనంతపురం చేరుకుని రైతులను పరామర్శించడం జగన్ దగాకోరు రాజకీయానికి నిదర్శనం. అధికారంలోకి వచ్చే ముందు మడమ తిప్పనంటూ హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే లేకుండా మాయ చేసిన మహా మాయగాడు జగన్. "ఆపదలో ఉన్నప్పుడే మిత్రుడెవరో, శత్రువెవరో తెలుస్తుంది" అన్నట్లుగా జగన్ రెడ్డి అసలైన వైఖరి ఇప్పుడు బయటపడుతోంది.

**కేవలం మాటలకే పరిమితమైన రైతు భరోసా**

నాడు పంట నష్టం వచ్చి రైతుని ఏడిపిస్తే, జగన్ రెడ్డి ప్రభుత్వం ఆ కష్ట కాలంలో రైతును పట్టించుకోలేదు.. ఇప్పుడు నీతి సూత్రాలు వల్లె వేస్తున్నాడు.. అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ అయిన జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ రైతు భరోసా పేరుతో ప్రతి రైతు కుటుంబానికి రూ.12,500 ఇస్తానని మోసం చేశాడు. రాష్ట్ర నిధుల నుంచి రూ.7,500 మాత్రమే 3 దఫాలుగా ఇస్తూ.. కేంద్రం ఇచ్చే రూ.6 వేలు కూడా కలుపుకుని రూ.13,500 తామే ఇస్తున్నట్లుగా అబద్ధాలు ప్రచారం చేసి రైతులను దగా చేశాడు. దీంతో ప్రతి రైతు ఏడాదికి రూ.6వేలు, ఐదేళ్లలో రూ.30 వేలు నష్టపోయారు..

గత ఐదేళ్లలో వ్యవసాయాన్ని, రైతును మోసం చేస్తూ ఆర్థిక వ్యవస్థతో ముడిపడి ఉన్న వ్యవసాయ రంగాన్ని పతనం చేసిన దుర్మార్గుడు జగన్ రెడ్డి. రుషికొండ ప్యాలెస్ లాంటి భవంతులు నిర్మించుకుని విలాసవంతమైన జీవనం కోసం కోట్లు ఖర్చు పట్టాడు. రైతును మాత్రం నట్టేట ముంచాడు. కూటమి ప్రభుత్వం వచ్చే మే నెల నుండి అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తూ అర్హులైన రైతులకు రూ.20 వేలు అందించి రైతుకు దన్నుగా నిలబడుతోంది.

**అరటి రైతులు ఇప్పుడు గుర్తొచ్చారా జగన్?**

పులివెందులలో అరటి రైతులు ఉన్నారని జగన్ రెడ్డికి ఇప్పుడు గుర్తొచ్చారా? గిట్టుబాటు ధర లేక గత అయిదేళ్లలో అరటి రైతులు నష్టపోయినా జగన్ రెడ్డి పట్టించుకున్న పాపాన పోలేదు. అరటి రైతులకు గిట్టుబాటు ధర లభించక పండించిన పంటను పులివెందులలో పశువుల దాణా కోసం ఉపయోగించిన ఘటనలు జగన్ రెడ్డి మరిచిపోయినా రైతులు మరిచిపోలేదు. జగన్ హయాంలో అరటి రైతులను ఆదుకోవడానికి ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. ప్రభుత్వ కార్యాలయాలకు రూ.3 వేల కోట్లతో వైసీపీ రంగులు వేయడంపై చూపించిన శ్రద్ధలో ఒక వంతు కూడా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో చూపని కర్కోటకుడు జగన్ రెడ్డి.

పులివెందులలో రైతుల పరామర్శకు వెళ్లిన జగన్ రెడ్డి మీకు ఇన్ పుట్ సబ్సిడీ పెంచాలా.. లేక బీమా ఇవ్వాలా అని మాట్లాడడం.. వెంటనే అక్కడ ఉన్న వ్యవసాయాధికారిణి గతంలో ఉన్న రూ.25 వేల ఇన్ పుట్ సబ్సిడీని ఇప్పుడు రూ.35 వేలకు పెంచారనగానే జగన్ రెడ్డికి నోటమాట రాలేదు.. అసలు ఏమి మాట్లాడాలో వారికి ఏ సహాయం కావాలో అనే కనీస అవగాహన లేని వ్యక్తి జనం లోకొచ్చి పిట్టల దొర వేషాలు, కపటనాటకాలతో రైతును మరోసారి మోసం చేయడానికి కాదా...? కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హెక్టారుకు ఇన్ పుట్ సబ్సిడీని రూ.25 వేల నుంచి రూ.35 వేలకు అందించిన విషయం జగన్ రెడ్డికి కనిపించలేదా? ఎప్పుడు ప్యాలెస్‌లో ఉండే వ్యక్తికి ఏం తెలుస్తుంది రైతు పడే కష్టం..

**ఇన్ పుట్ సబ్సిడీలో మోసం**

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో వచ్చిన ప్రకృతి వైపరీత్యాల వల్ల వేల ఎకరాల్లో భారీగా పంట నష్టం జరిగింది. రైతులను ఆదుకోవడంలో జగన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమయింది. నాడు కనీసం పొలం దగ్గరకు కూడా వెళ్లకుండా, చొక్కా నలగకుండా, మట్టి అంటకుండా తూతూ మంత్రం వేశాడు. అది కూడా విపత్తు వచ్చిన మూడు రోజుల తర్వాత.

మిచౌంగ్ తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల ఎకరాల్లో రూ.10వేల కోట్ల విలువైన పంటలు దెబ్బతింటే కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇన్‌పుట్ సబ్సిడీ (నష్టపరిహారం) ఎన్‌డీఆర్ఎఫ్ ప్రమాణాలకు అతీతంగా ఉదారంగా మానవతా దృక్పథంతో వరి ధాన్యం, అరటి, చెరకు, కొబ్బరి పంటలకు గత టీడీపీ ప్రభుత్వంలో పరిహారం పెంచి ఇచ్చారు. ఇన్ పుట్ సబ్సీడీ కింద చంద్రన్న ప్రభుత్వం ఐదేళ్లలో రూ.3,759 కోట్లు చెల్లించగా.. జగన్ రెడ్డి కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే చెల్లించి రైతును మోసం చేశాడు.

గతంలో ఎన్నడూ లేని విధంగా పరిహారం అందించి రైతులకు అండగా నిలబడేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అకాల వర్షాలతో జరిగిన పంట నష్టం వివరాలను సేకరిస్తున్నారు. అంతేకాక అరటి రైతులకు హెక్టారుకు రూ.35,000 మేర ఇన్ పుట్ సబ్సిడీ అందజేయడంతోపాటు మొక్కలు తిరిగి వేసుకునేందుకు అదనంగా హెక్టారుకు రూ.75 వేలు అందించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అంటే మొత్తం రూ.1,10,000 వరకు ప్రభుత్వం నుంచి సాయం అందుతుంది. ఇన్సూరెన్స్ ఉంటే వారికి అదనంగా చెల్లింపులు ఉంటాయి. అనంతపురం, సత్యసాయి, కడప, ప్రకాశం జిల్లాల్లో ఇప్పటికే అధికారులు పర్యటించి వివరాలు సేకరిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా త్వరలో ఎన్యూమరేషన్ ప్రక్రియ మొదలవుతుంది. ప్రభుత్వం ప్రతి ఒక్క రైతుకూ అండగా నిలబడుతుంది.. రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, ఆందోళన చెందవద్దని కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తోంది. రైతే రాజు, రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని ఆలోచించే దార్శనికుడు సీఎంచంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో రైతన్నకు మంచిరోజులు వస్తాయని ఆశిద్దాం.

**తోట నిర్మలాజ్యోతి, అనలిస్టు**

# వచ్చే నెలలో 'ప్రతి ఇంటికీ మనమిత్ర'

- వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రతి పౌరుడికీ అవగాహన కార్యక్రమం
- ప్రజల ఫోనుల్లో 9552300009 నెంబరు సేవ్ చేయించండి
- దీనిపైన కలెక్టర్లు చొరవ చూపాలి
- ప్రస్తుతం అందుబాటులో 210 సేవలు, మరో పక్షం రోజుల్లో 350 సేవలు
- కలెక్టర్ల సమావేశంలో ఐటీ, ఆర్టీజీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ ఉపయోగం, వాడకంపైన పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం కోసం ఏప్రిల్ నెలలో- ప్రతి ఇంటికీ మనమిత్ర.. కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఐటీ, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ తెలిపారు. ప్రభుత్వ సిబ్బంది, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఆ ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరికి మనమిత్ర - వాట్సాప్ గవర్నెన్స్ గురించి అవగాహన కల్పిస్తారని, అలాగే ఆ ఇంట్లో ఉన్నవారందరి స్మార్ట్ ఫోన్లలో వాట్సాప్ గవర్నెన్స్ నంబరు 9552300009 సేవ్ చేయించి, దాని ద్వారా ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్న సేవలు ఎలా పొందాలి అనే దానిపైన అవగాహన కల్పిస్తారని చెప్పారు. సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో తొలిరోజు మంగళవారం ఆయన మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ అమలు గురించి వివరించారు. పౌరులెవ్వరూ కూడా ప్రభుత్వ సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కేవలం తమ స్మార్ట్ ఫోనులో ఉన్న వాట్సాప్ ద్వారానే సులభంగా పొందే అవకాశం కల్పించాలనే సదాశయంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర పేరిట వాట్సాప్ గవర్నెన్స్‌ను అమల్లోకి తెచ్చిందన్నారు. దీని ద్వారా ప్రస్తుతం ప్రభుత్వం 210 సేవలు కల్పిస్తున్నామని, మరో వారంలో రోజుల్లో ఈ సంఖ్య 250కి పెంచుతున్నామని, పక్షం రోజుల్లో 350 సేవలు అందించనున్నామన్నారు. రాబోయే రోజుల్లో దాదాపు 1000 రకాల సేవలను పౌరులకు అందించాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. పౌరులకు కావాల్సిన ధృవపత్రాలు కూడా వాట్సాప్ ద్వారా అందించనున్నామన్నారు. ఆధార్ అనుసంధానం, డిజీ లాకర్ల ద్వారా తమ ధృవపత్రాలను ఏ కార్యాలయానికి వెళ్లకుండా కేవలం తమ ఫోనులో ఉన్న వాట్సాప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా క్షణాల్లో సులభంగా పొందే సదుపాయం దీనిద్వారా కల్పిస్తున్నామన్నారు. డిజిటల్ సర్టిఫికెట్ చట్టబద్ధమేనని చెప్పారు. అధికారు లు కూడా పౌరులు డిజిటల్ సర్టిఫికెట్లను చూపిస్తే మళ్లీ ఫిజికల్ సర్టిఫికెట్లు సమర్పించాలనే ఒత్తిడి చేసే పరిస్థితి ఉండదన్నారు. పౌరుడు సమర్పించిన డిజిటల్ సర్టిఫికెట్ అసలైనదా కాదా అనేది క్యూఆర్ కోడ్ ద్వారా తనిఖీ చేస్తే వెంటనే తెలిసిపోతుందన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పొందిన డిజిటల్ సర్టిఫికెట్‌ను పౌరులు పొందుపరిస్తే మళ్లీ అధికారులు ఫిజికల్ సర్టిఫికెట్ సమర్పించమని ఒత్తిడి చేయరాదని కోరారు.

**9552300009కి ప్రచారం కల్పించండి**

మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నంబరు 9552300009కు జిల్లాల్లో, క్షేత్రస్థాయిలో విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్లను కాటంనేని భాస్కర్ కోరారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కూడా దీనిపైన అవగాహన కల్పించాలన్నారు. ఎలా వాడాలి, ఎలా ఉపయోగించు కోవాలి అనే దానిపైన అవగాహన కల్పించాలన్నారు. జిల్లాల్లో దీనిపైన నిరంతర శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించాలని కోరారు. ఇదే సందర్భంలో ప్రభుత్వ శాఖలు కూడా తాము వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందించే సేవల్లో కచ్చితత్వం పాటించాలన్నారు. వర్క్ ఫ్రం హోం సర్వే కార్యక్రమం కూడా దాదాపుగా పూర్తి అయిందన్నారు. ఈ సర్వేలో ఏఏ విద్యార్థులు ఉన్నాయనేది వర్గీకరించి దాని ప్రకారం వారికున్న నైపుణ్యాల స్థాయి ఆధారంగా వారికి శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాల్లో నిర్మిస్తున్న ఆర్టీజీ భవనాల పరిరక్షణకు కూడా కలెక్టర్లు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

# మార్గదర్శి - బంగారు కుటుంబం

- ఉగాది రోజున సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- పేదరిక రహిత ఏపీ సాధనే లక్ష్యంగా పీ4 కార్యక్రమం
- సంపన్నవర్గాలు నిరుపేద కుటుంబాలకు చేయూతనిచ్చేలా రూపకల్పన
- కలెక్టర్ల సదస్సులో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్



అమరావతి (చైతన్యరథ): ఉగాది పండగ రోజున మార్గదర్శి- బంగారు కుటుంబం అనే వినూత్న కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించబోతున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ తెలిపారు. సచివాలయంలో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో తొలిరోజు మంగళవారం స్వర్ణాంధ్ర విజన్ -2047 డాక్యుమెంటులో భాగంగా పీ4 కార్యక్రమంపై పీయూష్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జీరో పావర్టీ సాధనే లక్ష్యంగా పీ4 కార్యక్రమం రూపొందించామన్నారు. సమాజంలో ఉన్నతంగా ఉన్న 10 శాతం సంపన్న వర్గాలు.. సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేద కుటుంబాలను ఆదుకుని వారి అభ్యున్నతి కోసం స్వచ్ఛందంగా ముందుకొచ్చేవారి కొరకు రూపొందించిన కార్యక్రమమే మార్గదర్శి- బంగారు కుటుంబం అన్నారు. పేద కుటుంబాలను ఆదుకునే వారు మార్గదర్శిగా, లబ్ధిపొందిన పేద కుటుంబాన్ని బంగారు కుటుంబంగా పరిగణిస్తామన్నారు. ఇప్పటికే 1.28 కోట్ల కుటుంబాలను సర్వే చేసి అందులో పేదరికంలో ఉన్న 30 లక్షల కుటుంబాలను గుర్తించామని, వీటిలో ఆదుకోదగ్గ 28 లక్షల కుటుంబాలను గ్రామసభల ద్వారా గుర్తించామన్నారు. మార్గదర్శి-బంగారు కుటుంబం అనేది ప్రభుత్వ పథకం కాదని, ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమమని, ప్రజలకు ఈ విషయంలో అవగాహన కల్పించాలన్నారు. ఉగాది రోజున ఈ బృహత్తర వినూత్న కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నామని, ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా జిల్లా కలెక్టర్లు సహకారం అందించాలని కోరారు.

**పీ4 స్వర్ణాంధ్ర సొసైటీ**

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చేవారి కోసం పీ4 స్వర్ణాంధ్ర సొసైటీ ఆధ్వర్యంలో ఒక పోర్టల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందులో ఎవరైనా సరే లాగిన్ అయి ఒక కుటుంబాన్ని ఎలా ఆదుకోవాలనుకుంటున్నారో, ఎలా దత్తత తీసుకోదలచుకున్నారో అందులో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సొసైటీలను రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, నియోజకవర్గం, సచివాలయ స్థాయిలో కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

# ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్తి స్థాయి మరింత పెంచాలి

- ఐవీఆర్ఎస్ సర్వే నివేదికలిస్తున్నాం
- ఎక్కడెక్కడ వెనుకబడ్డామో తెలుసుకుని పరిస్థితులు మెరుగుపర్చాలి
- కలెక్టర్లకు ఐ అండ్ పీఆర్ సంచాలకులు హిమాన్షు శుక్లా సూచన
- పీపుల్స్ పెర్‌సెప్షన్స్‌పై కలెక్టర్ల సదస్సులో ప్రజెంటేషన్



అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలపై ప్రజల్లో సంతృప్తి స్థాయి మరింత పెంచేలా జిల్లాల్లో యంత్రాంగం పనిచేయాలని ఆ దిశగా జిల్లా కలెక్టర్లు కృషి చేయాలని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ (ఐ అండ్ పీ ఆర్) సంచాలకులు హిమాన్షు శుక్లా అన్నారు. సచివాలయంలో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశం తొలిరోజు పీపుల్స్ పెర్‌సెప్షన్‌పై హిమాన్షు శుక్లా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటం లాంటి అంశాల్లో ఇంకా సంతృప్తి పెరగాల్సిన అవసరముందన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ గతంలోకంటే ప్రస్తుతం మెరుగైందని, అయితే అది మరింత మెరుగుపడాల్సి ఉందన్నారు. ఆర్టీసీ సేవలు, ఇసుక లభ్యత, శాంతి భద్రతలు, క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, తదితర అంశాలపై ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా సేకరించిన ప్రజా సంతృప్తి స్థాయిపై ముఖ్యమంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏఏ ప్రాంతంలో ఆయా కార్యక్రమాలు పూర్తి స్థాయిలో జరగలేదు, ఎక్కడ ఇంకా మెరుగు పడాల్సి ఉందనే వివరాలు జిల్లా కలెక్టర్లందరికీ అందజేస్తున్నామన్నారు. ఆయా కార్యక్రమాల అమలులో ఎక్కడ వెనుకబడి ఉన్నామో మదింపు చేసుకుని వాటిని మెరుగుపరచడానికి జిల్లా కలెక్టర్లు కృషి చేయాలని కోరారు.

# ప్రజలపై పైసా భారం లేకుండా అమరావతి నిర్మాణం

- మంత్రి నారాయణ స్పష్టీకరణ
- పలు నిర్మాణాల పరిశీలన



అమరావతి (చైతన్యరథం): ప్రజలపై పైసా భారం లేకుండా రాజధాని అమరావతి నిర్మాణం చేపడతామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి నారాయణ స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలో మంత్రి నారాయణ మంగళవారం పర్యటించారు. ఇప్పటికే పలు పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా.. నిర్మాణంలో ఉన్న కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల బంగ్లాలను, సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఏ రాష్ట్రానికి అయినా రాజధాని అవసరమని, ప్రస్తుతం రాజధాని లేని రాష్ట్రం ఏపీ మాత్రమేనని అన్నారు. గత టీడీపీ హయాంలో రూ. 43 వేల కోట్లకు టెండర్లు పిలిచామని, అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆల్ ఇండియా సర్వీస్ భవనాలు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోలేదని మంత్రి నారాయణ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అనేక ఇబ్బందులు వచ్చాయన్నారు. ఐఐటీ మద్రాస్ నుంచి నిపుణులు పిలిపించి కట్టడాల నాణ్యత పరిశీలించి, కాంట్రాక్టర్లతో చర్చించి కొన్ని సమస్యలు పరిష్కరించామన్నారు. 90 శాతం పనులకు టెండర్లు పూర్తి అయ్యాయన్నారు. మొదట జంగిల్ క్లియరెన్స్‌తో పనులు మొదలయ్యాయన్నారు. కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల బంగళాలను పరిశీలించాం. మంత్రులు, జడ్జీలు, కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులకు 186 భవనాలు వస్తున్నాయి. గెజిటెడ్ అధికారులకు 1440, ఎన్జీవోలకు 1995 నిర్మాణాలు వస్తున్నాయి. హైకోర్టు 16.85 లక్షల చదరపు అడుగుల్లో వస్తోంది. 250 మీటర్ల ఎత్తులో అసెంబ్లీ భవనం రానుంది. 15 రోజుల్లో కాంట్రాక్టర్లకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ప్రజలపై ఒక్క పైసా భారం లేకుండా రాజధాని నిర్మాణం పూర్తి అవుతుంది. వరల్డ్ బ్యాంకు, ఏడీబీ నుంచి రుణాలు తీసుకున్నాం. ల్యాండ్ వాల్యూ పెరిగిన తర్వాత అప్పు తీరుస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు.

మరోవైపు విశాఖలో భోగాపురం ఎయిర్ పోర్ట్ రోడ్ల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయని మంత్రి నారాయణ అన్నారు. ఇందుకోసం రోడ్ల విస్తరణ చేయాల్సి ఉందని అన్నారు. ఆ ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా ఎక్కువగా ఉందని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ, ఇతర ట్రాఫిక్ సమస్యలపై నాలుగు రోజుల క్రితం విశాఖ స్థానిక నేతలతో చర్చించామన్నారు. విశాఖ మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష చేశామని తెలిపారు. ఫైనల్ చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఆన్‌లైన్‌లో ఉంచుతామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుని నాలుగు నెలల్లో మాస్టర్ ప్లాన్ ఫైనల్ చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. మాస్టర్ ప్లాన్ అంటే రాబోయే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని చేయాలని చెప్పారు. కొన్నిచోట్ల రోడ్ల పరిధిని పెంచడంపై అధికారులతో చర్చించినట్లు చెప్పారు. మెట్రో రైల్ కూడా మాస్టర్ ప్లాన్‌లో భాగమేనని తెలిపారు. 8 క్రాస్ రోడ్ల దగ్గర ఫ్లై ఓవర్లు ఉన్నాయని చెప్పారు. ఇక్కడ డబుల్ డెక్కర్ రోడ్లు ప్లాన్ చేసేలా ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాలను చెప్పారని అన్నారు. టీడీఆర్ బాండ్ల విషయం అందరికీ తెలుసునని.. టీడీఆర్ బాండ్లపై అన్ని మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్ జరుగుతోందని తెలిపారు. త్వరలోనే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# చేనేతలకు 365 రోజుల పని కల్పనే లక్ష్యం

- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఉద్ఘాటన
- చేనేతలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం
- త్వరలో మరిన్ని చేనేత ఎగ్జిబిషన్లు
- ఎగ్జిబిషన్ల ఏర్పాటుతో చేనేత వస్త్రాల అమ్మకాలు పెరిగాయి
- ఎగ్జిబిషన్ల నిర్వహణతో రోజూ పని దొరుకుతోందని మంత్రికి నేతన్నల ధన్యవాదాలు



విజయవాడ (చైతన్యరథం): నేతన్నలకు 365 రోజుల పాటు పని కల్పించడంతో పాటు చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం మరిన్ని ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్ సవిత స్పష్టం చేశారు. విజయవాడలోని ఓ కల్యాణమండపంలో చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాల స్టాళ్లను మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. చేనేత వస్త్రాల అమ్మకాల కోసం రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాల్లోనూ ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రాబోయే ఉగాది సంబరాల నేపథ్యంలో విజయవాడలో చేనేత ఎగ్జిబిషన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో రాష్ట్రానికి చెందిన పొందూరు, ఉప్పాడ, అంగర, పులగర్త, బందరు, మంగళగిరి చీరలు, డ్రెస్ మెటీరియల్స్, చీరాల చీరలు, డ్రెస్ మెటీరియల్స్ వెంకటగిరి, ధర్మవరం మదనపల్లి ఎమ్మిగనూరు, గద్వాల్, కంచిపురం, పోచంపల్లి చీరల స్టాళ్లతో పాటు తెలంగాణ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, జమ్మూ కశ్మీర్, బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన నేతన్నలు 89 స్టాళ్లు ఏర్పాటు చేశారన్నారు. ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న నేతన్నలందరికీ ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు.

### నేతన్నలకు ఇచ్చిన హామీల అమలు

నేతన్నలకు 365 రోజుల పాటు పని కల్పించాలన్న లక్ష్యంతో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేనేతలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని మంత్రి సవిత వెల్లడించారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చిన విధంగా మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. నూలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తున్నామన్నారు. ఆధునిక పని ముట్లను 90 శాతం సబ్సిడీపై చేనేతలకు సరఫరా చేస్తున్నామన్నారు. ముడి సరకులు కూడా సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. థ్రిఫ్ట్ పథకంలో ప్రభుత్వం వాటాను 8 నుంచి 16 శాతానికి పెంచామన్నారు. గత ఏడాది 10 క్లస్టర్లు ఏర్పాటు చేశామన్నారు. జగన్ ప్రభుత్వం తొమ్మిది పర్యాయాలు విద్యుత్ ఛార్జీలు పెంచి, చేనేతలపై అధిక భారం మోపిందని మంత్రి సవిత మండిపడ్డారు.

### త్వరలో మరిన్ని ఎగ్జిబిషనన్లు

చేనేత వస్త్రాలకు మరింత మార్కెట్ సదుపాయం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా రానున్న రోజుల్లో మరిన్ని ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయనున్నామని మంత్రి సవిత తెలిపారు. రాబోయే తెలుగు సంవత్సరాది ఉగాది పండగ దృష్ట్యా ప్రజలందరూ సంప్రదాయానికి ప్రాధాన్యమిస్తూ చేనేత వస్త్రాలు ధరించాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

### రోజూ మాకు పని దొరుకుతోంది : నేతన్నల హర్షం

అనంతరం చేనేత వస్త్రాలు, హ్యాండీ క్రాఫ్ట్ స్టాళ్లను మంత్రి సవిత సందర్శించారు. ఏ రాష్ట్రం నుంచి వచ్చారు...ఏయే వస్త్రాలు అమ్మకాలకు పెట్టారు.. అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కార్మికులు... మంత్రి సవితతో మాట్లాడుతూ, తరుచూ ఎగ్జిబిషన్లు నిర్వహించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయడం వల్ల చేనేత వస్త్రాల అమ్మకాలు పెరిగాయని, రోజూ పని దొరుకుతోందని, దీంతో తమకు ఆదాయం పెరిగిందని స్టాళ్ల నిర్వాహకులు ఆనందం వెలిబుచ్చారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి తమకు మంచి రోజులు ప్రారంభమయ్యాయని నేతన్నలు ఆనందం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు వీరంకి వెంకట గురుమూర్తి, నందం అబద్ధయ్య, పలువురు డైరెక్టర్లు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, జాయింట్ డైరెక్టర్ కన్నబాబు, ఆప్కో జీఎం రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో ఆర్వోబీ నిర్మాణానికి అనుమతి

**- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వెల్లడి**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిథ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి పరిపాలనా అనుమతులు ఇచ్చినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖల మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే భద్రత పనుల కింద రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణంలో భాగంగా సేతుబంధన్ – కేంద్ర రోడ్ల మౌలిక సదుపాయాల నిధి (సీఆర్ఐఎఫ్) పథకం కింద కాకినాడ జిల్లా పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో వీ–వీ సెక్షన్ మీదుగా సామర్లకోట – ఉప్పాడ రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి ఆమోదం తెలిపామన్నారు. సామర్లకోట – ఉప్పాడ రోడ్డులోని రైల్వే కి.మీ 640/30–32 వద్ద లెవెల్ క్రాసింగ్ నంబర్ 431కు బదులుగా రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి రెండవ దశ పరిపాలనా అనుమతుల కింద రూ. 59.70 కోట్లు కేటాయించామన్నారు.

పిఠాపురం నియోజకవర్గంలో ట్రాఫిక్ రద్దీ, స్థానిక ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని, గత ఎన్నికల సమయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్థానిక ప్రజలకు ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తామంటూ హామీ ఇచ్చారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో కీలకమైన ప్రాజెక్టులు, ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. నేడు ఆర్థిక ఇబ్బందులు రాష్ట్రాన్ని వెంటాడుతున్నా, నాడు ప్రతిపక్షంలో ఉండగా ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని కూటమి ప్రభుత్వం విజయవంతంగా నేరవేరుస్తోందన్నారు.

గత 5 ఏళ్లలో రాష్ట్రంలో కనీస మౌలిక సదుపాయాల కల్పనపై వైసీపీ ప్రభుత్వం ఎక్కడా దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. దీంతో రాష్ట్రంలోని రహదారులు అత్యంత దారుణంగా మారిపోయిన పరిస్థితిలో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే గుంతల రహిత రోడ్ల మిషన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని, విజయవంతంగా పూర్తి చేశామన్నారు.. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 20 వేల కి.మీ మేర రోడ్లను గుంతల రహితంగా తీర్చిదిద్ది.. 95 శాతం పైగా గుంతల రోడ్ల రూపురేఖలను నేడు పూర్తిగా మార్చివేశామన్నారు. త్వరలోనే 100 శాతం రోడ్లను గుంతల రహితంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

# క్రీడా యాప్‌ను ముందుకు తీసుకెళ్లాలి

**- అసోసియేషన్ల నిర్వాహకులకు శాప్ చైర్మన్ రవినాయుడు సూచన**



విజయవాడ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) రూపొందించిన క్రీడాయాప్‌ను ఆయా క్రీడా అసోసియేషన్లు ముందుకు తీసుకెళ్లాలని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు సూచించారు. శాప్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో క్రీడా సంఘాల నిర్వాహకులతో మంగళవారం రవినాయుడు సమీక్షించారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ క్రీడాయాప్ వల్ల కలిగే ప్రయోజనాలను క్రీడాకారులందరికీ తెలియజేయాలన్నారు. క్రీడాకారులకు పారదర్శకమైన సేవలను అందించేందుకే క్రీడాయాప్‌ను తీసుకొచ్చామన్నారు. ముఖ్యంగా నకిలీ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో శాప్ పకడ్బందీగా పనిచేస్తుందన్నారు. అలాగే అసోసియేషన్లు కూడా బలోపేతమవ్వాలని, క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఒక రాష్ట్రంలో ఒక క్రీడకు సంబంధించిన అసోసియేషన్ ఒకటి మాత్రమే ఉండాలని, దానికి అనుగుణంగా అసోసియేషన్లు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అసోసియేషన్లపై కోర్టుల్లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవాలన్నారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, ఔత్సాహికులు, దాతలు ముందుకొచ్చి క్రీడలను, క్రీడాకారులను దత్తత తీసుకోవడంతోపాటు అవసరమైన నిధులను సమకూర్చేలా అసోసియేషన్లు కృషి చేయాలన్నారు. క్రీడా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ముఖ్య నగరాలు, పట్టణాలలో విలువైన భూములను ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొస్తుందన్నారు. దానికి అనుగుణంగా క్రీడావసతులు, సౌకర్యాల కల్పనకు సీఎస్ఆర్ నిధులను సమకూర్చే విషయంలోనూ చొరవ చూపాలని కోరారు. ఏపీకి చెందిన అంతర్జాతీయస్థాయి క్రీడాకారులు జాతీయపోటీల్లో పాల్గొనేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఏపీ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేసేలా అన్ని ప్రభుత్వ కార్యాక్రమాల్లోనూ క్రీడాకారులను భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాస్థాయిలోని అసోసియేషన్ కమిటీలు కూడా ఆయా జిల్లాల్లో విరివిగా క్రీడా కార్యకలాపాలను నిర్వహించాలని, అలాగే రాష్ట్ర అసోసియేషన్ల కమిటీలు కూడా జిల్లాల్లో జరుగుతున్న క్రీడల అభివృద్ధిని పర్యవేక్షించాలన్నారు. ముఖ్యంగా యోనెక్స్ కంపెనీ స్పాన్సర్‌షిప్ తీసుకొచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలని శాప్ పరిపాలనాధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో శాప్ ఏవో ఆర్.వెంకటరమణ నాయక్, ఏపీ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# వివేకా హత్యకేసు తప్పుదోవ పట్టించేందుకు యత్నం

**- ఎంపీ అవినాష్ కీలక సూత్రధారి**

**- సుప్రీంకోర్టులో ఏపీ సర్కార్ అదనపు అఫిడవిట్**

న్యూఢిల్లీ (చైతన్యరథం): మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును తప్పుదోవ పట్టించేందుకు వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డి ప్రయత్నించారని ఏపీ ప్రభుత్వం తెలిపింది. దీనిపై సుప్రీంకోర్టులో అదనపు అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ఎంపీ అవినాష్ రెడ్డి మార్గదర్శకత్వంలోనే సీబీఐ అధికారి రాంసింగ్, సునీత, నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారని అందులో పేర్కొంది. వైఎస్ వివేకా హత్య కేసును ఉద్దేశపూర్వకంగా తారుమారు చేసేందుకు కుట్ర జరిగిందని వివరించింది.

రాంసింగ్, సునీత, నర్రెడ్డిలపై వివేకా పీఏ ఎంవీ కృష్ణారెడ్డి దాఖలు చేసిన కేసులో అదనపు డాక్యుమెంట్లను సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం దాఖలు చేసింది. సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డిలను కూడా కుట్రపూరితంగా ఈ కేసులో ఇరికించాలని చూశారని పేర్కొంది. రాంసింగ్‌పై కేసు పెట్టినప్పుడు ఉన్న ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ జి.రాజు ప్రొఫెషనల్‌గా కేసును విచారించలేదని తెలిపింది. తనను అవినాష్ రెడ్డి బెదిరించినట్లు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ జి. రాజు అంగీకరించినట్లు చెప్పింది. ఎంవీ కృష్ణారెడ్డి చెప్పిన వాటిల్లో ఏ ఒక్కదానికీ సరైన ఆధారాలను చూపలేకపోయారని.. అసలు ఎంవీ కృష్ణారెడ్డిని రాంసింగ్ ఎప్పుడూ విచారించలేదని స్పష్టం చేసింది. వెంకట కృష్ణారెడ్డి పోలీసు స్టేషన్‌కే రాలేదనే విషయం సీసీ టీవీలో చాలా స్పష్టంగా తెలుస్తోందని ప్రభుత్వం వెల్లడించింది. సీసీ టీవీ ఫుటేజ్‌లతో పాటు పలు సాక్ష్యాలను ఏపీ ప్రభుత్వం బయటపెట్టింది. ఇలా ఉంటే వెంకట కృష్ణారెడ్డి చెప్పినవన్నీ కట్టుకథలేనని కొత్త విచారణాధికారి బి.మురళి స్పష్టం చేశారు.

# పోలీసు అధికారి బెదిరింపులు



- వైసీపీ హయాంలో కాల్‌మనీ వ్యవహారం బహిర్గతం చేసినందుకు ఇబ్బందులు
- ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటును అడ్డుకుంటున్న వైసీపీ ఎంపీటీసీ
- భూ కబ్జాలు, ఇతర సమస్యలపై వినతులు
- టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన నేతలు రూపేంద్రరెడ్డి, వజ్జా బాబురావు





అమరావతి (చైతన్యరథం): భూమి సంబంధిత, పలు ఇతర సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా బాధితులు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చారు. మంగళవారం జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ రూపేంద్రరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ వజ్జా బాబురావు వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

ఇంటెలిజెన్సీ డీఎస్పీ ఒకరు తనను చంపుతానని బెదిరించడమేకాక తనపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన జమ్మలమూడి సుధీర్ అనే వ్యక్తి వాపోయాడు. వైసీపీ హయాంలో కాల్‌మనీకి సంబంధించిన సమాచారం తన వద్ద ఉందని, దాన్ని బహిర్గతం చేశానని ఈ చర్యలకు పాల్పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలంలో ఇద్దరు వ్యక్తులు దొంగ పత్రాలు సృష్టించి 2103/4 సర్వే నెంబర్ లోని 40 సెంట్ల భూమిని కబ్జా చేశారని, అంతేకాక కోర్టును కూడా తప్పుదోవ పట్టించారని కొందరు ఫిర్యాదు చేశారు. సంక్రాంతి సంబరాల సమయంలో ఈ భూమిలో పశు వుల పండుగ జరుపుకునేవారన్నారు. ఈ భూమికి సంబంధించిన ఫేక్ డాక్యుమెంట్లను రద్దు చేసి ఆ భూమిని కబ్జాదారుల నుండి కాపాడాలని కోరారు.

గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని మండలంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు వైసీపీ ఎంపీటీసీ అడ్డుకుంటున్నాడని, స్థానిక ఎమ్మెల్యే కలుగజేసుకుని విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని టీడీపీ అభిమానులు విజ్ఞప్తి చేశారు.

తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట గ్రామానికి చెందిన కాంతకుమారి విజ్ఞప్తి చేస్తూ.. తన ఇద్దరు పిల్లలు వికలాంగులని, ఇంటి స్థలం మంజూరు చేయాలని వైసీపీ హయాంలో కోరగా.. వాలంటీరుకు రూ. 5వేలు, మధ్యవర్తులు, అధికారులకు రూ.50 వేలు ఇస్తేనే ఇంటి స్థలం ఇప్పిస్తామన్నారని ఫిర్యాదు చేశారు. ఈ ప్రభుత్వంలోనైనా ఇంటి స్థలం ఇచ్చేలా చూడాలని అర్జీ ఇచ్చారు.

కర్నూలు జిల్లా ఆదోని మండలం మంత్రికి గ్రామానికి చెందిన బి. ఇందిరమ్మ విజ్ఞప్తి చేస్తూ.. చిన్నకొడుమూరు గ్రామానికి చెందిన మాధవరెడ్డి, తదితరులు తనపై తప్పుడు కేసులు నమోదు చేయించి ఇబ్బంది పెడుతున్నారని. న్యాయం చేయాలని కోరారు.

పల్నాడు జిల్లా దుర్గి మండలం నిదానంపాడు గ్రామానికి చెందిన గాడిపర్తి శ్రీదేవి విజ్ఞప్తి చేస్తూ.. అద్దెకిచ్చిన గదులను ఖాళీ చేయమని కోరితే పంగలూరి అంజయ్య, అతని అనుచరులు తనపై రాడ్‌లతో, కర్రలతో దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసి 6 నెలలు గడుస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని, విచారించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ శాఖలో పనిచేస్తున్న పలువురు విజ్ఞప్తి చేస్తూ.. 60 మంది ఈ విభాగంలో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కొత్తగా వీఎంసీ శానిటేషన్ వర్క్‌లో అప్కాస్ విధానంలో భర్తీ చేస్తున్న 150 పోస్టుల్లో ప్రస్తుతం పనిచేస్తున్న 60 మందికి అవకాశం కల్పించాలని కోరారు.

వైసీపీ హయాంలో ఇంటి స్థలం ఇవ్వగా.. అందులో ఇల్లు నిర్మించుకుంటే దానికి సంబంధించిన బిల్లులు మంజూరు చేయలేదని, టీడీపీ హయాంలోనైనా ఇంటి నిర్మాణపు బిల్లులు మంజూరు చేయించాలని నంద్యాల జిల్లాలోని మండల కేంద్రం పాణ్యం గ్రామానికి చెందిన యడ్లమని వాపోయారు.

తన కోడలి నుండి తనకు రక్షణ కల్పించాల్సిందిగా పోలీసులను ఆశ్రయిస్తే పోలీసులు వెటకారంగా మాట్లాడుతూ పట్టించుకోవడంలేదని గుంటూరులోని కొండవెంకటప్ప కాలనీకి చెందిన ఉయ్యాల చిన్నమ్మ ఫిర్యాదు చేశారు. గతంలో అనేకసార్లు తన కోడలు తనను గాయపరచినట్లు పోలీసులకు చూపించి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయటం లేదని తెలిపారు.

అనకాపల్లి జిల్లా మునగపాక మండలానికి చెందిన పనగళ్ల అచ్యుతాంబకు చెందిన ఆస్తికి ఆమె కుమార్తె ధృవపత్రాలను మార్చేసిందని, తప్పుడు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకుని కోట్లాది రూపాయల ఆస్తిని కాజేసిందని ఈ విషయాన్ని విచారించి తగు న్యాయం చేయాలని బాధితులు కోరారు









## క్రీడలతో అత్యున్నత గౌరవం

**- శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు**

విజయవాడ (చైతన్యరథం): క్రీడల్లో అత్యుత్తమంగా రాణించే క్రీడాకారులందరికీ ప్రపంచంలోనే అత్యున్నత గౌరవం దక్కుతుందని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని పి.బి.సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ సైన్స్ డిపార్టుమెంట్లు మంగళవారం సంయుక్తంగా నిర్వహించిన 50వ క్రీడా వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులనుద్దేశించి రవినాయుడు ప్రసంగించారు. క్రమశిక్షణ కలిగిన విద్యాసంస్థగా పి.బి.సిద్ధార్థ కళాశాల ప్రసిద్ధి చెందిందని, స్పోర్ట్స్ కోటా కింద 25 ఫ్రీ సీట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. క్రీడలకు కళాశాల యాజమాన్యం ఇస్తున్న ప్రాధాన్యం, ప్రోత్సాహం ఎనలేనిదని కొనియాడారు. క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్న సిద్ధార్థ విద్యాసంస్థను మిగిలిన కళాశాలలు కూడా ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా క్రీడాకారులకు గెలుపోటములు సర్వసాధారణమని, క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని వివరించారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. దానిలోభాగంగానే దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ స్పోర్ట్స్ పాలసీని రూపొందించామన్నారు. క్రీడా ప్రోత్సాహకాల పెంపు, స్పోర్ట్స్ కోటా 2శాతం నుంచి 3శాతానికి పెంచిన ఘనత సీఎం నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. అలాగే జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులకు యూనిఫాం ఉద్యోగాల్లో కొలువులకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అనంతరం ప్రత్యేక ఆహ్వానితులైన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి తరిమి సూర్యచరిష్మా మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం కష్టమైనప్పటికీ ఇష్టంగా భావించి ముందుకెళ్తే విజయం సాధ్యమన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన కళాశాల యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ మేకా రమేష్ మాట్లాడుతూ క్రీడల్లో ప్రాక్టీస్ అనేది అనునిత్య ప్రక్రియన్నారు. తద్వారా క్రీడాకారులకు క్రమశిక్షణ అలవడటంతోపాటు గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సందర్భంగా శాప్ ఛైర్మన్‌కు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేస్తూ దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ ఎమ్.రాజయ్య, సిద్ధార్థ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ హెచ్‌ఓడీ టి.వి.బాలకృష్ణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### శాప్ ఛైర్మన్‌ను కలిసిన జూడో క్రీడాకారులు..

విజయవాడలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ రవినాయుడిని జూడో క్రీడాకారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ ఈనెల 15,16వ తేదీల్లో జరిగిన స్టేట్ మీట్‌లో ప్రతిభ కనబరిచి జూనియర్ నేషనల్ పోటీలకు ఎంపికయ్యామన్నారు. ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకూ డెహ్రాడూన్‌లో జరిగే జూడో జూనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా వారిని రవినాయుడు అభినందిస్తూ ఏపీకి అత్యధిక పతకాలు సాధించిపెట్టాలని బాలబాలికల టీమ్‌లను ప్రోత్సహించారు.

## సమస్యలు తెలుసుకుంటూ బాధితులకు భరోసా కల్పిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుంటూ సమస్యల పరిష్కారమే అజెండాగా ముందుకు వెళు తున్నారు పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర. మంగళవారం తన క్యాంప్ ఆఫీసు వద్ద ఉదయం కొన్ని గంటల పాటు ప్రజల కోసం కేటాయిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను తెలుసుకొని తక్షణమే సంబంధిత అధికారులకు ఫోన్లో మాట్లాడి ఆ సమస్యల పరిష్కారానికి తనవంత కృషి చేస్తున్నారు. క్యాంప్ ఆఫీసు వద్ద పలువురు నుంచి వినతులు స్వీకరించారు వ్యక్తిగత సామాజిక సమస్యలతో పాటు వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించి వాటి పరిష్కారానికి చొరవ చూపారు.

## 22 కిలోల గంజాయి స్వాధీనం



పలాస (చైతన్యరథం): ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకువస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 22 కిలోలు స్వాధీనం చేసుకున్నట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లా డుతూ వివరాలు వెల్లడించారు. ఈ మేరకు.. ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరి తాలూకా టిక్క మాల గ్రామానికి చెందిన ఆమోద్ ఆనంద్కు అదే గ్రామానికి చెందిన కబు ఆనంద్తో బంధుత్వం ఉంది. కబు ఆనంద్ ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి ముంబైలో విక్రయిస్తుంటాడు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన నిఖిల్పాణితో కలిసి ఆమోద్ ఆనంద్ సోమవారం గంజాయిని తరలిస్తుం డగా పలాస రైల్వే స్టేషన్ వద్ద సీఐ పి.సూర్యనారాయణ సిబ్బందితో కలిసి పట్టుకున్నారన్నారు. అయితే నిఖిల్పాణి పరారు కాగా ఆనంద్ను అరెస్ట్ చేసి పలాస కోర్టులో హాజరుపరిచామన్నారు. మాదక ద్రవ్యాల రవాణాపై నిఘా పెట్టామని, అన్ని మార్గాల్లో సిబ్బంది పహారా ఉన్నారన్నారు. గంజాయి తీసు కున్నా, రవాణా చేసినా తమకు సమాచారం అందించాలని కోరారు. సమా వేశంలో సీఐ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

పురపాలికల్లో ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేసేందుకు ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చింది. ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీని 50 శాతం మేర మాఫీ చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. భవనాలు, ఖాళీ స్థలాలపై ప్రస్తుత సంవత్సరం చెల్లించాల్సిన మొత్తంతో పాటు పాత బకాయిలపై వడ్డీ మాఫీకి నిర్ణయం తీసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వన్ టైమ్ మెజర్ కింద మాత్రమే ఈ వడ్డీ మాఫీ వర్తిస్తుందని స్పష్టం చేసింది. 2025 మార్చి 31లోగా చెల్లించే బకాయిలకు మాత్రమే 50 శాతం వడ్డీ మాఫీ ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## పాఠశాలలను విలీనం చేయొద్దు



బొబ్బిలి (చైతన్యరథం): యూపీ పాఠశాలలు జిల్లా పరిషత్ పాఠశాలల్లో విలీనం కాకుండా చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి ఎమ్మెల్యే బేబీనాయనను కోరారు. ఈ మేరకు బొబ్బిలి కోటలోగల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. జీవో నెంబరు 117ను రద్దు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కేశవరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 29న నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో జెండా ఎగురవేయాలి : గొండు శంకర్



శ్రీకాకుళం (చైతన్యరథం): టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 29న నియోజకవర్గంలోని అన్ని డివిజన్లు, పంచాయతీల్లో పార్టీ జెండాను ఎగురవేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులోగల టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి 60 మందికి ఇద్దరు చొప్పున కుటుంబ సాధికార సమితులను ఏర్పాటు చేయాలని, డివిజన్ ఇన్‌ఛార్జిలు, నాయకులను కోరారు. బుధవారం స్థానిక ఏడురోడ్ల జంక్షన్ వద్ద నిర్వహించనున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజేబాబు, నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, అరవల రవీంద్ర, సింతు సుధాకర్, కొర్ను నాగార్జున ప్రతాప్, చిట్టి నాగభూషణరావు, లోపింటి రాధాకృష్ణ, కోరాడ వెంకటరావు, సీర రమణయ్య, ఇప్పిలి తిరుమలరావు, కవ్వాడి సుశీల పాల్గొన్నారు.

శిక్షణతో నైపుణ్యం పెంపొందించుకోవాలి

విద్యార్థులు తమ నైపుణ్యాలను శిక్షణతో పెంపొందించుకొని జీవితంలో అభివృద్ధి సాధించా లని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. శ్రీకాకుళంలోని బలగలో గల డీఎల్‌టీసీ, ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు.

## ఫ్రీ గ్యాస్ సిలిండర్ పొందేందుకు నెలాఖరు వరకే గడువు



దీపం-2 పథకంలో భాగంగా మొదటి ఫ్రీ గ్యాస్ సిలిండర్ పొందేందుకు ఈ నెలాఖరు వరకే గడువు ఉంది. ఇప్పటి వరకూ ఉచిత గ్యాస్ సిలిండర్ పొందని వారు వెంటనే బుక్ చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఇప్పటికే ప్రకటించారు. ఏడాదికి 3 సిలిండర్లను ఉచితంగా ఇచ్చే ఈ స్కీమ్‌ను గతేడాది చివరిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించింది. ఏప్రిల్ నుంచి జూలై, ఆగస్టు నుంచి నవంబరు, డిసెంబరు నుంచి మార్చి మధ్యలో, అంటే నాలుగు నెలలకు ఒకటి చొప్పున ఫ్రీ గ్యాస్ సిలిండర్లు పొందవచ్చు.

ఇలా పొందొచ్చు: రేషన్‌కార్డు ఉన్న గ్యాస్ వినియోగదారులంతా ఫ్రీ గ్యాస్ సిలిండర్ పొందేందుకు అర్హత ఉందో లేదో చెక్ చేయించుకోవాలి. గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నెంబర్ లింక్ అయ్యాయా లేదో చూసుకోవాలి. బ్యాంకు అకౌంట్ యాక్టివ్‌లో లేకుంటే వెంటనే పునరుద్ధరించుకోవాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ స్కీమ్ ప్రారంభం నుంచి అధికార యంత్రాంగం మండలాల వారీగా లబ్ధిదారులను చాలా వరకు అప్రమత్తం చేయడంతో ఎక్కువ శాతం మంది ఇప్పటికే లబ్ధి పొందారు. ఫ్రీ గ్యాస్ సిలిండర్ తీసుకున్న వారికి నిర్ణీత వ్యవధిలో సొమ్ము వారి బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతుంది. పలువురికి సాంకేతిక కారణాలతో డబ్బులు అకౌంట్‌లో పడలేదని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు తొలి ఫ్రీ గ్యాస్ సిలిండరు పొందని వారు ఉంటే వెంటనే బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు. గతేడాది దీపావళి పండుగ సందర్భంగా ఏపీ ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ల (దీపం-2) పథకాన్ని ప్రారంభించింది. దీనికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఫ్రీ గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే అధిక సంఖ్యలో లబ్ధిదారులు సిలిండర్లు బుక్ చేసుకున్నారు. గ్యాస్ తీసుకున్న అనంతరం వారి అకౌంట్లలో 48 గంటల్లోపే డబ్బులు జమ చేశారు. ఏపీలో దీపం 2 కింద ప్రారంభమైన ఫ్రీ గ్యాస్ సిలిండర్ పథకానికి తొలుత రాష్ట్రంలోని మొత్తం రేషన్ కార్డులతో పోలిస్తే అర్హుల సంఖ్య తక్కువగా ఉండేది. ఆంధ్రప్రదేశ్‌లో 1.54 కోట్ల గృహ వినియోగ వంటగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. గతేడాది నవంబర్ లెక్కల ప్రకారం 1.08 కోట్ల కనెక్షన్లు ఉచిత సిలిండర్‌కు అర్హత పొందాయి. కొంతమంది ఆధార్, రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షన్ అనుసంధానం లేకపోవడం వలన లబ్ధిదారుల సంఖ్య అప్పట్లో తగ్గింది. ప్రస్తుతం ఆ సంఖ్య పెరిగి ఉండొచ్చు.

## గంజాయి అక్రమ రవాణాపై నిఘా

గంజాయి అక్రమ రవాణాపై పూర్తి నిఘా పెట్టామని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని కొట్టక్కి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. గంజాయి అక్రమంగా రవాణా చేసినా, వినియోగించి నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి ఎక్కువగా రవాణా అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ దిశగా నిఘా పెట్టామని తెలిపారు. అనంతరం చెక్‌పోస్టు వద్ద ఉన్న రికార్డులు పరిశీలించారు.

## ఏపీపీఎస్సీ పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు



శ్రీకాకుళం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమైయ్యాయి. మరో రెండు రోజులపాటు నిర్వహించే మూడు విభాగాల పోస్టులకు సంబంధించిన పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ 'పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో ఏఈఈ, అలాగే ఎనలిస్ట్ గ్రేడ్-2, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పరీక్షలకు సంబంధించి మూడు కేంద్రాలను సిద్ధం చేశాం. శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీ, నరసన్నపేట కోర్ టెక్నాలజీ కాలేజీ, శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీ కేంద్రాల్లో ఈ నెల 25 నుంచి 27 వరకు పరీక్షలు నిర్వహిస్తాం. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. 25న 545 మంది, 26న 457 మంది, 27న 302 మంది మొత్తం 1,304 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలి. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలి. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాల'ని ఆదేశించారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ వివేకానంద, ఏపీపీఎస్సీ ప్రతినిధులు ఈశ్వరి, పద్మప్రియ, డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ చక్రవర్తి, చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులు పాల్గొన్నారు.

# జగన్ వచ్చేది రాజమహేంద్రవరం జైలుకే : గోరంట్ల



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నియోజకవర్గాల పునర్విభజనపై టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంతో సీఎం, డిప్యూటీ సీఎం అంతర్గతంగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఎన్డీఏలో భాగస్వామ్యంగా ఉన్నందున బహిరంగంగా మాట్లాడకూడదని చెప్పారు. జనాభా విషయంలో దక్షిణాది రాష్ట్రాలు చాలా క్రమశిక్షణ పాటించాయని చెప్పారు. ఇప్పుడు జనాభా పేరుతో సీట్లు తగ్గించడం సరికాదన్నారు. "నిన్న మాజీ సీఎం జగన్ అపర గోబెల్స్ మాట్లాడారు. మరో మూడేళ్ల తర్వాత అధికారంలోకి వస్తానని ఆయన అంటున్నారు. ఆయన వచ్చేది రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకే. వైసీపీ హయాంలోని లిక్కర్, మైనింగ్ కుంభకోణాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి. జగన్ హయాంలో పంటలకు బీమా కూడా చెల్లించకపోవడంతో రైతులు రూ.వేల కోట్లు నష్టపోయారు. గత ప్రభుత్వం గ్రామాల్లో ఒక రోడ్డు కూడా వేయలేదు. జగన్ మళ్లీ జైలు ఊచలు లెక్కించాల్సిందే. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం సహాయ నిధి ఇచ్చి ప్రజలను ఆదుకుంటున్నాం. మేలో తల్లికి వందనం, జూన్లో అన్నదాత సుఖీభవ అమలు చేయబోతున్నాం. రానున్న పుష్కరాలకు రాజమహేంద్రవరం చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందేలా ప్రణాళికలు చేస్తున్నాం. రాజమహేంద్రవరంలో 12 ఎకరాల్లో క్రికెట్ స్టేడియం నిర్మాణం జరగబోతుంది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్నితో ఇప్పటికే మాట్లాడాను. గతంలో వైసీపీ కార్యాలయానికి రాజమహేంద్రవరంలో అధికారులు తక్షణమే స్థలం ఇచ్చేశారు. టీడీపీ కార్యాలయం కోసం స్థలం. అడుగుతుంటే మాత్రం ఇవ్వడం లేదు" అని గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు.

# నైతికతపై వైసీపీ నాయకుల మాటలు హాస్యాస్పదం

విశాఖపట్నం (చైతన్యరథం): నైతికత లేని వైసీపీ నాయకులు మేయర్ అవిశ్వాసంపై మాట్లాడటం సరికాదని టీడీపీ కార్పొరేటర్ పల్లా శీను అన్నారు. మంగళవారం జీవీఎంసీలోని టీడీపీ ఫ్లోర్ లెటర్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత నాలుగేళ్లుగా అధికారంతో ఇష్టానుసారంగా వ్యవహరించిన వైసీపీ నాయకుల తీరు నచ్చక పోవడంతోనే కార్పొరేటర్లు కూటమి వైపు వస్తున్నారన్నారు. 22వ వార్డు కార్పొరేటర్ మూర్తి యాదవ్ మాట్లాడుతూ. వార్డుల్లో ఓడిపోయిన అభ్యర్థులతో పాలన కొనసాగించిన వైసీపీ తీరు సరికాదని పేర్కొన్నారు.

మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరి వెంకటకుమారి(వైసీపీ)పై అవిశ్వాసం ప్రవేశపెట్టడానికి వీలుగా కూటమి నాయకులు గత శనివారం జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్ఛార్జ్ కమిషనర్ ఎంఎన్. హరేంధిరప్రసాదు నోటీసు అందజేశారు. వైసీపీ హయాంలో జరిగిన టీడీఆర్ బాండ్ల అక్రమాలు, మాస్టర్ ప్లాన్లో మార్పుల్లో జరిగిన అవినితిపై అవిశ్వాసం పెడుతున్నామని టీడీపీ నేతలు చెబుతున్నారు.

# వైసీపీ పాలనలో ప్రభుత్వాసుపత్రి సర్వనాశనం



రాజమహేంద్రవరం (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడి ప్రజాప్రతినిధులు రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిని సర్వనాశనం చేశారని, రోగుల ఇబ్బందులను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. స్థానిక ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వైసీపీ చేసిన తప్పులను, అవినీతి వ్యవహారాలను సరిచేసి పాలన గాడిలో పెట్టడానికి దాదాపు 8నెలల సమయం పట్టిందన్నారు. రాబోయే రోజుల్లో ఆసుపత్రిని పూర్తి ప్రక్షాళన చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తామని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది కొరతను అధిగమించేందుకు, సూపర్స్పెషాలిటీ వైద్యసేవలను రోగులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ఐఎంఏ సహకారం తీసుకుంటున్నామన్నారు. మార్చురీలో శవాలపైనా డబ్బులు గుంజుతున్న వారందరినీ ఏరిపారేస్తున్నామని, ఎవరైనా అవినీతికి పాల్పడితే ఇలాంటి చర్యలే ఉంటాయన్నారు. మార్చురీకి అందజేసిన ఫ్రీజర్లను రోటరీక్లబ్ నిర్వహిస్తోందని, ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశామని, పేపర్మిల్లు ద్వారా మరో రూ.50 లక్షలు మంజూరు చేయించామని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే వాసు ఎంసీహెచ్ బ్లాకులో ఫైబ్రో లివర్ స్కానింగ్ శిబిరాన్ని ప్రారంభించారు. సమావేశంలో టీడీపీ నాయకులు కాశి నవీన్కుమార్, రెడ్డి మణేశ్వరరావు, కడలి రామకృష్ణ, రవియాదవ్, రాచపల్లి ప్రసాద్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు : వరపుల సత్యప్రభ



ప్రత్తిపాడు (చైతన్యరథం): నియోజకవర్గ అభివృద్ధికి కోసం రూ.15.83 కోట్ల మేర నిధులు విడుదల చేయడం సంతోషంగా ఉందని, ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్కళ్యాణ్లకు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వరపుల సత్యప్రభ వ్యాఖ్యానించారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా వివిధ రోడ్ల నిర్మాణానికి రూ.15 కోట్ల 83 లక్షలు విడుదల చేయడం జరిగిందని నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. దశాబ్దాల కాలంగా పరిష్కారం కాని, అనేక సమస్యలను పరిష్కరించడమే కాకుండా నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను, అడిగిన వెంటనే విడుదల చేస్తూ నియోజవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి చేస్తున్న సహకారం మరువలేనిది.. నియోజవర్గంలో బీటీ రోడ్లకు, సీసీ రోడ్లకు ఇప్పటికే కోట్ల రూపాయలను మంజూరు చేసి వారు సహకరించడం జరిగిందన్నారు. ఏలేశ్వరం మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.62లక్షలు, ప్రత్తిపాడు మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.33 కోట్లు, శంఖవరం మండలంలో సీసీ రోడ్ల నిర్మాణమునకు రూ.80 లక్షలు, రౌతులపూడి మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 85 లక్షలు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. కొంతంగి కొత్తూరు నుండి అచ్చంపేట మీదుగా గొంది కొత్తపల్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.20 కోట్లు, కత్తిపూడి జాతీయ రహదారి నుండి వజ్రకూటం గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.98 కోట్లు, ఏలేశ్వరం మండలం ఎర్రవరం గ్రామం నుండి తిరుమాలి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి 70 లక్షలు, జాతీయ రహదారి చిన్నింపేట నుండి పెద్దనాపల్లి గ్రామానికి బీటీ రోడ్ నిర్మాణానికి రూ.1.35 కోట్లు, రౌతులపూడి మండలంలో లచ్చిరెడ్డిపాలెం గ్రామం నుండి ఎన్.ఎన్పట్నం వరకు బీటి రోడ్ నిర్మాణానికి రూ.2.60 కోట్లు, రౌతులపూడి, గిడజం రోడ్డు నుండి బీబీ పట్నం మీదుగా లచ్చిరెడ్డిపాలెం వరకు బీటీ రోడ్ నిర్మాణానికి రూ.1.80 కోట్లు, రాజవరం నుండి దిగువశివాడ గ్రామం వరకు బీటీ రోడ్ నిర్మాణానికి కోటి రూపాయలు, రాజవరం, దిగువ శివాడ రోడ్ నుండి గంగవరం వరకు బీటీ రోడ్ నిర్మాణమునకు 60 లక్షల రూపాయలు నిధులను మంజూరు చేయడం జరిగిందని మీడియా మిత్రులకు, నియోజవర్గ ప్రజలకు తెలియజేయడానికి సంతోషిస్తున్నానని వరపుల సత్యప్రభ వ్యాఖ్యానించారు.

# రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేయండి

● కేంద్ర ప్రభుత్వానికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి



దిల్లీ /ఏలూరు : ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి కీలకమైన రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు మంగళవారం అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదిక సమర్పించారు. "భద్రాచలం – కోవ్వూరు బ్రాడ్ గేజ్ లైన్ (సత్తుపల్లి మార్గంగా) నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని. గుడివాడ జంక్షన్ – నూజివీడు – మధిర కొత్త రైల్వే లైన్ (నూజివీడు పట్టణం, విస్సన్నపేట మార్గంగా) నిర్మాణం. నూజివీడు రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధుల విడుదల – ముఖ్యంగా ప్రయాణీకుల నిరీక్షణ గదులు, మండపాలు, మరుగుదొడ్లు, ఎత్తు లిఫ్టులు, కూర్చునే బెంచీలు మరియు 24 గంటల టికెటింగ్ కౌంటర్ ఏర్పాటు. ఏలూరు పట్టణంలో ప్రస్తుతం ఉన్న గేట్లు కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నందున ఎన్.హెచ్-16 పై రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణం. ప్రధాన రైల్వే స్టేషన్లలో కోవిడ్ సమయంలో ఉన్న రైళ్ల హాల్ట్లను పునరుద్ధరించడం, ముఖ్యంగా పల్లేవాడ హాల్ట్, నూజివీడు స్టేషన్లకు మరింత ఎక్కువ స్టాప్లను కేటాయించాలని ఎంపీ మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. అమృత్ భారత్ స్టేషన్ ప్రాజెక్ట్ కింద ఆంధ్రప్రదేశ్లో 73 రైల్వే స్టేషన్లు అభివృద్ధికి ఎంపిక చేసి, వీటి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, అలాగే రైల్వే వ్యవస్థ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, ఏలూరు వ్యవసాయ కేంద్రంగా ఉన్నందున రవాణా సౌకర్యాలు మెరుగుపడితే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో త్వరగా మార్కెట్కు తరలించి గిట్టుబాటు ధర పొందడానికి వీలుందని ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు. నేషనల్ రైల్ ప్లాన్' కింద 2030 నాటికి భారత రైల్వేలను 'భవిష్యత్ సిద్ధంగా' ఉంచే లక్ష్యంతో చేపట్టిన సంస్కరణలు దేశానికి మెరుగైన కనెక్టివిటీని అందించడంతో పాటు ఆర్థిక వృద్ధి, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు అత్యంత కీలకమైన పరిణామం అని, రాష్ట్రంలోని పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు మరింత ఉపకరిస్తుందని, ముఖ్యంగా వాల్తేరు డివిజన్ను కొత్త జోన్లో భాగంగా కొనసాగించాలని తీసుకున్న నిర్ణయం రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చడంలో సహాయపడుతుందని, గత పది సంవత్సరాలుగా ప్రజలు ఎంతగానో ఎదురుచూసిన ఈ డిమాండ్ నెరవేర్చి ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల స్వప్నం సహకారం చేసినందుకు ఎంపీ మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన టీడీపీ నాయకులు



జగ్గంపేట (చైతన్యరథం): నియోజకవర్గం గోకవరం మండలం, తంటికొండ గ్రామంలో సోమవారం సాయంత్రం కురిసిన అకాల వర్షాలకు వరి పంట పొలాలు నేలకు వరిగాయి. భారీ పంట నష్టం జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ వెంటనే స్పందించి ఎమ్మార్వోను, వ్యవసాయ శాఖ అధికారులను, వీఆర్వోను పంట నష్టాలను అంచనా వేసి పంట పొలాలను పరిశీలించాలని ఆదేశించడంతో వారు మంగళవారం నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బదిరెడ్డి అచ్చన్న దొర, బదిరెడ్డి బాబి, నాగం వెంకటపతి, గేడ్డం బాబు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శ్రీకారం



రుడా, ప్రభుత్వ కళాశాల, రాజమండ్రి వారి నిధులతో ఆర్ట్స్ కళాశాల ప్రవేశద్వారం (ఆర్చ్) మరియు భద్రతా గది నిర్మాణం అభివృద్ధి పనులకు జరిగిన శంఖుస్థాపన కార్యక్రమంలో రాజమండ్రి సిటీ శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, రుడా చైర్మన్, రాజనగరం నియోజకవర్గ ఇన్ఛార్జ్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి.

## తాగునీటి సరఫరాలోని లోపాలను సరిదిద్ది... ప్రజలకు సురక్షిత నీరందించండి

- ప్రజల నుంచి తాగునీరు, పారిశుధ్య నిర్వహణపై ఫిర్యాదులు రాకూడదు : ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): వేసవి దృష్ట్యా తాగునీరు సక్రమంగా అందేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని, పైపులైన్ల మధ్యలో ఉండే లీకేజ్‌లను సరిచేసి, నీటివృథాను అరికట్టి, సురక్షిత నీరు ప్రజలకు అందించాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. మంగళవారం ఆయన పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే పైప్ లైన్ వ్యవస్థను, స్థానిక డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి మున్సిపల్ అధికారులకు పలుసూచనలు చేశారు. ఎండలు పెరిగిన నేపథ్యంలో నీటివినియోగం అధికంగా ఉంటుందని, తాగునీరు అందలేదని ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పుల్లారావు స్పష్టం చేశారు. నీటి సరఫరా వ్యవస్థలో ఏవిధమైన సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటి పైపులైన్ల పగుళ్లు, ఇతర లీకేజ్ లను వెంటనే సరిచేయాలని, సురక్షితమైన నీరు ప్రజలకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పుల్లారావు తెలిపారు. మురుగునీరు రోడ్లపైకి రాకుండా డ్రైనేజ్ లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. బ్లీచింగ్, క్లోరినేషన్ ప్రక్రియలు సమయానుగుణంగా జరగాలని, దోమల బెడద లేకుండా ఫాగింగ్ చేయాలని మాజీమంత్రి మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని శారదాహైస్కూల్ పక్కన ఉన్న శ్మశానవాటికను ఆధునికీరించాలని, కంపచెట్లు.. వ్యర్థాలు వీలైనంత త్వరగా తొలగించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పుల్లారావు అధికారుల్ని ఆదేశించారు.

**డంపింగ్ యార్డ్ నిర్వహణలో అజాగ్రత్త, అశ్రద్ధ సహించను..**

చెత్త తీసుకొచ్చి పడేశాము... పని అయిపోయిందని భావించకుండా డంపింగ్ యార్డ్ నిర్వహణలో అజాగ్రత్త, అశ్రద్ధ సహించేది లేదని, చెత్తపేరుకుపోకుండా చూడాలని పుల్లారావు అధికారులకు సూచించారు. పొడిచెత్తను రీ సైకిల్ చేయడం, తడి చెత్తను విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లకు తరలించే ప్రక్రియ సజావుగా జరగాలన్నారు. డంపింగ్ యార్డ్‌లో చెత్తను తగలబెట్టేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సమీపంలోని ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని పుల్లారావు సూచించారు. ముఖ్యంగా ఆకతాయిలు, మందుబాబులు డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల మద్య, ధూమపానం చేయకుండా నిఘా ఉంచాలన్నారు. పనుల పరిశీలనలో ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ రఫాని, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి, మున్సిపల్ డీఈ షేక్ రహీం, పార్టీ సీనియర్ నాయకులు షేక్ కరీముల్లా, పల్నాడు జిల్లా రైతు అధ్యక్షులు వీరారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్ పలువురు నాయకులు, వార్డు నాయకులు విచ్చేశారు.

## సచివాలయ ఉద్యోగులకు గత ప్రభుత్వ వాసనలు ఇంకా పోలేదు : ఎమ్మెల్యే గళ్లా మాధవి



రోడ్లు, డ్రెయిన్లు మరియు వీధి దీపాలు, కుక్కల బెడదతో పాటు గంజాయి బ్యాచ్ నుండి తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నట్లు గుర్తించటం జరిగింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పాటు స్థానిక సచివాలయం సిబ్బందే దీనికి ప్రధాన కారణం. సచివాలయం సిబ్బంది కనీసం విధులకి హాజరు కావటం లేదని, కనీసం కాలువలు కూడా తీయించటం లేదని స్థానిక ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు. శివారు కాలనీలలో మంచినీటి ఎద్దడి ఉన్నదని గుర్తించాను. వీటి పరిష్కారానికి మున్సిపల్ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో అధికారంలోకి వచ్చిన తరువాత ఈ డివిజన్‌లో పర్యటించినప్పుడు ఏ పరిస్థితులు అయితే ఉన్నాయి. ఇప్పుడు కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉండటం దురదృష్టకరమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురైన పంచుమర్తి వీరయ్య చౌదరి లైబ్రరీని వాడుకలోకి తీసుకొనిరావాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రాగా, ప్రజలకు ఉపయోగకరమైన లైబ్రరీ పునరుద్ధరణకు కృషి చేస్తానని తెలిపారు.

గుంటూరు (చైతన్యరథం): కొంతమంది సచివాలయ ఉద్యోగులు గత ప్రభుత్వంలో నిర్లక్ష్యంగా ఉన్నట్లు, ఈ ప్రభుత్వంలో ఉండాలంటే కుదరదని, వైసీపీ ప్రభుత్వ వాసనలు ఇంకా పోలేదని ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గుంటూరు 36వ డివిజన్ భాగ్యనగర్ మరియు సాయినగర్‌లో ఎమ్మెల్యే గళ్లా మాధవి "మీతోనే నేను - మీవెంటే నేను" కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా పర్యటించారు. ప్రజలను నుండి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ... ఈ రోజు 36వ డివిజన్‌లో శివారు కాలనీలు అనేక సమస్యలతో సతమతం అవుతున్నాయి. ఈ కాలనీలో ప్రజలు

## మంగళగిరికి మరో మణిహారం... నంబూరు - మంగళగిరి వద్ద ఆర్ఓబి మంజూరు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ. 1263.79 కోట్లను సేకరించిన పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు / ఢిల్లీ (చైతన్యరథం): "భారతదేశాన్ని గుంటూరు వైపు తలతిప్పి చూసేలా చేస్తా.. దేశంలో నా గుంటూరు పార్లమెంటును నెంబర్ వన్ గా మారుస్తా." అని చెప్పిన పెమ్మసాని మాట అక్షర సత్యంగా నిలుస్తోంది. ఒక్కోనెల ఒక్కో నూతన ఆర్ఓబి తో, రహదారులతో పెమ్మసాని గుంటూరు పార్లమెంటులో నిధుల వర్షం కురిపిస్తున్నారు. 9 నెలల కాలంలో వరుసగా ఐదో ఆర్వోబీని మంజూరు చేయించిన పెమ్మసాని గుంటూరు పాలిట అపర భగీరథునిగా కీర్తి గడిస్తున్నారు. విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపాదనలను కేంద్ర స్థాయిలో పెమ్మసాని పరుగులు పెట్టిస్తున్నారు. ఫలితంగా రైల్వే లెవెల్ క్రాసింగ్ నెంబర్ - 14ను రూ.129.18 కోట్ల నిధులతో నాలుగు వరుసల ఆర్ఓబి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మంగళవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రపంచ స్థాయి రాజధాని రూపుదిద్దుకోనున్న క్రమంలో ఈ ఆర్ఓబి ప్రాధాన్యత సంతరించుకోనుంది.

**కేంద్రం పచ్చ జెండా...**

2024 జూన్‌లో అధికారంలోకి వచ్చింది మొదలు పార్లమెంట్, రాష్ట్ర అభివృద్ధిపై అటు మంత్రి నారా లోకేష్, ఇటు పెమ్మసాని పట్టువదలని విక్రమార్కుల్లా పనిచేస్తున్నారు. కేంద్రం నుంచి సాధ్యమైనంత స్థాయిలో నిధుల సమీకరణ ను చేపడుతూ, అభివృద్ధి కోసం ఎప్పటికప్పుడు ప్రణాళికలు రచిస్తూనే ఉన్నారు. అందులో భాగంగానే నంబూరు మంగళగిరి ఎల్.సి (రైల్వే లెవెల్ క్రాసింగ్) నెంబర్ - 14 వద్ద ఆర్ఓబి మంజూరుకు ఇరువురు నాయకులు సంయుక్తంగా కలిసి కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అధికారులను పరుగులు పెట్టించారు. అలాగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు కూడా తమ సమస్యలను వివరిస్తూ ఆ ఆర్ఓబి కోసం అనేక సార్లు పెమ్మసానికి వివరించారు. దీంతో పెమ్మసాని చేసిన ప్రయత్నానికి గాను స్పందించిన కేంద్ర రైల్వే శాఖ మంగళగిరి - నిడమర్రు గ్రామాల మధ్య సుమారు ఒక కిలోమీటర్ పొడవు నిర్మాణ అంచనాతో, రూ.129.18 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు వరుసల ఆర్ఓబిని మంజూరు చేస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది.

## పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్స్‌ను సందర్శించిన ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ / ఢిల్లీ (చైతన్యరథం): విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంట్‌లో సంగం 1, 2 కోర్ట్ యార్డ్ వద్ద ఏపీ గిరిజన సహకార సంఘం ఏర్పాటు చేసిన అరకు కాఫీ స్టాల్స్‌ను మంగళవారం సందర్శించారు. అరకు కాఫీ తాగటంతో పాటు అరకు బ్రాండ్ కాఫీ ప్యాకెట్‌ను కొనుగోలు చేశారు. అలాగే కాఫీ స్టాల్స్ సిబ్బందితో కాసేపు మాట్లాడి అరకు కాఫీకి దక్కుతున్న ఆదరణ గురించి అడిగి తెలుకున్నారు. అరకు కాఫీ బ్రాండ్‌ను ప్రోత్సహించేందుకు పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటుకు చొరవ చూపించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన స్పీకర్ ఓం బిర్లాకు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ధన్యవాదములు తెలిపారు. పార్లమెంట్ లాంటి ప్రతిష్ఠాత్మక ప్రదేశంలో అరకు కాఫీ అందుబాటులోకి రావడం గిరిజన సమాజానికి లభించిన గొప్ప గౌరవమన్నారు. అరకులోయ గిరిజనులు ఎంతో శ్రమించి ఉత్పత్తి చేసే అరకు కాఫీ రుచి దేశంలో ప్రతి ఒక్కరికీ తెలుస్తున్నందుకు చాలా ఆనందంగా వుందన్నారు.

## మాతా శిశు మరణాల్ని సున్నా శాతానికి చేర్చడమే లక్ష్యం కావాలి: జీవీ

వినుకొండ (చైతన్యరథం): నియోజకవర్గంలో మాతా శిశు మరణాలు సున్నాస్థాయికి చేర్చడమే అందరి లక్ష్యం కావాలన్నారు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు. ఆ దిశగా నియోజకవర్గంలో ఎక్కడా ఒక్కటి కూడా మాతాశిశు మరణాలు నమోదు కావడానికి వీల్లేదని, ఆ మేరకు వైద్యారోగ్యశాఖ సిబ్బంది పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ లక్ష్యం చేరుకునే దిశగా స్థానిక ప్రభుత్వ వైద్యులంతా హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలని, ఆస్పత్రుల విధుల్లో సమయపాలన పాటించాలని, కాన్పులన్నీ ఆస్పత్రుల్లోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా ఇంటి వద్ద ప్రసవం జరిగిందని తెలిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని అధికారులకు స్పష్టం చేశారాయన. వినుకొండ నియోజకవర్గస్థాయి వైద్య ఆరోగ్య శాఖపై మంగళవారం వినుకొండలోని తన కార్యాలయంలో ఈ మేరకు అధికారులతో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అన్నింటిలో యాంటీ ర్యాబిస్ టీకాలు, యాంటీ వీనమ్ ఇంజెక్షన్లు ఉండి తీరాలన్నారు. సీహెచ్‌సీలతో గుండెపోటు సమయంలో ఇచ్చే రూ.40వేల విలువైన ఇంజెక్షన్లు కూడా ఉండాలని దిశానిర్దేశం చేశారు.



## ఆర్ఓబి నిర్మాణంలో అడ్డంకులు ఆదిగమించడానికి చర్యలు



గుడివాడ (చైతన్యరథం): గుడివాడలో ఆర్ఓబి నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని... పూర్తి స్థాయిలో పట్టణంలోని రోడ్ల అభివృద్ధికి సన్నాహాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ పట్టణం రాజేంద్రనగర్‌లోని తన స్వగృహంలో జాతీయ రహదారుల అథారిటీ అధికారులతో... ఆర్ఓబి నిర్మాణ పనులపై ఎమ్మెల్యే రాము సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గుడివాడ పట్టణంలో ప్రధాన రహదారుల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే రాము సమీక్షించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు ఎమ్మెల్యే రాముకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ... గుడివాడ పట్టణంలో జరుగుతున్న రైల్వే గేట్లపై నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. రైల్వే గేట్లపై ప్రాంతంలో... ఆ శాఖ అనుమతులు రాకపోవడంతో నిర్మాణ పనులు ఇప్పటివరకు ప్రారంభం కాలేదన్నారు. రైల్వే శాఖ నుండి సాంకేతిక అనుమతులు వచ్చాయని, ఇతర అనుమతులు మంజూరుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రధానంగా గేట్లపై బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలు పెట్టిన తర్వాత... అత్యధిక రోజులు గేట్లు మూయాల్సి వస్తుందని, గేట్ల మూసి ఉంచే రోజులను తగ్గించడమే కాక, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా చివరి దశకు చేరుకున్న 216 జాతీయ రహదారిని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అండర్ పాస్ నిర్మాణ పనులు కూడా త్వరగతిన జరిగేలా కృషి చేస్తున్నామని... ఆర్ఓబి నిర్మాణం పూర్తి కావడానికి ఉన్న అడ్డంకులను ఒక్కొక్కటిగా అధిగమిస్తూ వేగవంతంగా నిర్మాణ పనులు జరిగేలా అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నట్లు ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.

# పీ4తో సత్ఫలితాలు సాధించాలి

## ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపు

నెల్లూరు, (చైతన్యరథం): నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆదేశాల మేరకు 36వ డివిజన్ ఫతేఖాన్ పేట రైతు బజారు వద్ద సచివాలయం సిబ్బంది స్థానిక టీడీపీ నేతలు వార్డు సభ నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న 'ప్రభుత్వం, దాతలు ప్రజల భాగస్వామ్యం' పీ4 సర్వే గురించి వక్తలు వివరించారు. సమాజంలో ఉన్న 20 శాతం అత్యంత నిరుపేదల అభ్యున్నతికి పీ4 మోడల్ ద్వారా ప్రభుత్వం దాతలు. ప్రజల భాగస్వామ్యంతో సమాజంలోని 10 శాతం సంపద ప్రవాసులు, అధిక సంపన్న వ్యక్తుల సహకారంతో పేదరికం లేని సమాజాన్ని సాధించడానికి కృషి చేద్దాం అని సీఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పిండి శాంతి, కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ నెల్లూరు పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి క్లస్టర్ ఇంచార్జ్ డాక్టర్ ఊరందూరు సురేంద్ర బాబు, డివిజన్ ఇంచార్జి అబ్దుల్ రసూల్, డివిజన్ అధ్యక్షులు పూడి ఆనంద్, నాయకులు అబూబకర్, చల్ల భాస్కర్, మునీర్, మారుతీ, మల్లి ఇతరులు పాల్గొన్నారు.



# రూ.కోట్ల విలువైన క్వార్జ్ దోపిడీ

## మాజీమంత్రి కాకాణిపై కేసు నమోదు



నెల్లూరు, (చైతన్యరథం): మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి పాపాలగుట్ట బద్దలవుతోంది. ఒక్కొక్కటిగా అవినీతి చిట్టా దుమ్ముదులుపుకుంటోంది. తాజాగా క్వార్జ్ దోపిడీ కేసు బయట పడింది. పొదలకూరు మండలం తాటిపర్తిలోని రుస్తుం మైన్స్‌లో లీజు ముగిసినా క్వార్జ్ తరలించి కోట్ల విలువైన ఖనిజం దోపిడీ కేసు సెగలు గక్కుతోంది. సాక్షాత్తు మైనింగ్ అధికారులే ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయ్యింది. రూ.250 కోట్ల విలువైన క్వార్జ్ తరలించారని ఫిర్యాదు సారాంశం. ఈ లీగ ఆధారంగా డొంక కదిలించడానికి రంగం సిద్ధమయింది. ఇందులోభాగంగా కాకాణి సహా ఏడుగురిపై ఎఫ్ఐఆర్ నమోదయింది. ఈ కేసులో ఏ4గా కాకాణి గోవర్ధన్‌రెడ్డి120బీ, 447, 427, 379, 220, 506, 129తో పాటు ఎక్స్‌ప్లోజివ్ సబ్‌స్టెన్స్ యాక్ట్ కింద కేసు నమోదు



# శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

## శాస్త్రోక్తంగా పూజలు

తిరుపతి, (చైతన్యరథం): తిరుమల తిరుపతి దేవస్థానంలో మంగళవారం నిర్వహించిన కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవలో మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడన ఎమ్మెస్ రాజు పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్, అధికారులు పాల్గొన్నారు. ఆలయాన్ని శాస్త్రోక్తంగా శుద్ధి చేశారు. కోయిల్ ఆల్వార్ తిరుమంజనం తర్వాత ఎమ్మెస్ రాజు తన కుమారునితో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం, స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ప్రజా దర్బార్‌తో సమస్యల పరిష్కారం

## రాయచోటి టీడీపీ నేత డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి వెల్లడి

రాయచోటి, (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహించడం జరుగుతుందని రాయచోటి నియోజకవర్గం టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు.

ఈ సందర్భంగా టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్ల జిల్లాలో సమస్యలు ఎక్కువయ్యాయని దీంతో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహించి బాధితులకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. రానున్న రోజులలో రాయచోటి నియోజకవర్గాన్ని సమస్యల రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు.



# మసీదులో ఇఫ్తార్ విందు

## పాల్గొన్న టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి



నెల్లూరు, (చైతన్యరథం): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 29వ డివిజన్ వి.ఎం.ఆర్. నగర్ మసీద్ ఆల్ బషీర్ మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిసి టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాస దీక్షలను నిష్ఠగా ఆచరిస్తోన్న ముస్లిం సోదరులందరికీ కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జిలు సాబీర్ ఖాన్, కనపర్తి గంగాధర్, మైనారిటీ నాయకులు షేక్.షంషుద్దీన్, డాక్టర్ మొహమ్మద్, లారీ మీరా చెంచయ్య, జిలానీ, షేక్ అస్లాం, షాజహాన్, దస్తగిరి, ఖాదర్ భాషా, యాకూబ్, డాక్టర్ యస్దాని, సికిందర్, దావూద్, ఆరిఫ్, రహమతుల్లా, హుస్సేన్, ఉస్మాన్, ముస్తాక్, జమీర్, షాజహాన్, చాణక్యపురి మస్తాన్, మస్జిద్ ఏ, అల్ బషీర్ ముత్తవల్లి, మొహిద్దీన్ భాయ్, టీడీపీ నాయకులు నవీన్, గీత కృష్ణ, నరేంద్ర, శివసాయి ,కుమార్, చిత్తలూరు జయరాం, తదితరులు పాల్గొన్నారు.

# ఉయ్యాల కాలువలో పూడికతీత పనులు

## టీడీపీ నేత ధర్మవరపు సుబ్బారావు వెల్లడి

నెల్లూరు, (చైతన్యరథం): 54వ బూత్ ఇంచార్జ్ షేక్ మహభాష ఉయ్యాల కాలువ పూడికతీత పనులపై రాష్ట్ర మంత్రి పొంగూరునారాయణ్ యాప్ ద్వారా అప్డేట్ చేయగానే తక్షణమే చర్యలు తీసుకుంటున్నారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కలవకుంట భాస్కర్ , 54 బూత్ ఇంచార్జ్ షేక్ మహభాష , 55 బూత్ ముని కుమార్ , 64 బూత్ ఇంచార్జ్ కంచి కృష్ణ , 63 బూత్ కన్వీనర్ నీలకంఠ మునికృష్ణ , యూత్ టీం కంచి కిరణ్ తదితరులు పర్యవేక్షణలో పూడికతీత పనులు చేపట్టారు. గత వైసీపీ పాలనలో డ్రైనేజీలు కాలువలు అస్తవ్యస్తంగా మారిన కనీసం తట్ట మట్టి , చెత్త కూడా తీయలేదు. కుక్కలగుంట ప్రాంతంలో ఇళ్ళ మధ్యన ఉయ్యాల కాలువలో అనేక వ్యర్థాలు , చెత్త పేరుకుపోయి , దోమల బెడద తీవ్రతో బాధపడుతున్న స్థానికుల ఫిర్యాదు మేరకు తక్షణమే చర్యలు తీసుకున్నారు. దుర్గంధంతో ప్రజలు అనేక రోగాల పడుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలతో కలిసి అక్కడున్న ఉయ్యాల కాలువను పరిశీలించి వెంటనే పూడికతీత పనులు చెత్త దగ్గరుండి శానిటేషన్ అధికారి కోకిల, మున్సిపల్ సిబ్బంది సహకారంతో కాలువలో చెత్త పూర్తిగా వెలికి తీశారు.



# దోర్నాలలో పసందుగా ఇఫ్తార్ విందు

## - దువా చేసిన టీడీపీ నేత ఎరిక్సన్ బాబు



దోర్నాల, (చైతన్యరథం): రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా దోర్నాల పట్టణంలోని ఉమర్ మస్జీద్ లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్సన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక దువా చేశారు. రంజాన్ మాసం ముస్లిం సోదరులు కఠిన ఉపవాస దీక్షలతో నిర్వహించే పవిత్రమయిన పండుగని, ప్రతి ఒక్కరికీఅల్లాహ్ శుభాలను అందజేయాలని దు చేశారు.. కార్యక్రమంలో టీడీపీ ముస్లిం నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# గొల్ల నరసింహ ప్రమాణస్వీకారానికి సన్నాహాలు

## - భారీగా తరలిరావాలని పలు సంఘాల నేతల పిలుపు

తిరుపతి, (చైతన్యరథం): యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ ప్రమాణ స్వీకారోత్సవానికి బీసీ కులాలు సన్నాక సమావేశం తెలుగుదేశం పార్లమెంటు ఆఫీసులో మంగళవారం సమావేశం జరిగింది ఈ సమావేశానికి రజక సంఘం, గాండ్ల సంఘం, యాదవ సంఘం, నాయి బ్రాహ్మణ సంఘం, మత్స్యకారుల సంఘం, వడ్డెర సంఘం, వన్నెకుల క్షత్రియ సంఘం, పట్టు శాలి సంఘం, శాలివాహన సంఘం, ఏప్రిల్ రెండో తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 9 గంటలకు తిరపతి పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు, మాజీ తుడా చైర్మన్ తిరుపతి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ఏపీ యాదవ కార్పొరేషన్ గొల్ల నరసింహ యాదవ్ ప్రమాణ స్వీకారోత్సవానికి తిరుపతి నుండి పెద్ద ఎత్తున బీసీ కులాలు ప్రమాణ స్వీకారానికి వెళ్లాలని సమావేశంలో అందరూ నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కరాటే చంద్ర గాండ్ల సాధికార కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యులు జగన్నాథం, శాలివాహన సాధికార కమిటీ పార్లమెంటు అధ్యక్షులు ఆముదాల తులసీదాస్, సాధికార కమిటీ రాష్ట్ర కమిటీ మెంబర్ గాండ్ల జగన్నాథం, యాదవ సాధికార రాష్ట్ర కమిటీ సత్తు మధుసూదన్, యాదవ్ రజక సాధికార కమిటీ పార్లమెంట్ అధ్యక్షులు అశోక్ బెస్త, సాధికార కమిటీ కార్యవర్గ సభ్యులు రాష్ట్ర భక్తాచలం, వడ్డెర సాధికార పార్లమెంటు కమిటీ వడ్డెర అధ్యక్షులు శ్రీరాములు మన్నె కుల క్షత్రియ కొండ రామారావు, పాలేకర్ సంగం వెంకట కృష్ణయ్య రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునుస్వామి యాదవ్, రజక సాధికార కమిటీ శంకర్ బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షులు అక్కినపల్లి లక్ష్మయ్య పట్టుశాలి జ్యోతి కుమారు నాగరాజు నాయి బ్రాహ్మణ సంఘం బాలరాజు తెలుగు యువత అధ్యక్షులు గరిటి చెంచే యాదవ్ వెంకటగిరి నియోజకవర్గ కార్యకర్తలు పాల్గొన్నారు.



జోన్-5
(నంద్యాల, కర్నూలు, హిందూపూరం, అనంతపురం, కడప)
చైతన్యరథం

# టీడీపీలో కష్టపడే వారికి న్యాయం

**- నేతల అభిమానాన్ని మరువలేనన్న టీడీ జనార్దన్, అనంతపురంలో ఘన స్వాగతం**

**- ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశాలతో ఆదరించిన అర్బన్ నాయకులు**

అనంతపురం, (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్ అనంతపురం నగరానికి వచ్చిన నేపథ్యంలో అర్బన్ నియోజకవర్గ టీడీపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశాలతో పెద్ద ఎత్తున నాయకులు తరలి వచ్చి టీడీ జనార్ధన్‌కు స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, ఇతర అర్బన్ నాయకులు జనార్ధన్‌ని కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి అభిమానాన్ని చాటుకున్నారు. పలువురు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితుల గురించి చర్చించారు. గతం కంటే టీడీపీ ఇప్పుడు అర్బన్ చాలా బలంగా ఉందని నాయకులు తెలిపారు. అందరూ ఐకమత్యంగా పార్టీ కోసం పని చేస్తున్నట్టు వివరించారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ అధిష్టానం తగిన న్యాయం చేస్తుందని టీడీ జనార్ధన్ అన్నారు. చూపించిన అభిమానాన్ని మరులేనని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, పరమేశ్వర్, కడియాల కొండన్న, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీ నరసింహ, తెలుగుమహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, ఆర్యవైశ్య నాయకుడు తాటి మధు, టీడీపి నాయకులు నెట్టెం బాలకృష్ణ, ఓంకార్ రెడ్డి, గోపాల్ గౌడ్, మాజీ ఎంపీపీ ఇస్మాయిల్, తెలుగుమహిళా నాయకురాళ్ళు వడ్డే భవానీ, చరిత, ఆయేషా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





## మంత్రి లోకేష్ హామీ మేరకు ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి

అనంతపురం జిల్లా నీలం రాజశేఖర్ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 30వ వార్షికోత్సవ మహాసభలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు టీడీ జనార్దన్, ఏపీఎంఏపీ అనంతపురం జిల్లా గౌరవ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి , టీడీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్ పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి, నాయకులతో పాల్గొని ఆర్ఎంపీ డాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పాదయాత్రలో యువనాయకులడు మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలోని ఆర్ఎంపీ డాక్టర్లకు ప్రభుత్వం తరఫున గుర్తింపు ఇస్తామని ఇచ్చిన హామీని ఖచ్చితంగా నిలబెట్టుకొంటారన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకొని వెళ్లి సమస్య పరిష్కరించే దిశగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఆర్ఎంపీ డాక్టర్లు పేద ప్రజలకు వైద్య సేవలందిస్తూ ప్రాణాలు కాపాడుతున్నారని కొనియాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి సభలు సమావేశాలు నిర్వహించడానికి వీలు లేకుండా ఆంక్షలు విధించేవారన్నారు. ఆరోగ్య వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. నాయకులను గృహ నిర్బంధం చేసి నోటీసులు ఇచ్చే వారన్నారు. అలా కాకుండా కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి సంక్షేమం దిశగా పనిచేస్తుందన్నారు.



## అకాల వర్షానికి దెబ్బతిన్న ప్రతి రైతునూ ఆదుకుంటాం

శింగనమల, (చైతన్యరథం): పుట్లూరు మండలంలోని ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట, మడ్డిపల్లి, కుమ్మనమల, రంగినేపల్లి గ్రామాలలో ఈదురు గాలులకు, అకాల వర్షాలకు దెబ్బతిన్న అరటి, మొక్కజొన్న పంట పొలాలను అధికారులతో కలిసి నియోజవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుల పట్ల, వ్యవసాయ రంగం పట్ల ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే విషయం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు, సంబంధిత అధికారులతో సమీక్ష జరిపి, పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు సహాయం అందించేందుకు నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారని తెలిపారు. రాజకీయాలకు సంబంధం లేకుండా నష్టపోయిన ప్రతి రైతు పేర్లు నమోదు చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అధికారులకు సూచించారు. అధికారులు ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా నష్టపోయిన ప్రతి రైతు పొలాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని కోరారు. ఇదే సందర్భంలో చేతికొచ్చిన పంటలు నేలకొరిగి నష్టం జరగడంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారని, కానీ కొంతమంది రాజకీయాలు చేయడం ఎంతవరకు సమంజసమని విచారం వ్యక్తం చేశారు. రైతులకు అండగా ఉండి భరోసాను నింపి, రైతు సంక్షేమం కోసం పాటుపడేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

### నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలి



పుట్లూరు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల కారణంగా చేతికొచ్చిన పంట అకస్మాత్తుగా నేలకొరిగి రైతులకు చాలా తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి దృష్ట్యా విద్యుత్ అంతరాయం జరగకుండా విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అగ్రికల్చర్, హౌసింగ్ సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ల ద్వారా నీటి సమస్య రానీయకుండా చూడాలన్నారు. అధికారులు ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కొన్ని గ్రామాలలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని అలాగే గ్రామాలలో పారిశుద్ధ్య పనుల మీద శ్రద్ధ వహించాలని తెలిపారు. మహిళా దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ – ఉచిత కుట్టు మిషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా నియోజవర్గానికి 500 కుట్టు మిషన్లు మంజూరు అయినట్లు తెలిపారు. ట్రైనింగ్ తర్వాత కుట్టు మిషన్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అందరూ సమన్వయంతో పనిచేసి ఆగిపోయిన అభివృద్ధిని, ఇంకా చేయాల్సిన అభివృద్ధి సాధిద్దామని పిలుపునిచ్చారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## రాజకీయాలకు అతీతంగా బాధిత రైతులకు సాయం

**ధర్మవరం టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్**

ధర్మవరం, (చైతన్యరథం): శ్రీ సత్యసాయి జిల్లా, ధర్మవరం నియోజకవర్గం, తాడిమర్రి మండలంలోని దాడితోట, నాయనపల్లి, తురకవారిపల్లి గ్రామాలలో, గత రెండురోజుల క్రితం ఈదురు గాలులు, అకాల వర్షాలకు దెబ్బతిన్న అరటి, దానిమ్మ, తమలపాకుల పంట పొలాలను ధర్మవరం టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల పట్ల, వ్యవసాయ రంగం పట్ల ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా పంటలు నష్టపోయిన రైతుల పేర్లు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని పరిటాల శ్రీరామ్ అధికారులను కోరారు.



## కోడుమూరులో హాస్టల్ విద్యార్థులకు పరామర్శ

**బాధితుల గురించి ఆరా తీసిన దరూరు జేమ్స్**

కోడుమూరు, (చైతన్యరథం): కర్నూలు జిల్లా, కోడుమూరు నియోజక వర్గంలోనీ సాంఘీక సంక్షేమశాఖ ఎస్సీ హాస్టల్లో 10వ తరగతి విద్యార్థి 7, 8 తరగతి విద్యార్థులను అకారణంగా కొట్టడంతో ఏర్పడిన వివాదం నేపథ్యంలో కొడుమూరులోని ఎస్సీ హాస్టల్ని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్, కర్నూలు జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దరూరు జేమ్స్ సందర్శించారు. ఇన్చార్జి వార్డెన్‌తో సంఘటనలకు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత విద్యార్థుల ఆరోగ్యం గురించి ఆరా తీశారు.కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ నాయకులు ముడుమాల రాజశేఖర్,టీడీపీ నాయకులు కుమ్మరి వీధికి చెందిన బెస్త వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# ఆపద్బాంధవుడు సీఎం చంద్రబాబు

**కడప ఎమ్మెల్యే, విప్ మాధవి, బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత**

కడప, (చైతన్యరథం): కడప నియోజకవర్గంలో లబ్ధిదారులకు రూ . 16,48,179/- విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సమస్యలు త్వరగతిన పరిష్కరిస్తూ, ప్రజలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధిని పక్కనపెట్టి ప్రజలను అన్ని విధాలుగా పీడించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా బాధిత కుటుంబాలకు, నిరుపేద కుటుంబాలకు డబ్బులను అందజేసి వారికి ఆపదలో అండగా నిలుస్తున్నారన్నారు. అర్హులైన మధ్యతరగతి పేద కుటుంబాలు సీఎంఆర్ఎఫ్ కోసం అప్లై చేసుకోగలరని ఈ సందర్భంగా తెలియజేశారు.




**పేదరిక నిర్మూలనే సీఎం చంద్రబాబు లక్ష్యం**

కడప నగరంలోని 47వ డివిజన్ అక్కాయపల్లి గ్రామంలో ఒకటి రెండు సచివాలయాలు సంయుక్తంగా పీ4 సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా డివిజన్ ప్రజలను ఉద్దేశించి పేదరిక నిర్మూలన స్వర్ణాంధ్ర 2047లో భాగంగా ప్రతి గ్రామంలోనూ ప్రతి పట్టణం, నగరంలోనూ ఉన అల్పాదాయ వర్గాలకు చెందిన పేద ప్రజలను గుర్తించి వారి స్థితిగతులను చూసి వారి దిశా దశ మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి ఆదేశాలు, కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి సూచన మేరకు కార్యక్రమం నిర్వహించారు. 47వ డివిజన్‌లో పరిశుభ్రత, అభివృద్ధి స్వచ్ఛ నగర పేదరిక నిర్మూలన గురించిన విషయాలను డివిజన్ వాసులకు విశదీకరిస్తూ డివిజన్లో పేదరికం నుంచి అపరిశుభ్రత నుంచి అనాగరికత గురించి అభివృద్ధి గురించి ఎలా ముందుకు నడిపించుకోవాలో 47వ డివిజన్ ఇన్చార్జి చెట్టూరు రెడ్డిహుస్సేన డివిజన్ ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో 21వ బూత్ ఇంచార్జ్ వెంకటరామిరెడ్డి 20వ బూత్ ఇంచార్జ్ హరి, జనసేన నాయకులు బాలాజీ గారు పాల్గొన్నారు.



# జమిలి ఎన్నికలపై జేపీసీ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికల బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) గడువును పొడిగించేందుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. జమిలి ఎన్నికల కోసం లోక్ సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం జేపీసీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ కాల పరిమితిని పెంచేందుకు లోక్‌సభ మంగళవారం అంగీకరించింది. ఈ మేరకు బీజేపీ ఎంపీ పీపీ చౌదరి ప్రతిపాదించిన తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. వర్షాకాల సమావేశాల చివరి వారంలో తొలి రోజు వరకు జేపీసీ గడువు పొడిగించింది.

దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నందున సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో ఈ బిల్లును అధ్యయనం చేసేందుకు 39 మంది ఎంపీలతో జేపీసీ కమిటీ ఏర్పాటైంది.

దీనిలో లోక్‌సభ నుంచి 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులు ఉన్నారు. అయితే.. ఈ కమిటీ కాలపరిమితి వచ్చే నెల 4న ముగియనుంది. ఈ బిల్లుపై చేయాల్సిన పని ఇంకా మిగిలివుందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ అంశంపై పలువురు న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిగాయి. ఇప్పటికే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ యుయు లలిత్, జస్టిస్ రంజన్ గొగోయ్, ప్రఖ్యాత న్యాయకోవిదుడు హరీశ్ సాల్వే, ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏపీ షాలు కమిటీ ముందు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేశారు. జేపీసీ గడవు పొడిగించే తీర్మానానికి లోక్‌సభ తాజాగా ఆమోదం తెలిపింది.



# బంగారం కొనుగోలుకు హవాలా డబ్బు

**- నటి రన్యారావు కేసులో డీఆర్ఐ వెల్లడి**



బెంగళూరు: దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తరలిస్తూ అరెస్టయిన కన్నడ నటి రన్యారావు కేసులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. విదేశంలో ఆమె బంగారం కొనుగోలు చేసేందుకు హవాలా డబ్బును వినియోగించినట్లు విచారణలో తేలింది. స్వయంగా రన్యారావు దీన్ని అంగీకరించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) తరపు న్యాయవాది మంగళవారం కోర్టుకు తెలిపారు. బంగారం కొనుగోలు కోసం హవాలా మార్గాల ద్వారా నగదు బదిలీ చేసినట్లు రన్యారావు అంగీకరించారని డీఆర్ఐ తెలిపింది. నటి బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా డీఆర్ఐ తమ విచారణలో తేలిన విషయాలను న్యాయస్థానానికి వివరించింది. కాగా.. రన్యారావు అక్రమంగా బంగారాన్ని తీసుకొస్తూ బెంగళూరు ఎయిర్‌పోర్టులో అధికారులకు చిక్కిన సంగతి తెలిసిందే. ఆమెను మార్చి 3న అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసులో మరో నిందితుడు తరుణ్ రాజ్‌కు ఆమె ఆర్థిక సహాయం చేసినట్లు విచారణలో తేలింది.

ఆమె పంపిన డబ్బుతోనే అతడు దుబాయ్ నుంచి హైదరాబాద్ వెళ్లాడని అధికారులు ఆరోపించారు. బ్యాంకాక్, జెనీవాకు బంగారాన్ని అక్రమంగా రవాణా చేసేవారని పేర్కొన్నారు. హోటల్ వ్యాపారి తరుణ్ రాజ్, రన్యారావు స్నేహితులని.. వీరిద్దరూ 2023లో దుబాయ్‌లో విరా డైమండ్స్ ట్రేడింగ్ ఎల్ఎల్పీ అనే ట్రేడింగ్ కంపెనీని స్థాపించారని తెలిపారు. వ్యాపార భాగస్వాములుగా కొనసాగుతూ దీనిని నిర్వహిస్తున్నారని విచారణలో తేలింది. ఈ స్మగ్లింగ్ కేసులో రోజుకో కొత్త విషయం బయటకొస్తోంది. ఆమె హవాలా మార్గాల్లో నగదు చెల్లించి బంగారం కొనుగోలు చేసినట్లు తాజాగా డీఆర్ఐ అధికారులు ఆరోపించారు.

**పీఎం కిసాన్ అనర్హుల నుంచి**

# రూ.416 కోట్లు రికవరీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో అనర్హుల ఏరివేతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పటి వరకు అనర్హుల నుంచి రూ.416 కోట్లు రికవరీ చేసినట్లు లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన రైతులకు ఏడాదికి రూ.6వేలను మూడు విడతల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. 2019లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 19 విడతల్లో రూ.3.68లక్షల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అయితే, ఈ పథకం ప్రారంభంలో స్వీయ ధ్రువీకరణ ఆధారంగా లబ్ధిదారుల పేర్ల నమోదుకు అనుమతించారు. ఇప్పటికే 100శాతం ఆధార్ సీడింగ్ పూర్తిచేయగా.. ఆధార్, ఆదాయపన్ను శాఖ, ఆర్థిక మంత్రిత్వశాఖల వద్ద ఉన్న సమాచారంతో అనర్హులను ఏరివేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఐటీ చెల్లింపుదారులు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, చట్టబద్ధ పదవుల్లో ఉన్నవారు దీనికింద లబ్ధిపొందితే వారి నుంచి రికవరీ చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం సూచించింది. ఇదిలాఉంటే, ఈ పథకం ద్వారా లబ్ధిపొందే రైతుల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, పీఎం-కిసాన్ అన్‌లైన్ పోర్టల్లో స్వయంగా రిజిస్టర్ చేసుకోవచ్చని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి చౌహాన్ వెల్లడించారు.

# వేరే ప్రాంతానికి తీహార్ జైలు తరలింపు




న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని ఆసియాలోనే అతి పెద్దదైన తీహార్ జైలును మరో చోటుకు మార్చేందుకు ఢిల్లీ ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేఖా గుప్తా శనివారం ఓ ప్రకటన చేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో దీనిని ఏర్పాటు చేసేలా ఓ సర్వే, కన్సల్టెన్సీ సర్వీసుల ఏర్పాటుకు రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. జైలు విస్తీర్ణం, అందులో ఉంచే ఖైదీల కారణంగా దాని చుట్టుపక్కల నివసించేవారి భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ఢిల్లీ సీఎం చెప్పారు. ఈ కారాగారాన్ని 1958లో నిర్మించారు. మొత్తం 9 జైళ్లతో 400 ఎకరాల్లో ఇది విస్తరించి ఉంది. 1966లో దీని నిర్వహణను పంజాబ్ ప్రభుత్వం నుంచి ఢిల్లీకి బదిలీ చేశారు. దేశ రాజధానిలో ఇది ప్రధాన జైలుగా ఉంది. ఢిల్లీలో ప్రస్తుతం 19వేల మంది ఖైదీలు ఉండగా.. తీహార్, మండోలి, రోహిణి.. ఈ మూడు జైళ్లు 10వేల మంది ఖైదీల సామర్థ్యంతో ఉన్నాయి. ఇటీవలే ఖైదీల ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఖైదీలు జైలు లోపల ఫోన్ల వినియోగాన్ని నిరోధించేందుకు ఆరు చోట్ల 15 జామర్లను పెడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

# స్వేచ్ఛకూ హద్దుంటుంది

**- కునాల్ కామ్రా వివాదంపై**

**ఏక్‌నాథ్ షిండే స్పందన**



ముంబయి: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేను ఉద్దేశించి స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ వ్యవహారంపై తొలిసారి షిండే స్పందించారు. కమెడియన్ వేసిన సెటైర్ తనకు అర్థమైందని, అయితే దేనికైనా పరిమితి ఉండాలని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే ఈ వ్యాఖ్యల అనంతరం తన పార్టీ కార్యకర్తలు పాల్పడిన విధ్వంసం కూడా సరికాదని ఖండించారు.



ఇటీవల ముంబయిలోని యూని కాంటినెంటల్ హోటల్లోని హాబిటాట్ కామెడీ స్టూడియోలో కునాల్ కామ్రా హాస్య వినోద కార్యక్రమం నిర్వహించి దానిని రికార్డు చేశారు. ఇందులో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండేను 'గద్దార్' (ద్రోహి) గా అభివర్ణిస్తూ 'దిల్‌తో పాగల్ హై' హిందీ చిత్రంలోని ఒక సినీ గీతానికి పేరడీని కామ్రా ఆలపించడం ఈ వివాదానికి కారణమైంది. ఉప ముఖ్యమంత్రిపై అవమానకర వ్యాఖ్యలు చేశారన్న కారణం చూపుతూ పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ వ్యాఖ్యలకు నిరసనగా హాబిటాట్ స్టూడియోపై దాడి చేసి వేదికను ధ్వంసం చేసిన 40 మంది శివసేన కార్యకర్తల పై పోలీసులు కేసు నమోదు చేశారు..

ఈ పరిణామాలపై మీడియాతో మాట్లాడుతూ షిండే స్పందించారు. ఇలాంటి పనులు చేయడానికి కామ్రా ఎవరి నుంచి సుపారీ తీసుకున్నారు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ ముఖ్యం. కానీ వేరే వారి కోసం ఇతరుల గురించి తప్పుగా మాట్లాడటం సరికాదు. నా గురించి సరే.. ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి, హోం మంత్రి గురించి ఏం మాట్లాడారో చూడండి.. అని గతంలో కామ్రా చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. అలాగే తన పార్టీ కార్యకర్తలు చేసిన విధ్వంసంపై మాట్లాడుతూ.. షిండే అనే వ్యక్తి చాలా సున్నితమైన మనస్తత్వం కలవాడు. నాపై ఎన్నో ఆరోపణలు చేస్తున్నారు. ప్రతి దానికి నా పనే సమాధానం ఇస్తుంది. నేను విధ్వంసాన్ని సమర్థించను. కానీ పార్టీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినడం వల్ల ఇలా జరిగింది. ప్రతి యాక్షన్‌కు రియాక్షన్ ఉంటుంది. అయితే ఇలాంటి ఘటనలకు నేను మద్దతు ఇవ్వబోనని ఆయన స్పష్టం చేశారు. కామ్రా వ్యాఖ్యల వెనక ఏదైనా కుట్ర ఉందా అని అడగ్గా తనదైన శైలిలో బదులిచ్చారు. ప్రజలు వారికి ప్రతిపక్ష స్థానం ఇచ్చారు. కానీ వారు మాత్రం మారడం లేదు. ఇతరుల గురించి మాట్లాడటం.. అవమానించడం ఒక కుట్ర..అని విపక్షాలపై విమర్శలు గుప్పించారు.

ఇదిలాఉంటే.. కామ్రా తన వినోద కార్యక్రమాన్ని షూట్ చేసిన హాబిటాట్ కామెడీ స్టూడియోను బృహన్ ముంబయి పురపాలక సంస్థ కూల్చివేసిన సంగతి తెలిసిందే. తాను కామెడీ చేయడానికి ఉపయోగించిన వేదికను కూల్చడం సరికాదని కామ్రా స్పందించారు. ఈ వివాదం అనంతరం తనకు శివసేన కార్యకర్తల నుంచి 500కు పైగా బెదిరింపు కాల్స్ వచ్చాయని తెలిపారు.

**దిశా శాలియన్ మృతి కేసులో..**

# ఆదిత్య థాక్రేపై పోలీసులకు ఫిర్యాదు

ముంబయి: దివంగత బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా శాలియన్ మృతి కేసులో మహారాష్ట్ర మాజీ మంత్రి, శివసేన (యూబీటీ) నేత ఆదిత్యథాక్రే పై మంగళవారం ముంబయి పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆయనతోపాటు నటులు సూరజ్ పంచోలి, డినోమోరియా, నటి రియా చక్రవర్తి, పోలీసుశాఖ మాజీ ఉన్నతాధికారి పరంబీర్ సింగ్, విధుల నుంచి తొలగింపునకు గురైన ముంబయి పోలీస్ అధికారి. సచిన్ వాజే పేర్లు అందులో ఉన్నాయి. ఈ విషయాన్ని శాలియన్ తరపు న్యాయవాది నీలేశ్ ఓఝూ మీడియాకు వెల్లడించారు. దిశ మృతికేసులో పరంబీర్ సింగ్ ప్రధాన సూత్రధారి అని పేర్కొన్నారు. ఆదిత్య థాక్రేను రక్షించేందుకు ఆయన మీడియా సమావేశం నిర్వహించి అబద్ధాలు అల్లారు. డ్రగ్స్ వ్యాపారాల్లో థాక్రే ప్రమేయం ఉందని ఎన్సీబీ (నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో) దర్యాప్తు పేపర్లను బట్టి వెల్లవుతోందని తెలిపారు. ఫిర్యాదులో అన్ని వివరాలు పొందుపరిచి ఉన్నాయని వెల్లడించారు. తన కుమార్తె మృతి విషయంలో ఆదిత్య థాక్రేపై కేసు నమోదు చేయాలంటూ దిశా శాలియన్ తండ్రి సతీష్ శాలియన్ ఇటీవల ముంబయి హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది.

ఐదేళ్ల క్రితం బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్ పుత్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. నటుడి మరణానికి వారం రోజుల ముందు అతడి మాజీ మేనేజర్ దిశా శాలియన్ అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించారు. 2020 జూన్ 8న ముంబయిలోని ఓ భవనంపై నుంచి దూకి ఆమె ఆత్మహత్య చేసుకున్నారు. దిశా చనిపోయిన రోజుల వ్యవధిలోనే నటుడు సుశాంత్ తన అపార్ట్‌మెంట్లో శవమై కనిపించారు. ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. ఆ సమయంలో అధికారంలో ఉన్న ఉద్ధవ్ థాక్రే ప్రభుత్వం ఈ కేసును కప్పిపుచ్చేందుకు యత్నించిందనే ఆరోపణలు వచ్చాయి. హత్య, అత్యాచారంతో పాటు సుశాంత్ మృతితోనూ ముడిపెడుతూ ప్రచారం సాగింది. నాడు తన కుమార్తె మృతికి సంబంధించి సతీష్ శాలియన్ ఎవరిపైనా అనుమానాలు వ్యక్తం చేయలేదు. కానీ.. 2020, జూన్ 8న తన కుమార్తె ఇంట్లో పార్టీ ఏర్పాటు చేసిందని.. దానికి ఆదిత్య థాక్రేతో పాటు అతని బాడీగార్డులు, నటులు సూరజ్ పంచోలి, డినో మోరియా, మరికొందరు హాజరయ్యారని ఇటీవల కోర్టులో వేసిన పిటిషన్లో సతీష్ శాలియన్ పేర్కొన్నారు. ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్టు తమవద్ద సాక్ష్యాలున్నాయని ఆ సమయంలోనే లాయర్ చేసిన వ్యాఖ్యలు మహారాష్ట్ర రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.

# సోషల్ మీడియా ఖాతాలివ్వండి

## - గ్రీన్‌కార్డుదారుల్లో గుబులు రేపుతున్న ట్రంప్ ప్రతిపాదన

అమెరికాలో అక్రమ వలసదారుల ఏరివేత లక్ష్యంగా డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ దిశగా సోషల్ మీడియా ఖాతాలపై దృష్టిపెట్టిన ట్రంప్ ప్రభుత్వం.. ఆ పరిధిని మరింత విస్తరించాలని ప్రతిపాదించింది. దానికింద అమెరికాలో నివసిస్తోన్న గ్రీన్‌కార్డుదారులంతా తమ సోషల్ మీడియా ఖాతాల వివరాలను అప్పగించాల్సి రావొచ్చని తెలుస్తోంది. ఇప్పటికే వీసా దరఖాస్తుదారులు యూఎస్ సిటిజెన్ షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్‌కు తమ ఖాతాల వివరాలను వెల్లడించాల్సి ఉంది. కొత్త ప్రతిపాదన అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తోన్న, శాశ్వత నివాసం, ఆశ్రయం కోరుతున్న వారికీ వర్తిస్తుంది. ఈ ప్రక్రియ మెరుగైన గుర్తింపు ధ్రువీకరణను సాధ్యం చేస్తుందని, దేశ భద్రతకు సంబంధించిన ముప్పును నివారించేందుకు దోహదం చేస్తుందని అమెరికా ప్రభుత్వం గత నోటీసుల్లో పేర్కొంది.

గ్రీన్‌కార్డు పొందినంత మాత్రాన వారికి అమెరికాలో ఎల్లకాలం ఉండిపోయే హక్కు లేదు అంటూ అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు లక్షలమంది వలసదారుల్లో, ముఖ్యంగా భారత సంతతి వారిలో గుబులు రేపుతోంది. దీనికి అనుగుణంగానే గత కొన్ని వారాలుగా అమెరికా తమ వలస చట్టాలను కఠినతరం చేయడం వలసదారుల్లో ఆందోళనను పెంచుతోంది. ఇక తాజా ప్రతిపాదన కింద..



అమెరికా విధానాలు విమర్శించేవారు ఆ దేశాన్ని తమ నివాసంగా మార్చుకోకుండా నిరోధించే వీలు కలుగుతుంది. అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తూ, యూఎస్-భారత్ సంబంధాల్లో చురుకైన పాత్ర పోషిస్తోన్న పలువురు భారత సంతతి వ్యక్తులపై ఈ ప్రతిపాదనలు ప్రభావం చూపేలా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే రాజకీయ అంశాలపై స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేసే పరిస్థితి లేకుండా పోతుందనే విమర్శలూ వినిపిస్తున్నాయి.

ఇటీవల యూఎస్ ఇమిగ్రేషన్ అటార్నీ అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేశారు. హెచ్-1బీ, ఎఫ్-1, గ్రీన్‌కార్డు కలిగిన భారతీయులు ప్రయాణాల్లో అప్రమత్తత పాటించాలని సూచించారు. వీరు అమెరికాలో ప్రవేశించే, నిష్క్రమించే సమయంలో తనిఖీలు మరింత ఎక్కువగా ఉంటాయని, సహనంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 43 దేశాలకు చెందిన పౌరులు అమెరికాలోకి రాకుండా నిషేధం విధించాలని ట్రంప్ సర్కారు ప్రణాళికలు సిద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్ ఈ ఆంక్షల జాబితాలో లేనప్పటికీ.. అమెరికా వెలుపల ప్రయాణాలు చేయాలనుకునే భారతీయులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

జనవరి 20న ట్రంప్ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయగానే.. అమెరికా ప్రజల రక్షణకు సంబంధించిన పలు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశారు. "గత నాలుగేళ్లలో అమెరికాలో అక్రమ వలసదారులు పోటెత్తారు. లక్షల మంది సరైన పత్రాలు లేకుండానే మన సరిహద్దులు దాటి దేశంలోకి వచ్చారు. ఆ తర్వాత ఇక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ దేశ భద్రత, ప్రజల రక్షణకు ముప్పుగా మారుతున్నారు. అందుకే అక్రమ వలసదారుల కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం" అని ట్రంప్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## యూకే వీసా ఛార్జిలు మరింత ప్రియం




పర్యాటకులతోపాటు ఉన్నత చదువుల కోసం బ్రిటన్‌కు వెళ్లే విద్యార్థులపై మరింత ఆర్థిక భారం పడనుంది. స్టూడెంట్, విజిటర్ సహా అన్ని కేటగిరీల వీసా ఫీజులను పెంచుతున్నట్టు యూకే ప్రభుత్వం వెల్లడించింది. ఈ కొత్త ఛార్జీలు 2025 ఏప్రిల్ 9 నుంచి అమల్లోకి రానున్నట్లు ప్రకటించింది.

***విద్యార్థి వీసాలపై భారం..***

భారతీయులు బ్రిటన్‌లో అడుగుపెట్టాలంటే వీసా తప్పనిసరి. ప్రస్తుతం ఈ వీసా (ఆరు నెలల గడువు) ఫీజు 115 పౌండ్లు ఉండగా.. పది శాతం పెరిగి 127 పౌండ్లకు చేరుకుంది. అదే రెండేళ్ల కాలపరిమితి వీసా రుసుము కూడా పెరిగింది. విద్యార్థి వీసాలపైనా ఈ పెరుగుదల ప్రభావం కనిపించనుంది. ప్రధాన దరఖాస్తుదారు సహా వారి డిపెండెంట్లు ప్రస్తుతం 490 పౌండ్లు చెల్లించాల్సి ఉండగా.. త్వరలో అది 524 పౌండ్లకు చేరనుంది. చైల్డ్ స్టూడెంట్లకూ ఇదే పెంపు వర్తిస్తుంది. ఆరు నెలల నుంచి 11 నెలల స్వల్ప కాలపరిమితి ఇంగ్లిష్ కోర్సు చదివే విద్యార్థుల ఫీజు కూడా 14 పౌండ్లు పెరగనుంది.

## యూనస్‌పై.. తిరుగుబాటు!?



ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా అనంతరం బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం నెలకొన్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చెలరేగే అవకాశం కనిపిస్తోంది. దీంతో అక్కడి ఆర్మీ వర్గాలు అత్యవసర సమావేశం నిర్వహించినట్టు సమాచారం. ఈమేరకు పలు మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. బంగ్లా ఆర్మీ చీఫ్ జనరల్ వకార్- ఉజ్- జమాన్ నేతృత్వంలో ఈ అత్యవసర సమావేశం జరిగింది. ఇందులో ఐదుగురు లెఫ్టినెంట్ జనరల్స్, ఎనిమిది మంది మేజర్ జనరల్స్‌తో సహా ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు. యూనస్ బాధ్యతలు చేపట్టినప్పటినుంచి బంగ్లా ప్రజల్లో అశాంతి, అపనమ్మకం పెరిగిందని ఆర్మీ వర్గాలు తెలిపాయి. దీంతో దేశంలో రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని వెల్లడించాయి. ఈక్రమంలో దేశంలో స్థిరత్వాన్ని పునరుద్ధరించడంలో ఆర్మీ పాత్ర ఎక్కువగా ఉంటుందనే దానిపై అధికారులు చర్చించారు. ఈ సమావేశంలో దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించాలని యూనస్‌పై ఒత్తిడి తీసుకురావాలని ఆర్మీ అధికారులు నిర్ణయించారు. అంతేకాక.. సైన్యం పర్యవేక్షణలోనే జాతీయ ఐక్యత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలని యోచిస్తుంది.

ఇటీవల బంగ్లాలో సైన్యానికి వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు, విద్యార్థి నాయకులు స్వరం వినిపించారు. ఈ క్రమంలోనే యూనస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు జరగనున్నట్టు సమాచారం అందింది. దీంతో దేశంలోని సైన్యం అలెర్టయ్యింది. ఢాకా అంతటా కట్టుదిట్టమైన గస్తీని ఏర్పాటు చేయడంతోపాటు పలు ప్రాంతాలలో చెక్‌పోస్టులు పెట్టింది. ఇక, హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ తిరిగి పుంజుకునేలా చేసేందుకు సైన్యం ఒక ప్రణాళికను రూపొందిస్తుందని విద్యార్థి పార్టీలు ఆరోపించాయి. అయితే, వీటిని సైన్యం ఖండించింది.

యూనస్ చైనా పర్యటన..

ఈ రాజకీయ గందరగోళం నేపథ్యంలో యూనస్ త్వరలోనే చైనాలో పర్యటించనున్నారు. చైనా- బంగ్లాల మధ్య సంబంధాల్లో మార్పునకు ఈ పర్యటన దోహదపడుతుందని ఢాకా అధికారులు భావిస్తున్నారు.

రిజర్వేషన్ల వ్యతిరేక నిరసనల్లో పెద్దఎత్తున హింస చెలరేగిన నేపథ్యంలో గతేడాది ఆగస్టులో హసీనా దేశం విడిచి పారిపోయిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి భారత్‌లో ఆమె తలదాచుకుంటున్నారు. ప్రస్తుతం మహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా వ్యవహరిస్తున్నారు.

## ఆ భూభాగం మాదే..

### ఎప్పటికైనా ఖాళీ చేయక తప్పదు

**- అసత్య ప్రచారాలు ఇకనైనా ఆపండి**
**- పాక్‌కు భారత్ స్ట్రాంగ్ వార్నింగ్**



అంతర్జాతీయ వేదికపై భారత్‌ను నిందించాలని ప్రయత్నించిన పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. జమ్మూకశ్మీర్‌పై అనవసర ప్రస్తావన తీసుకొచ్చిన దాయాదికి న్యూఢిల్లీ గట్టిగా చురకలంటించింది. ఆ ప్రాంతం ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టంచేసింది. పాక్ చట్టవిరుద్ధంగా ఆక్రమించిన కశ్మీర్ భూభాగాలను ఖాళీ చేయాల్సిందేనని తేల్చి చెప్పింది. ఐక్యరాజ్యసమితిలో శాంతి పరిరక్షణ సంస్కరణలపై చర్చ సందర్భంగా పాక్ ప్రతినిధి సయ్యద్ తారిఖ్ ఫతేమీ మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. పాక్ ఆరోపణలపై ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆ దేశం అనవసర అంశాలను లాగుతోందని మండిపడ్డారు. "భారత కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌పై పాకిస్థాన్ ప్రతినిధి మరోసారి అనవసర వ్యాఖ్యలు చేశారు. ఇలా పదేపదే ఈ అంశాన్ని లేవనెత్తడం వల్ల వారు చేసే చట్టవిరుద్ధ వాదనలు నిజమైపోవు. ఇలాంటి ప్రయత్నాలతో వారు ప్రోత్సహిస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని సమర్థించుకోలేరు. జమ్మూకశ్మీర్ ఇప్పటికీ, ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే. ఈ ప్రాంతంలోని కొంత భూభాగం ఇప్పటికీ పాక్ ఆక్రమణలోనే ఉంది. దాన్ని ఖాళీ చేయాల్సిందే. సంకుచిత, విభజన అజెండాతో ఈ వేదిక దృష్టిని మళ్లించే కుతంత్రాలు చేయడం మానుకుంటే మంచిది" అని పర్వతనేని హరీశ్ దాయాదికి హితవు పలికారు. గతవారం ఐరాస మానవ హక్కుల సంఘం సమావేశంలోనూ పాక్ జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించింది. దీనికి భారత్ కూడా దీటుగా బదులిచ్చింది. పాక్ పదే పదే అసత్య ప్రచారాలు చేస్తోందని దుయ్యబట్టింది.

# మళ్లీ.. కెనడా కూతలు!

***ఆ దేశ ఎన్నికల్లో భారత్ జోక్యమంటూ వ్యాఖ్యలు***



భారత్- కెనడాల మధ్య దౌత్య వివాదం కొనసాగుతున్న వేళ ఒట్టావా మరోసారి న్యూఢిల్లీపై నోరు పారేసుకుంది. కెనడాలో త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో భారత్, చైనా జోసుకునే అవకాశం ఉందని ఆ దేశ స్పై ఏజెన్సీ ఆరోపించింది. రష్యా, పాకిస్థాన్ కూడా ఆ ప్రయత్నం చేయొచ్చని అనుమానాలు వ్యక్తంచేసింది. కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ వానెస్సా లాయిడ్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "త్వరలో మా దేశంలో జరగబోయే ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు శత్రు దేశ నాయకులు కృత్రిమ మేధ సాధనాలను ఎక్కువగా ఉపయోగించుకుంటున్నట్లు మాకు సమాచారం ఉంది. చైనా ప్రభుత్వం ఈ ప్రయత్నాలు చేసేందుకు అధిక అవకాశాలు ఉన్నాయి. భారత ప్రభుత్వానికి కూడా ఆ సామర్థ్యం, ఉద్దేశం ఉంది" అని లాయిడ్ ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలపై ఒట్టావాలోని చైనీస్, భారత దౌత్య కార్యాలయాలు ఇంకా స్పందించలేదు. కాగా.. గతంలో కెనడా ఇలాంటి ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. కెనడా ఎన్నికల్లో విదేశీ ప్రభుత్వాల జోక్యం అంటూ వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు నిమిత్తం ఆ దేశ ప్రభుత్వం ఓ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ ఇచ్చిన నివేదికలో న్యూఢిల్లీపై తీవ్ర ఆరోపణలు చేసింది. "ఫెడరల్ ఎన్నికల్లో పోటీ చేసిన మూడు రాజకీయ పార్టీల నాయకులకు భారత ప్రభుత్వం ప్రాక్సీ ఏజెంట్ల ద్వారా రహస్యంగా ఆర్థికసాయం అందించినట్లు తెలుస్తోంది" అని కెనడియన్ కమిషన్ పేర్కొంది. దీన్ని భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. వాస్తవానికి భారత అంతర్గత వ్యవహారాల్లో కెనడానే జోక్యం చేసుకుంటోందని, దీనివల్ల మన దేశంలో అక్రమ వలసలు, వ్యవస్థీకృత నేర కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయని మండిపడింది.

2023 జూన్‌లో ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ కెనడాలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యలో భారత ఏజెంట్ల పాత్ర ఉందంటూ ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. వాటిని న్యూఢిల్లీ తీవ్రంగా ఖండించింది. దీనిపై ఇరుదేశాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతుండగానే.. కెనడా పదేపదే న్యూఢిల్లీపై ఆరోపణలు చేస్తూనే ఉంది. ఇదిలాఉండగా.. కెనడా నూతన ప్రధానిగా ఇటీవల ప్రమాణస్వీకారం చేసిన మార్క్ కార్నీ ముందస్తు ఎన్నికలకు సిద్ధమయ్యారు. ఏప్రిల్ 28న అక్కడ సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి.

### మలుపు తిప్పిన విజయ్ కుమార్..

# ఓడిపోయే మ్యాచ్‌లో గెలిచిన పంజాబ్!

### - 11 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై విజయం



ఐపీఎల్ 2025 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ శుభారంభం చేసింది. గుజరాత్ టైటాన్స్‌తో అహ్మదాబాద్ వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన పంజాబ్ కింగ్స్ 11 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇంపాక్ట్ ప్లేయర్ విజయ్‌కుమార్ వైశాఖ్, అర్ష్‌దీప్ సింగ్ అద్భుత బౌలింగ్‌తో పంజాబ్ కింగ్స్ విజయంలో కీలక పాత్ర పోషించారు.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 243 పరుగుల భారీ స్కోర్ చేసింది. శ్రేయస్ అయ్యర్(42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్స్‌లతో 97 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగగా.. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(23 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 47), శశాంక్ సింగ్(16 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 44 నాటౌట్) మెరుపులు మెరిపించారు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో సాయి కిషోర్(3/30) మూడు వికెట్లు తీయగా.. కగిసో రబడా, రషీద్ ఖాన్ చెరో వికెట్ తీసారు.

అనంతరం లక్ష్యచేధనకు దిగిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 232 పరుగులు చేసి ఓటమిపాలైంది. సాయి సుదర్శన్(41 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 74), జోస్ బట్లర్(33 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 54) హాఫ్ సెంచరీలతో రాణించగా.. షెర్ఫెన్ రూథర్‌పోర్డ్(28 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 46) కీలక ఇన్నింగ్స్ ఆడారు. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ రెండు వికెట్లు తీయగా.. మార్కో జాన్సెన్, గ్లేన్ మ్యాక్స్‌వెల్ తలో వికెట్ తీసారు.

**అదిరిపోయే ఆరంభం..**

భారీ లక్ష్యచేధనలో గుజరాత్ టైటాన్స్‌కు అదిరిపోయే ఆరంభం దక్కింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ దూకుడుగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించిన అనంతరం శుభ్‌మన్ గిల్(33)ను మ్యాక్స్‌వెల్ పెవిలియన్ చేర్చాడు. జోస్ బట్లర్‌తో కలిసి సాయి సుదర్శన్ చెలరేగాడు. బౌండరీల మోత మోగించాడు. ఈ క్రమంలో అతను 31 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం మరింత దూకుడుగా ఆడిన అతను భారీ సిక్సర్లతో పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మరోవైపు జోస్ బట్లర్ సైతం అదే జోరు కనబర్చడంతో గుజరాత్ స్కోర్ బోర్డు పరుగెత్తింది.

**మలుపు తిప్పిన విజయ్ కుమార్..**

అయితే సెంచరీ దిశగా సాగుతున్న సాయి సుదర్శన్‌ను అర్ష్‌దీప్ సింగ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చి 84 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన షెర్ఫెన్ రూథర్‌ఫోర్డ్ సాయంతో జోస్ బట్లర్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. 31 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న అతన్ని మార్కో జాన్సెన్ క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 54 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

పంజాబ్ కింగ్స్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగిన విజయ్ కుమార్ వైశాఖ్ మిడిల్ ఓవర్లలో కట్టడిగా బౌలింగ్ చేశాడు. వైడ్ యార్కర్లతో తెలివిగా బౌలింగ్ చేసిన అతను తన తొలి రెండు ఓవర్లలో ఐదేసి పరుగులు మాత్రమే ఇచ్చాడు. అతని కట్టడైన బౌలింగ్ పంజాబ్ కింగ్స్ విజయవకాశాలను మెరుగుపరిచింది. మూడో ఓవర్‌లో 18 పరుగులివ్వడంతో ఆఖరి ఓవర్‌లో గుజరాత్ విజయానికి 27 పరుగులు అవసరమయ్యాయి. దురదృష్టవశాత్తు తొలి బంతికి తెవాటియా రనౌటవ్వగా.. రెండో బంతిని రూథర్‌పోర్డ్ సిక్సర్‌తో ఆశలు రేకెత్తించాడు. కానీ అతన్ని అర్ష్‌దీప్ సింగ్ క్లీన్ బౌల్డ్ చేసి విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ఆఖరి బంతికి షారూఖ్ ఖాన్ భారీ సిక్సర్ బాదినా.. ఫలితం లేకపోయింది.

# ప్రియాన్ష్ ఆర్య.. అరంగేట్రంలోనే అదరగొట్టాడు!

### *- ఒకే ఓవర్‌లో 6 సిక్స్‌లు..*



ఐపీఎల్ 2025 సీజన్‌లో రోజుకో స్టార్ ఉద్భవిస్తున్నాడు. మొన్న విఘ్నేష్ పుతుర్.. నిన్న విప్రజ్ నిగమ్.. నేడు ప్రియాన్ష్ ఆర్య సంచలన ప్రదర్శనతో టాక్ ఆఫ్ ది నేషన్‌గా నిలిచారు. గుజరాత్ టైటాన్స్‌తో అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున ఐపీఎల్‌లోకి అరంగేట్రం చేసిన ప్రియాన్ష్ ఆర్య.. తొలి మ్యాచ్‌లోనే దుమ్మురేపాడు.

ఓపెనర్‌గా బరిలోకి దిగి విధ్వంసకర బ్యాటింగ్‌తో పంజాబ్ కింగ్స్‌కు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. దూకుడుగా ఆడే క్రమంలో అతను తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. 23 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 47 పరుగులు చేసి రబడా బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. అతను కొట్టి రెండు సిక్స్‌లు ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచాయి. అరంగేట్ర మ్యాచ్‌లోనే ఏ మాత్రం భయం లేకుండా భారీ షాట్లతో విరుచుకుపడిన ప్రియాన్ష్ ఆర్యను చూసి అభిమానులు, నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. అతను ఎవరా? అని ఆరా తీస్తున్నారు.

***ఎవరీ ప్రియాన్ష్ ఆర్య?***

ఢిల్లీకి చెందిన 26 ఏళ్ల ప్రియాన్ష్ ఆర్య.. తల్లిదండ్రులు వృత్తి రీత్యా టీచర్లు. ప్రియాన్ష్ ఆర్య సరదాగా స్నేహితులతో కలిసి గల్లీ క్రికెట్ ఆడేవాడు. ఆటపై ఉన్న మక్కువను గమనించిన అతని తండ్రి సంజయ్ భరద్వాజ్ కోచింగ్ అకాడమీలో చేర్పించాడు. అక్కడే బ్యాటింగ్ నేర్చుకున్న ప్రియాన్ష్ ఆర్య.. గంభీర్ పర్యవేక్షణలో మరింత రాటు దేలాడు. అతని ఆటకు ఫిదా అయిన గంభీర్.. ప్రియాన్ష్ ఆర్యకు క్రికెట్ కిట్ కూడా గిఫ్ట్‌గా ఇచ్చాడు.

ఢిల్లీ తరఫున ఏజ్ క్రికెట్ ఆడిన ప్రియాన్ష్.. 2021లో దేశవాళీ టీ20ల్లోకి అరంగేట్రం చేశాడు. 2023లో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తమిళనాడు స్పిన్నర్లు, కర్ణాటక పేసర్లను చితక్కొట్టి అందరి దృష్టిని ఆకర్షించాడు. మరుసటి ఏడాది జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 176.63 స్ట్రైక్‌రేట్‌తో 325 పరుగులు చేశాడు. 43 బంతుల్లోనే 102 పరుగులు చేసి టాక్ ఆఫ్ ది నేషన్‌గా నిలిచాడు.

**ఒకే ఓవర్‌లో 6 సిక్స్‌లు..**

ఆ తర్వాత ఢిల్లీ ప్రీమియర్ లీగ్ 2024లో ఒకే ఓవర్‌లో ఆరు సిక్స్‌లు బాది దేశంలోని క్రికెట్ అభిమానులను తనవైపు తిప్పుకున్నాడు. ఈ టోర్నీలో సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్స్‌కు ఆడిన ప్రియాన్ష్.. 608 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. ఓ మ్యాచ్‌లో ఆయుష్ బదోనితో కలిసి 286 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.

## ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర.. కట్ చేస్తే..

### మొదటి మ్యాచ్‌లోనే దారుణమైన ట్రోల్స్



క్రికెట్ ప్రపంచంలో మంచి ఎంత మంచి ఫామ్ కొనసాగించినప్పటికీ.. ఒక్క మ్యాచుల్లో పేలవమైన దారుణంగా ట్రోల్స్ చేస్తారు. ముఖ్యంగా ఐపీఎల్ వచ్చిందంటే చాలు ఈ ట్రోలింగ్స్ మరింత పెరుగుతాయి.ఎవరైన ఆటగాల్లు అసాధారణమైన ఆటను కనబరిస్తే.. ఆకాశానికి ఎత్తేస్తారు. మరుసటి రోజు ఆశించిన స్థాయిలో ఆడకపోతే సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్స్ చేస్తారు. తాజాగా అలాంటి ట్రోల్స్ ను రిషబ్ పంత్ ఎదుర్కొంటున్నాడు. భారత క్రికెట్ జట్టులో కీలకమైన ప్లేయర్ గా ఉన్న పంత్ ను ఐపీఎల్ మెగా వేలంలో ఢిల్లీ జట్టు వదులుకోగా.. లక్నో జట్టు 27 కోట్లకు కొనుగోలు చేసింది. ఐపీఎల్ చరిత్రలోనే రిషబ్ పంత్ అత్యధిక ధరకు అమ్ముడుపోయిన ప్లేయర్ గా నిలిచాడు. భారీ ధరకు అమ్ముడుపోయిన పంత్ పై లక్నో జట్టుతో పాటు అభిమానులు భారీ అంచనాలను పెట్టుకున్నారు.

ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఢిల్లీతో జరిగిన మ్యాచులో అతని ఫామ్‌తో పాటు కెప్టెన్సీ ఫెయిల్ కావడంతో పంత్ తో పాటు లక్నో జట్టును టార్గెట్‌గా చేసుకుని ట్రోల్స్ చేస్తున్నారు. గత సీజన్లో ఓ మ్యాచ్ ఓటమి తర్వాత కేఎల్ రాహుల్‌పై ఆ జట్టు యజమాని గ్రౌండ్ లోనే తిట్టడం తెలిసిందే. తాజా ఆ సంఘటనను గుర్తు చేస్తూ.. రాహుల్‌ను కాదని.. 27 కోట్లకు పంత్‌ను కొన్నారు.. ఏమీ లాభం మీ ప్రవర్తన మాత్రం మారలేదని పోస్టులు చేస్తున్నారు. అలాగే ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర పలికిన పంత్.. మొదటి మ్యాచ్‌లో 0 పరుగులకు అవుట్ కావడంతో.. చివరి ఓవర్‌లో మ్యాచ్ విన్నింగ్ స్టంప్‌ను మిస్ చేసినందుకు అతనిపై ట్రోల్స్ చేస్తున్నారు. రూ. 27 కోట్లకు అమ్ముడు పోయిన పంత్.. ఇప్పటికి ఢిల్లీకి ఫేవర్ గా మ్యాచ్ ఆడుతున్నాడని కామెంట్లు చేస్తున్నారు.

# ఐపీఎల్ 2025లో ఫైనల్‌కు చేరే జట్లు ఇవే

### *- శిఖర్ ధావన్*

ప్రపంచంలోనే అత్యంత కఠినమైన లీగ్ అయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ భారత్‌లో జరుగుతోంది. ఐపీఎల్ 2025లో భాగంగా ప్రతిరోజూ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఐపీఎల్‌లో ఫైనల్‌కు చేరుకోగల రెండు జట్లను శిఖర్ ధావన్ అంచనా వేశాడు. స్టార్ స్పోర్ట్స్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ వీడియోను షేర్ చేసింది. ఆ వీడియోలో ఐపీఎల్ 2025లో రెండు ఫైనలిస్ట్ జట్ల పేర్లను శిఖర్ ధావన్ అంచనా వేశాడు. ఈ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్ జట్లు ఫైనలిస్టులుగా బరిలోకి దిగుతాయని శిఖర్ ధావన్ చెప్పుకొచ్చాడు.

భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ అంచనా సరైనదో కాదో కాలమే చెబుతుంది. కానీ ప్రస్తుతానికి కోల్‌కతా నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్ ఐపీఎల్ 18వ సీజన్‌లో తొలి మ్యాచ్‌లోనే పరాజయం పాలవ్వడం గమనార్హం. అయినా ఈ రెండు జట్లు ఫైనల్‌కు చేరతాయని ధావన్ చెప్పాడు.

డిఫెండింగ్ ఛాంపియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు బలమైన జట్టుగా కనిపించినప్పటికీ.. సీజన్ ప్రారంభ




మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు చేతిలో 7 వికెట్ల తేడాతో ఓడిపోయింది. మరోవైపు ముంబై ఇండియన్స్ తమ తొలి మ్యాచ్‌ను చెన్నై సూపర్ కింగ్స్‌తో చెన్నైలోని చెపాక్ స్టేడియంలో ఆడింది. అక్కడ ముంబై ఇండియన్స్ జట్టు 4 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ పరిస్థితిలో ఈ రెండు బలమైన జట్లు ప్రస్తుత ఐపీఎల్ సీజన్ లో ఎలా ఫైనల్‌కి చేరుతాయనే విషయం చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

చైతన్య రథం
సినిమా
బుధవారం 26 మార్చి 2025


## 'రాబిన్‌హుడ్'
# టికెట్ ధరల పెంపు
**- ఎంపిక చేసిన థియేటర్లలో మాత్రమే**

నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ కామెడీ చిత్రం 'రాబిన్ హుడ్. శ్రీలీల కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన చిత్రమిది. సెన్సార్ పూర్తి చేసుకున్న మూవీ మార్చి 28న విడుదలవుతోంది. ఈక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టికెట్ ధరల పెంపునకు అనుమతిచ్చింది. అయితే, సామాజిక మాధ్యమాల వేదికగా విమర్శలు వస్తుండటంతో చిత్ర నిర్మాణ సంస్థ వివరణ ఇచ్చింది. ఎంపిక చేసిన థియేటర్లలో మాత్రమే టికెట్ ధరల పెంపు వర్తిస్తుందని పేర్కొంది. సింగిల్ స్క్రీన్లలో రూ.50 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌లో రూ.75 (జీఎస్టీతో కలిపి) పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, విడుదలైన రోజునుంచి వారంపాటు పెంచిన టికెట్ ధరలు అమల్లో ఉంటాయని పేర్కొంది. "శారీరక బలం కంటే మానసిక బలం గొప్పదని నమ్మే యువకుడే మా రాబిన్‌హుడ్. ఎవరికైతే తన అవసరం ఉందో.. వాళ్లకు అండగా నిలబడతాడు. అతనికి అనాథ పిల్లల శరణాలయంతో సంబంధం ఏమిన్నటది కథలో కీలకం. ప్రారంభ సన్నివేశాలు హీరో పాత్రని పరిచయం చేస్తాయి. పరిచయ గీతం తర్వాత కథ



మారిపోతుంది. కుటుంబమంతా కలిసి చూసేలా ఉంటుందీ చిత్రం. నితిన్ కెరీర్లోనూ, నా కెరీర్లోనూ అత్యుత్తమమైన చిత్రంగా నిలుస్తుంది" అని దర్శకుడు వెంకీ కుడుముల చెబుతున్నారు. అలాగే అదిదా సర్ప్రైజ్ పాట చేస్తున్నప్పుడు నిజంగా ఆ భంగిమలపై ఇంత వ్యతిరేకత వస్తుందని ఊహించలేదని, వాటిపై చిత్రబృందతో కలిసి నిర్ణయం తీసుకుంటామన్నారు.

## బ్లో అప్





# హుస్సైనీ కన్నుమూత

పవన్‌కళ్యాణ్ తమ్ముడు సినిమాలో తాను కిక్ బాక్సింగ్ నేర్చుకునేందుకు గురువు దగ్గర ఎంతో ఎదురు చూస్తాడు. కానీ ఆ సీన్ ఆయన నిజ జీవితంలో జరిగిన సంఘటన ఆధారంగా తీసారని చాలామందికి తెలియకపోవచ్చు. అలా పవన్ పట్టుబట్టి శిక్షణ తీసుకున్న ప్రముఖ మార్షల్ ఆర్ట్స్ గురువు, ప్రముఖ కోలీవుడ్ నటుడు షిహాన్ హుసైని (60) కన్నుమూశారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబసభ్యులు సామాజిక మాధ్యమాల వేదికగా ధ్రువీకరించారు. హుసైని మృతిపై పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. షిహాన్ హుసైని 1986లో విడుదలైన 'పున్నగై మన్నన్' చిత్రం ద్వారా తమిళ చిత్రసీమకు పరిచయమయ్యారు. పలు చిత్రాల్లో నటించిన ఆయనకు విజయ్ హీరోగా నటించిన 'బద్రి' సినిమా గుర్తింపునిచ్చింది. ఆర్చరీ లోనూ శిక్షకుడిగా ఉన్న ఆయన ఆ రంగంలో 400మందికి పైగా విద్యార్థులను తయారుచేశారు.

# ఛావా.. పార్లమెంట్‌లో ప్రదర్శన

ఇటీవల బాలీవుడ్ సినిమా దగ్గర భారీ వసూళ్లు సొంతం చేసుకున్న హిస్టారికల్ హిట్ చిత్రం "ఛావా". వెర్సటైల్ హీరో విక్కీ కౌశల్ హీరోగా రష్మిక మందన్నా హీరోయిన్‌గా దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన ఈ చిత్రం భారతీయుల్ని ఉద్వేగానికి లోనుచేసింది. ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవిత చరిత్రపై తెరకెక్కించిన ఈ చిత్రం ఇపుడు మరో హిస్టారికల్ మూమెంట్‌ని అందుకున్నట్టుగా తెలుస్తుంది. ఈ సినిమా తాలూకా స్పెషల్ స్క్రీనింగ్‌ని భారత పార్లమెంట్‌లో వేయనున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. మార్చ్ 27న సాయంత్రం 6 గంటలకి ఛావా ప్రత్యేక ప్రదర్శన ఉంటుందని, స్క్రీనింగ్‌కి దేశవ్యాప్తంగా ఎంపీలు హాజరు కానున్నట్టుగా తెలుస్తుంది. అలాగే దేశ ప్రధాని నరేంద్ర మోడీ కూడా స్క్రీనింగ్‌లో సినిమాని చూడనున్నారట. దీనితో ఈ టాక్ వైరల్‌గా మారింది. అయితే నార్త్‌లో చాలామంది మాట్లాడుకుంటున్నప్పటికీ మేకర్స్ నుంచి ఈ ప్రైడ్ మూమెంట్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మరి దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.



# దక్షిణాదిని పొగుడుతున్న సన్నీ..

ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ బాలీవుడ్‌ను వీడుతున్నట్టు ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా మరో నటుడు కూడా టాలీవుడ్‌కు షిఫ్ట్ కావాలనుందని ఆసక్తికర కామెంట్స్ చేశారు. బాలీవుడ్ నటుడు సన్నీదేవోల్, తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'జాట్. తాజాగా ఈ చిత్ర బృందం గురించి మాట్లాడుతూ సన్నీ ఆసక్తికర కామెంట్స్ చేశారు. "బాలీవుడ్ నిర్మాతలు టాలీవుడ్ వాళ్లని చూసి ఎన్నో విషయాలు నేర్చుకోవాలి. దక్షిణాదిలో నటీనటులను ఎంతో గౌరవిస్తారు. సినిమాను ఎలా నిర్మించాలో వాళ్లకు తెలుసు. వారిని చూసి బాలీవుడ్ నేర్చుకోవాలి. టాలీవుడ్ వాళ్లతో కలిసి వర్క్ చేయడం నాకు నచ్చింది. నేను సౌత్ వాళ్లతో మరో సినిమా చేయాలనుకుంటున్నా. ఇక్కడే స్థిరపడాలని కూడా అనిపిస్తోంది. గతంలో దర్శకుడు సినిమా కథను వివరిస్తే బాలీవుడ్ నిర్మాతలు దానికి ఓకే చెప్పేవారు. డైరెక్టర్లు చెప్పినట్టు నిర్మించేవాళ్లు. తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇండస్ట్రీ కమర్షియల్‌గా మారింది. దీంతో ప్రజలు బాలీవుడ్ సినిమాలపై ఆసక్తి కోల్పోయారు" అని చెప్పారు. ప్రస్తుతం సన్నీదేవోల్ 'జాట్'లో నటిస్తున్నారు. సయామీ ఖేర్, రెజీనా కథానాయికలు. రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. తాజాగా దీని ట్రైలర్ విడుదల చేయగా అది ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఏప్రిల్ 10న సినిమా విడుదల కానుంది.



## ఓటీటీలోకి....
# 28న మజాకా

ఈమధ్యనే బాక్సాఫీస్ దగ్గర ఓకే అనిపించుకున్న సందీప్ కిషన్ కామెడీ ఎంటర్‌టైనర్ మజాకా–ఇప్పుడు ఓటీటీలో సందడి చేయడానికి డేట్ ఫిక్స్ చేసుకుంది. రీతూ వర్మ హీరోయిన్‌గా,రావు రమేష్,అన్నుసాగర్ లీడ్ పాత్రల్లో దర్శకుడు త్రినాధరావు నక్కిన తెరకెక్కించిన చిత్రమే "మజాకా". ఓటీటీ రైట్స్‌ని జీ5 సొంతం చేసుకోగా, మార్చ్ 28నుంచి సినిమా స్ట్రీమ్ అవుతున్నట్టు తాజాగా ప్రకటించారు. ఇక ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తే.. రాజేష్ దండా నిర్మించారు.

**4న 'టెస్ట్' స్పోర్ట్స్ డ్రామా**

మాధవన్, నయనతార, సిద్ధార్థ్, మీరా జాస్మిన్ కీలక పాత్రల్లో రూపొందిన స్పోర్ట్స్ డ్రామా 'టెస్ట్'. ఎస్ శశికాంత్ దర్శకుడు. ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఏప్రిల్ 4నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈక్రమంలో చిత్ర ట్రైలర్ విడుదలైంది. చెన్నైలో జరిగిన ఒక అంతర్జాతీయ టెస్ట్ క్రికెట్ మ్యాచ్ ముగ్గురు వ్యక్తుల జీవితాలను ఎలా ప్రభావితం చేసిందనే కథాంశంతో దీనిని రూపొందించారు. తమిళంతోపాటు, తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానున్నట్లు నెట్‌ఫ్లిక్స్ తెలిపింది.

**4న హోమ్‌టౌన్**

రాజీవ్ కనకాల,ఝాన్సీ ప్రధానపాత్రల్లో తెరకెక్కిన సిరీస్ 'హోమ్ టౌన్'. శ్రీకాంత్ దర్శకత్వం వహించారు. ఓటీటీ వేదికగా ఏప్రిల్ 4 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీనిట్రైలర్‌ను నటుడు విజయ్‌దేవరకొండ విడుదల చేశారు.సిరీస్ లో నటించిన యువ నటులను అభినందించారు. సిరీస్ మంచి విజయం సాధించాలని విజయ్ ఆకాంక్షించారు.

# తారక్ ఫ్యాన్స్ అప్‌సెట్

ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించిన భారీ హిట్ చిత్రం "దేవర".అయితే ఈ చిత్రం మన దగ్గర నార్మల్ రన్ తర్వాత ఇపుడు జపాన్ దేశంలో రిలీజ్‌కి సిద్ధమైంది.మరి అక్కడ ప్రమోషన్స్ కోసం స్వయంగా ఎన్టీఆర్ వెళ్లి మరీ అక్కడి ఫ్యాన్స్‌తో ముచ్చటిస్తూ మంచి ఎనర్జిటిక్‌గా ప్రమోషన్స్ చేస్తున్నారు.అయితే ఇదే ఇపుడు తారక్ అభిమానులని డిజప్పాయింట్ చేస్తున్నట్టుగా తెలుస్తుంది. ఎన్టీఆర్ ఇపుడు జపాన్‌లో చేస్తున్న రేంజ్ ప్రమోషన్స్ మన తెలుగు రాష్ట్రాల్లో బాగా మిస్ అయ్యాయని చెప్పాలి. తనని ప్రేమించే అభిమానులకి సినిమా రిలీజ్ ముందు సరైన ప్రమోషన్స్ ఈవెంట్స్ లాంటివి లేకుండానే మేకర్స్ కానిచ్చేశారు. దీనితో అప్పుడు తీవ్రనిరాశకి లోనైన ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఇపుడు జపాన్‌లో ప్రమోషన్స్ చూసి మళ్లీ నిరాశ చెందుతున్నారు. మన దగ్గర కూడా తమ హీరో ఇలా చేయాల్సిందని భావిస్తున్నారు. ఇక తారక్ ఫుల్ స్వింగ్‌లో జపాన్ ప్రమోషన్స్ చేస్తుండగా అక్కడ మార్చ్ 27న సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతుంది.

